www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ధరణి పెండింగ్ దరఖాస్తులను 10 రోజుల్లో పరిష్కరించండి

రోజుకు 100 దరఖాస్తుల పరిశీలన.. ఆమోదిస్తే ప్రొసీడింగ్ ఆర్డర్ అప్‌లోడ్ చేయాలి

తిరస్కరిస్తే కారణాలను నమోదు చేయాలి.. సీసీఎల్ఏ నవీన్‌మిత్తల్ ఆదేశాలు

తహసీల్దార్లకు అదనపు లాగిన్.. డిప్యూటీ తహసీల్దార్లకు వేరుగా..

లాగిన్లు ఇచ్చే అధికారం అదనపు కలెక్టర్లకు అప్పగింత

ధరణి పెండింగ్ దరఖాస్తులపై పలు కీలక నిర్ణయాలు

11

శనివారం | 15-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 60 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 2.33 తదుపరి దశమి; నక్షత్రం: ఉత్తర ఉ. 8.14 తదుపరి హస్త; వర్జ్యం: సా.5.40-7.28; దుర్ముహూర్తం: ఉ.5.44-7.28; అమృతఘడియలు: తె.4.28 మొదలు; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.46 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అక్రమ క్రమబద్ధీకరణపై విజిలెన్స్

నివేదిక సిద్ధం

త్వరలో ప్రభుత్వానికి అందజేత

అసెంబ్లీ ఎన్నికల వేళ అక్రమపర్వం

రాజధాని, చుట్టుపక్కల ప్రాంతాల్లో యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల కబ్జా

రెగ్యులరైజ్ చేసిన అధికారులు

బీఆర్ఎస్ నేతల ప్రమేయం

వారి ఇంట్లో పనివాళ్లు, డ్రైవర్లు, కార్యకర్తల పేర్లపై క్రమబద్ధీకరణ

రూ.కోట్ల విలువైన స్థలాలను కారు చవకగా కొట్టేసిన వైనం

వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి

సీఎం ఆదేశాలతో విచారణ



హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ ఎన్నికల వేళ హడావుడిగా చేపట్టిన ప్రభుత్వ భూముల, స్థలాల క్రమబద్ధీకరణ వ్యవహారంపై దర్యాప్తు జరిపిన విజిలెన్స్ అధికారులు నివేదిక రూపొందించారు. ఒక సర్వే నెంబరులో ఎంత మందికి క్రమబద్ధీకరించారు? ఆ మొత్తం భూమి విస్తీర్ణం ఎంత? బహిరంగ మార్కెట్‌లో ఎంత ధర పలుకుతోంది? రిజిస్ట్రేషన్ విలువ ఎంత? కబ్జాదారులు చేసుకున్న అక్రమ క్రమబద్ధీకరణ వెనుక ఎవరి హస్తం ఉంది? అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారా? వంటి సమగ్ర వివరాలను విజిలెన్స్ అధికారులు ఈ నివేదికలో పొందుపరిచినట్లు సమాచారం. త్వరలో దీనిని ప్రభుత్వానికి అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో కబ్జాదారులతోపాటు

మిగతా 13వ పేజీలో...

పాఠ్య పుస్తకాల 'ముందుమాట' వివాదంలో..

అధికారులపై వేటు!

ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, పాఠ్య పుస్తకాల ప్రెస్ డైరెక్టర్ బదిలీ

ముందుమాట కనిపించకుండా పుస్తకం అట్టకు తొలి పేజీని అతికించాలని ప్రభుత్వ నిర్ణయం

13



బీసీ లెక్కల కోసం..

ఓటర్ల జాబితా ఆధారంగా సర్వే!

ఆ తర్వాతే బీసీ రిజర్వేషన్ల ఖరారు

ఆ వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు

సర్వేపై త్వరలో తుది నిర్ణయం

కులగణన ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందునే!

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు గాను బీసీల రిజర్వేషన్‌ను ఖరారు చేసేందుకు.. ఓటర్ల జాబితా ఆధారంగా సర్వే నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ సర్వేలో తేలిన లెక్కల ప్రకారం రిజర్వేషన్లపై కసరత్తు చేయాలని భావిస్తోంది. వాస్తవానికి రాష్ట్రంలో కులగణన చేపట్టి.. బీసీల లెక్కలు తేల్చాక.. అందుకనుగుణంగా వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ, కులగణనకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండడం, మరోవైపు స్థానిక ఎన్నికలనూ రాజ్యాంగబద్ధంగా ఐదేళ్లకోసారి నిర్వహించాల్సి ఉండడంతో ప్రభుత్వం ఓటర్ల జాబితా ఆధారిత సర్వే వైపు మొగ్గు చూపిస్తోంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి తాజా ఓటర్ల జాబితాను తీసుకుని, ఆ జాబితాతో సిబ్బందిని గ్రామపంచాయతీల వారీగా ఇంటింటికీ పంపి.. కులాలవారీ లెక్కలు సేకరిస్తారు. గ్రామాల వారీగా ఏ కులం

మిగతా 11వ పేజీలో...



ఆర్మీ అమ్ముల పొదిలో

నాగాస్త్రం

తొలి విడతలో సైన్యానికి చేరిన 120 డ్రోన్లు

2

ట్రా'ఫికర్'ను తీర్చే డ్రోన్లు వచ్చేశాయ్!

సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణ, నియంత్రణ కోసం డ్రోన్లు

పనితీరును పరిశీలించిన సైబరాబాద్ పోలీసులు

13

ఆరేళ్ల బాలికపై హత్యాచారం

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ సమీపంలో ఘోరం

వారం క్రితమే రైస్‌మిల్లులో పనికి కుదిరిన దంపతులు

రాత్రి బాలిక నిద్రిస్తుండగా అపహరించిన దుండగుడు

పక్కనే మరో రైస్ మిల్లులోకి తీసుకెళ్లి అత్యాచారం, హత్య

సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం

3



ప్రముఖ రచయిత

నండూరి పార్థసారథి కన్నుమూత

11

సంగీత, నృత్య, నాటక, చిత్ర, శిల్ప కళలపై వందలాది విమర్శనాత్మక వ్యాసాల రచన

పవన్ డిప్యూటీ సీఎం

ఆయనకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి

లోకేశ్‌కు ఐటీ, హెచ్ఆర్‌డీ, ఆర్టీజీ

మంత్రులకు శాఖలు కేటాయించిన చంద్రబాబు

అచ్చెన్నకు వ్యవసాయం.. అనితకు హోంశాఖ

పయ్యావులకు ఆర్థిక, సభా వ్యవహారాలు

కొల్లు- ఎక్సైజ్, గనులు.. ఆనం-దేవాదాయం

బాబు వద్దే సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు

ఎవరికీ కేటాయించని శాఖలు ఆయన దగ్గరే



అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కసరత్తు జరిపిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. తన సహచర మంత్రులకు శాఖలు కేటాయించారు. అందరూ ఊహించినట్లే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి హోదా కట్టబెట్టారు. కీలకమైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా.. పర్యావరణం, అడవులు.. సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలను ఆయనకు కేటాయించారు. నారా లోకేశ్‌కు మానవ వనరులు (విద్య), ఐటీ, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్స్ శాఖలతో పాటు

మిగతా 14వ పేజీలో...

టీడీపీ ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు యాదవ్?

మరోసారి ఉత్తరాంధ్ర బీసీ నేతకు చాన్స్!

టీటీడీ ఈవోగా శ్యామలరావు

గొర్రెలతో గాబరా

ఈడీ రంగ ప్రవేశంతో సంబంధిత అధికారుల్లో టెన్షన్

పూర్తి వివరాల కోసం జిల్లాలకు టీజీఎస్‌జీడీసీఎఫ్‌ఎల్ ఎండీ మెయిల్

శుక్రవారం టీజీఎస్‌జీడీసీఎఫ్‌ఎల్ ఆఫీసుకు రాని ఈడీ అధికారులు

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల వివరాలివ్వండి! వారి చిరునామా.. ఫోన్ నంబరు.. బ్యాంకు ఖాతా వివరాలూ కావాలి! జిల్లాలవారీగా గొర్రెలు అమ్మిన యజమానుల పూర్తి వివరాలూ ఇవ్వండి! రవాణా చేసిన వాహనాలు.. ఏజెన్సీల సమాచారం కూడా! గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలపై రంగంలోకి దిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అడిగిన వివరాల్లో కొన్ని మాత్రమే ఇవి! సదరు సమాచారం అందించేందుకు తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ (టీజీఎస్‌జీడీసీఎఫ్‌ఎల్) అధికారులు టెన్షన్ పడుతున్నారు. ఈడీ రంగంలోకి

మిగతా 13వ పేజీలో...



నీట్ మార్కులు, ర్యాంకులపై

సర్కార్ రిగ్గింగ్

24 లక్షల మంది ఆకాంక్షల్ని తొక్కేసింది

పేపర్ లీక్ కాకపోతే బిహార్‌లో 13 అరెస్టులు ఎందుకు?: ఖర్గే

యువత కలలపై దాడి: ప్రియాంక

'చీట్'లా 'నీట్': జైరాం రమేశ్

ఎంట్రన్స్ కుంభకోణాలకు చరమగీతం పాడదాం: తమిళనాడు సీఎం స్టాలిన్

సీబీఐ దర్యాప్తు కోసం సుప్రీంలో పిటిషన్లు

కేంద్రానికి, ఎన్‌టీఏకి నోటీసులు జారీ

2

ఐసెట్‌లో 91 శాతం ఉత్తీర్ణత

11



సయ్యద్ మునీబుల్లా హుస్సేన్‌కు మొదటి ర్యాంకు

త్వరలోనే కౌన్సెలింగ్ షెడ్యూల్

ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి

ఆర్మీ అమ్ముల పొదిలో 'నాగాస్త్రం'

» తొలి విడతలో సైన్యానికి చేరిన 120 డ్రోన్లు

న్యూఢిల్లీ, జూన్ 14: రక్షణ రంగంలో స్వావలంబన దిశగా కీలక ముందడుగు పడింది. తొలిసారి స్వదేశీయంగా రూపొందించిన ఆత్మాహుతి డ్రోన్ నాగాస్త్ర-1 భారత ఆర్మీ అమ్ములపొదిలో చేరింది. నాగ్‌పూర్‌లోని సోలార్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఎకనామిక్స్ ఎక్స్‌ప్లోజివ్ లిమిటెడ్ (ఈఈఎల్) ఈ యూఏవీ (మానవ రహిత విమానం) డ్రోన్లను తయారు చేసింది. తొలి విడతలో భాగంగా 120 డ్రోన్లను ఆర్మీకి అందించింది. పుల్గావ్‌లోని డిపోకు వాటిని తరలించారు. 9 కేజీల బరువుండే ఈ పోర్టబుల్ డ్రోన్ గాలిలో ఏకధాటిగా 30 నిమిషాలు ఎగరగలదు. ఒక కేజీ బరువున్న పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. జీపీఎస్ ఆధారంగా పనిచేసే ఈ డ్రోన్ కామకేజ్ మోడ్‌లో అత్యుత్తమంగా పనిచేస్తుంది. లక్ష్యాలపై కచ్చితత్వంతో దాడిచేస్తుంది. ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్ కారణంగా నాగాస్త్ర-1 తక్కువ శబ్దంతో ప్రయాణిస్తుంది. ఇది 200 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఎగిరితే శత్రువుకు దీన్ని గుర్తించడం కూడా కష్టమే. దీనిలో పగలు, రాత్రి పనిచేసేందుకు వీలుగా నిఘా కెమెరాలు ఉన్నాయి.

అగ్నిపథ్ సమీక్షకు కమిటీ..17న కేంద్రానికి నివేదిక

న్యూఢిల్లీ, జూన్ 14: మిత్రపక్షాల నుంచి వచ్చిన ఒత్తిళ్ల నేపథ్యంలో అగ్నిపథ్‌లోని లోపాలను సరిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఈ పథకాన్ని సమీక్షించడానికి, అగ్నివీర్‌లకు మరింత లాభం చేకూర్చే అంశాలపై చర్చించేందుకు పది మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఈ బృందం ఈ స్కీమ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చడానికి అవసరమైన సిఫారసులు చేయనుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఇటలీలో జరిగే జీ7 సదస్సు నుంచి తిరిగొచ్చిన తర్వాత ఈ నెల 17, 18వ తేదీల్లో ఈ కమిటీ నివేదిక ఇవ్వనున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అలాగే భారత సైన్యం కూడా ఈ పథకంపై ఒక అంతర్గత నివేదికను కేంద్రానికి సమర్పించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ సిఫారసులతోపాటు మిత్రపక్షాల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రధాని కార్యాలయం తుది నిర్ణయం తీసుకునే అవకాశ ఉంది. అగ్నిపథ్ పథకం సమీక్ష అంశం కూడా మోదీ ప్రభుత్వ మొదటి 100 రోజుల ఎజెండాలో ఉంది.

త్వరలో క్యాబినెట్ ముందుకు కోవింద్ కమిటీ నివేదిక

న్యూఢిల్లీ, జూన్ 14: 'ఒకే దేశం - ఒకే ఎన్నిక'పై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదికను వీలైనంత త్వరగా కేంద్ర కేబినెట్ ముందుంచాలని న్యాయ మంత్రిత్వ శాఖ యోచిస్తున్నట్టు తెలిసింది. ఇది మోదీ ప్రభుత్వం 100 రోజుల ఎజెండాలో భాగంగా ఉన్నట్టు శుక్రవారం సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా ఒకే దేశం - ఒకే ఎన్నికపై రామ్‌నాథ్ కోవింద్ కమిటీ తన నివేదికను మార్చి 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. ఇందులో మొదటి దశగా లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని, ఆ తర్వాత 100 రోజుల్లోగా స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని సూచించింది. కమిటీ సిఫారసుల అమలును పరిశీలించేందుకుగాను ఒక అమలు బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. మరోవైపు జమిలి ఎన్నికలపై లా కమిషన్ కూడా సొంతంగా వేరే నివేదికను రూపొందిస్తున్నట్టు సమాచారం.

జూలై 22న కేంద్ర బడ్జెట్!

న్యూఢిల్లీ, జూన్ 14: 2024-25 ఏడాదికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను జూలై 22న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కొత్తగా ఏర్పడిన 18వ లోక్‌సభ సమావేశాలు జూన్ 24 నుంచి జూలై 3 వరకు జరుగుతాయని పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఇందులో కేవలం ఐదు రోజులే పనిదినాలు ఉన్నాయి. సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నికకే ఈ సమయం సరిపోతుంది. అందువల్ల పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టాలని భావిస్తున్నారు. జూలై 22 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు వర్షాకాల సమావేశాలు నిర్వహించాలని అనుకుంటున్నారు. ఆ సమావేశాల తొలి రోజు, జూలై 22న పూర్తి స్థాయి బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెడతారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

వయనాడ్ బరిలో ప్రియాంకా గాంధీ?

న్యూఢిల్లీ, జూన్ 14: కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి పోటీ చేయనున్నట్టు తెలుస్తోంది. ఆ పార్టీ అగ్రనేత, ప్రియాంక సోదరుడు రాహుల్ గాంధీ తాజాగా జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేశారు. యూపీలోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్ నియోజక వర్గాల నుంచి బరిలోకి దిగి విజయం దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఒకస్థానాన్ని వదులుకోవాల్సి ఉంటుంది. దీంతో గాంధీల కుటుంబానికి వెన్నుదన్నుగా ఉన్న రాయ్‌బరేలీ నియోజకవర్గం ఉంచుకుని.. వయనాడ్‌ను వదులుకునేందుకు రాహుల్ గాంధీ సిద్ధమవుతున్నట్టు సమాచారం. దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు. అయితే.. రాహుల్ కనుక వయనాడ్ స్థానాన్ని వదులుకుంటే ఇక్కడ జరిగే ఉప ఎన్నికలో ప్రియాంక గాంధీ పోటీ చేసే అవకాశం మెండుగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే.. ఆమె తొలి సారి ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేసినట్టు అవుతుంది.

పోక్సో కేసులో యడియూరప్పకు ఉపశమనం

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో ఇరకాటంలో పడ్డ బీజేపీ సీనియర్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు ఉపశమనం లభించింది. రెండువారాల పాటు ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం శుక్రవారం ఆదేశించింది. యడియూరప్పకు వయసు పైబడిందనీ, సహజంగానే ఆరోగ్య సమస్యలు ఉంటాయనీ, అరెస్టు చేసి విచారణ చేయాల్సిన అవసరం లేదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ ఎస్. దీక్షిత్ అభిప్రాయపడ్డారు. విచారణ చేయవచ్చనీ, అరెస్టు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. యడియూరప్పకు ఉపశమనం లభించడంతో పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

కొవిడ్ అడ్వాన్స్ సదుపాయం నిలిపేసిన ఈపీఎఫ్‌వో

న్యూఢిల్లీ, జూన్ 14: కొవిడ్ మహమ్మారి కాలంలో ఈపీఎఫ్ సభ్యులకు అందుబాటులోకి తెచ్చిన కొవిడ్ అడ్వాన్స్ సదుపాయాన్ని నిలిపివేసినట్టు ఈపీఎఫ్‌వో ప్రకటించింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని ఓ సర్క్యులర్‌లో పేర్కొంది. కొవిడ్ మొదటి వేవ్‌లో ఈపీఎఫ్ సభ్యుల కోసం ఈ నాన్ రిఫండబుల్ అడ్వాన్స్ సదుపాయాన్ని ఈపీఎఫ్‌వో అందుబాటులోకి తెచ్చింది. రెండో వేవ్ సందర్భంలోనూ అడ్వాన్స్ సదుపాయానికి అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా మూడు నెలల బేసిక్ వేతనం, డీఏ లేదా ఈపీఎఫ్ ఖాతాలో అందుబాటులో ఉన్న మొత్తంలో 75% వరకు తీసుకునేందుకు అవకాశమిచ్చారు.

సైబర్ నేరాల కోసం విదేశాలకు యువత తరలింపు

» నాసిక్‌వాసిని అరెస్టు చేసిన ఎన్ఐఏ

న్యూఢిల్లీ, జూన్ 14: ఉద్యోగాల పేరుతో యువతీయువకులను విదేశాలకు అక్రమంగా తీసుకెళ్లిన మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన సుదర్శన్ దరాడే అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. చట్టబద్ధమైన ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అక్కడ వారి చేత సైబర్ నేరాలు, వలపు వల విసిరేయడంలాంటి అకృత్యాలు చేయించినట్టు చెప్పారు. కంబోడియా, లావోస్, ఇతర ప్రాంతాల్లో నకిలీ కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి చట్టవ్యతిరేక ఆన్‌లైన్ కార్యకలాపాలు, క్రెడిట్ కార్డు మోసాలకు పాల్పడినట్టు తెలిపారు. విస్తృతమైన నెట్‌వర్క్ నెలకొల్పి యూఏఈ, వియత్నాంలో కూడా మోసాలు చేసినట్టు పేర్కొన్నారు. ఈ కేసులోనే గత నెల 27న అయిదుగుర్ని అరెస్టు చేశారు.

రేణుకాస్వామి హత్య కేసులో మరో ఇద్దరి అరెస్ట్

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో శుక్రవారం మరో ఇద్దరిని అరెస్టు చేశారు. కేసులో ఏ6గా ఉన్న జగదీశ్, ఏ7గా అని అలియాస్ అనిల్‌కుమార్‌ను చిత్రదుర్గ డీఎస్పీ దినకర్ నేతృత్వంలో అరెస్టు చేశారు. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి సోషల్ మీడియా ఖాతాల ద్వారా నటి, సినీ నటుడు దర్శన్ సన్నిహితురాలు పవిత్రాగౌడకు అశ్లీల సందేశాలు పంపడమే హత్యకు దారి తీసిందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. కాగా, రేణుకాస్వామి హత్య కేసులో సినీనటుడు దర్శన్‌తోపాటు ఎవరికీ ప్రత్యేక మర్యాదలు కల్పించవద్దని సీఎం సిద్దరామయ్య పోలీసు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై 19న విచారణ

న్యూఢిల్లీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీని న్యాయస్థానం మరోసారి పొడిగించింది. కేజ్రీవాల్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై జూన్ 19వ తేదీన విచారిస్తామని న్యాయమూర్తి వెల్లడించారు. జ్యుడిషియల్ కస్టడీ ముగియడంతో శుక్రవారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ముందు కేజ్రీవాల్‌ను వర్చువల్‌గా హాజరు పరిచారు. కాగా, మెడికల్ టెస్టుల సమయంలో తన భార్యను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చూసేందుకు అనుమతి ఇవ్వాలని కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు.

మరి 13 అరెస్టులు ఎందుకు?

నీట్ పేపర్ లీక్ కాలేదన్న వ్యాఖ్యలపై ఖర్గే.. 24 లక్షల మంది యువత ఆకాంక్షల్ని తొక్కేశారని ధ్వజం

» సీబీఐ దర్యాప్తు కోరుతూ ఏడు పిటిషన్లు

» కేంద్రానికి, ఎన్‌టీఏకి సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ, జూన్ 14: నీట్ అక్రమాలు, పేపర్‌లీక్ ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మోదీ సర్కారుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. మోదీ ప్రభుత్వం నీట్ కుంభకోణాన్ని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎన్‌టీఏ ద్వారా కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. నీట్ అక్రమాలపై ఆయన సర్కారును ఉద్దేశించి 'ఎక్స్'లో ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ కూడా ప్రభుత్వంపై మండిపడ్డారు. "లక్షలాది మంది యువత, వారి తల్లిదండ్రుల ఆందోళనను పట్టించుకోకపోవడం ద్వారా.. వ్యవస్థలో ఎవరిని కాపాడడానికి ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నదే ప్రశ్న" అని ప్రియాంక ధ్వజమెత్తారు.

నీట్ కాదు.. చీట్

'నీట్' ఈ ప్రభుత్వ హయాంలో 'చీట్ (సెంట్రల్ హైప్డ్ ఎంట్రన్స్ అడ్మిషన్ టెస్ట్)'లా తయారైందని.. కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ధ్వజమెత్తారు. మోదీ హయాంలో పరీక్షల పవిత్రత పదేపదే ప్రమాదంలో పడుతోందని.. పేపర్ లీక్‌లు సాధారణంగా మారిపోయాయని.. నీట్ పేపర్ లీక్ కుంభకోణం కూడా అలాంటివాటిలో ఒకటని ఆయన ఆగ్రహం వెలిబుచ్చారు. "ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ పాలనలో 40కి పైగా పేపర్ లీక్ ఘటనలు బయటపడ్డాయి. గుజరాత్ అయితే పేపర్ లీక్‌లకు రాజధానిగా మారింది. అక్కణ్నుంచే దేశం మొత్తానికీ పేపర్లు లీక్ అవుతున్నాయి. మధ్యప్రదేశ్.. భారీ వ్యాపం కుంభకోణానికి పేరు మోసింది. ఇలాంటి అక్రమాలు లక్షలాది మంది యువ విద్యార్థుల ఆకాంక్షలను దెబ్బతీస్తున్నాయి" అని జైరామ్ రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక.. కాంగ్రెస్ మీడియా అండ్ పబ్లిసిటీ విభాగం అధిపతి పవన్ ఖేడా అయితే నీట్ కుంభకోణాన్ని వ్యాపం 2.0గా అభివర్ణించారు. నీట్ అక్రమాలపై దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు, కోర్టు కేసులు ఎవరో ప్రేరేపిస్తే జరుగుతున్నవంటూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలు.. 24 లక్షల మంది నీట్ అభ్యర్థుల పుండుపై కారం జల్లినట్టుగా ఉన్నాయని మండిపడ్డారు. అంతమంది యువత భవిష్యత్తు ప్రమాదంలో ఉన్నప్పుడు ప్రధాని మోదీ మౌనంగా ఎందుకు ఉన్నారని ఆయన నిలదీశారు. "గత ఏడాది, ఈ ఏడాది నీట్ పరీక్షల్లో 580కి మించి స్కోర్ చేసిన విద్యార్థులందరి వివరాలూ బయటపెట్టాలి. వారు పరీక్ష రాసిన కేంద్రాల వివరాలను కూడా బహిర్గతం చేయాలి. అప్పుడు.. నీట్ పరీక్ష రాయడానికి ఎంత మంది విద్యార్థులు తాము ఉన్న చోటు నుంచి ఎంత దూరం ప్రయాణించారో బయటపడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. నీట్‌లో అవకతవకలపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఫోరెన్సిక్ దర్యాప్తు చేయిస్తేనే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ఇక.. నీట్ తరహా ప్రవేశపరీక్ష కుంభకోణాలకు తాము చరమగీతం పాడతామని, అది తమ బాధ్యత అని తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటించారు. "నీట్‌లో అక్రమాలు జరిగాయని మొట్టమొదట చెప్పింది తమిళనాడే. ఇప్పుడు యావద్దేశం అదే మాట చెబుతోంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేసిన ప్రశ్నలు

- "నీట్ పేపర్ లీక్ కాకపోతే.. బిహార్‌లో 13 మంది నిందితులను ఆ ఆరోపణపై ఎందుకు అరెస్ట్ చేశారు? బిహార్‌లోని ఎడ్యుకేషన్ మాఫియా, పేపర్ లీక్ రాకెట్‌లో భాగమైన వ్యవస్థీకృత గ్యాంగులు నీట్ అభ్యర్థుల నుంచి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల దాకా వసూలు చేసిన విషయాన్ని పట్నా పోలీస్ శాఖలోని 'ఆర్థిక నేరాల విభాగం' బయటపెట్టలేదా?
- గుజరాత్‌లోని గోధ్రాలో ఒక కోచింగ్ సెంటర్ నడుపుతున్న వ్యక్తి, ఒక టీచర్, మరొకరు కలిసి నడిపిన నీట్-యూజీ చీటింగ్ రాకెట్ గుట్టు రట్టు కాలేదా? ఈ ముగ్గురి మధ్య రూ.12 కోట్ల లావాదేవీలు జరిగిన విషయం బయటకు రాలేదా?
- 24 లక్షల మంది రాత్రింబవళ్లూ శ్రమించి.. వైద్య వృత్తిలో ప్రవేశించడానికి నీట్ పరీక్ష రాశారు. మోదీ సర్కారు ఎన్‌టీఏని దుర్వినియోగం చేసి.. మార్కులు, ర్యాంకులను రిగ్గింగ్ చేసింది. అందుకే రిజర్వుడు సీట్లకు కూడా ఈసారి కటాఫ్ పెరిగింది. ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో రాయితీ ఫీజులకు సీట్లు పొందకుండా చేసేందుకే.. గ్రేస్ మార్కులు, పేపర్ లీక్, రిగ్గింగ్ ఆటలు ఆడినట్లు కనిపిస్తోంది. మోదీ ప్రభుత్వం 24 లక్షల మంది యువత ఆకాంక్షలను తొక్కేసింది.

సీబీఐ దర్యాప్తుపై మీ స్పందనేంటి?

నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపైనా, పేపర్ లీక్ ఆరోపణలపైనా సీబీఐ దర్యాప్తు జరిపించాలంటూ దాఖలైన పిటిషన్లపై స్పందన తెలపాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని, సీబీఐని, బిహార్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. రెండు వారాల్లోగా స్పందన తెలపాలని సీబీఐని ఆదేశించిన సర్వోన్నత న్యాయస్థానం.. మిగతా వారికి తదుపరి విచారణ జరిగే జూలై 8 దాకా అందుకు సమయం ఇచ్చింది. నీట్‌లో అక్రమాలు, పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కోరుతూ మొత్తం ఏడు రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆ పిటిషన్లపై విచారణ జరిపింది. వాటిలో ముఖ్యమైనది.. నీట్-2024 అభ్యర్థులైన హితేన్ సింగ్ కాశ్యప్, పలక్ మిత్తల్ వేసిన పిటిషన్. పరీక్షా కేంద్రాల్లో జరిగిన అక్రమాలపై వారు తమ పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించారు. ఉదాహరణకు.. ఒడిసా, కర్ణాటక, ఝార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 16 మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి గుజరాత్‌లోని గోధ్రాలో ఉన్న ఒక పరీక్షా కేంద్రాన్ని ఎంచుకున్నారని తెలిపారు. నీట్ పరీక్షలో మంచి మార్కుల కోసం వారు రూ.10 లక్షలు లంచంగా ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈమేరకు గుజరాత్ పోలీసులు ఒక టీచర్‌పై కేసు కూడా నమోదు చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే.. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి పట్నా (బిహార్)లో ఎఫ్ఐఆర్ దాఖలైన విషయాన్ని కూడా తమ పిటిషన్‌లో వివరించారు. యూపీలో నీట్ పేపర్ లీక్ రాకెట్‌కు సంబంధించిన ఒక రింగ్ లీడర్ ప్రమేయం ఉందంటూ యూపీలో వచ్చిన వార్తా కథనాల గురించి కూడా అందులో ప్రస్తావించారు. కాగా.. నీట్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా పలు హైకోర్టుల్లో దాఖలైన పిటిషన్లన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ ఎన్‌టీఏ వేసిన పిటిషన్‌పై కూడా ధర్మాసనం ఆయా ప్రైవేట్ పార్టీలకు నోటీసులు జారీ చేసింది.



ఆ ఆత్మహత్యలకు నీట్‌తో సంబంధం లేదు

విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదుల్లో ఒకరు.. రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యల గురించి ప్రస్తావించగా ధర్మాసనం అందుకు అభ్యంతరం వ్యక్తం చేసింది. కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలకు నీట్ 2024 కాదన్న జస్టిస్ విక్రమ్‌నాథ్.. "అనవసరంగా భావోద్వేగపరమైన వాదనలను ఇక్కడ వినిపించొద్దు" అని హెచ్చరించారు. ఇది 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని.. సీబీఐ దర్యాప్తు తప్పనిసరి అని పిటిషనర్ల తరఫు న్యాయవాది పేర్కొనగా.. ఆ విషయం తమకు తెలుసని, కానీ ఎన్‌టీఏ వాదనలు వినకుండా ఈ విషయంలో ఎక్స్‌పార్టీ డిక్రీ (కక్షిదారు లేకుండా ఇచ్చే తీర్పు) ఇవ్వలేమని జస్టిస్ నాథ్ స్పష్టం చేశారు.



అరుంధతీ రాయ్‌పై 'ఉపా' కేసు



న్యూఢిల్లీ, జూన్ 14: ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం (ఉపా) కింద విచారణ జరిపేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా శుక్రవారం ఆమోదం తెలిపారు. కశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ లా విభాగం మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌ను విచారించడానికి కూడా అంగీకారం తెలిపారు. 2010 అక్టోబరు 21న ఢిల్లీలో 'ఆజాదీ-ద ఓన్లీ వే' అన్న పేరుతో జరిగిన కార్యక్రమంలో భారత్ నుంచి కశ్మీర్ విడిపోవాలంటూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారంటూ కేసులు నమోదయ్యాయి. ఈ ప్రసంగాలపై కశ్మీర్‌కు చెందిన సుశీల్ పండిట్ అనే వ్యక్తి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు కోర్టులో ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఐపీసీలోని పలు సెక్షన్ల కింద నమోదైన కేసుల విచారణకు అక్టోబరులో ఆమోదం తెలపగా, తాజాగా ఉపా కింద విచారణకు అంగీకారం తెలిపారు. వారితో పాటు కశ్మీరీ వేర్పాటువాద నాయకుడు సయ్యద్ అలీ షా గిలానీ, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ లెక్చరర్ ఎస్ఏఆర్ గిలానీ, ప్రముఖ రచయిత వరవరరావులపైనా కేసులు నమోదయ్యాయి.

కశ్మీర్ బడుల్లో జనగణమన తప్పనిసరి

శ్రీనగర్, జూన్ 14: కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ-కశ్మీర్‌లోని పాఠశాలల్లో జాతీయ గీతం జనగణమన ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సర్క్యులర్ జారీ చేశారు. ప్రయివేటు పాఠశాలలకు కూడా ఇది వర్తిస్తుంది. పాఠశాలల్లో ఉదయం జరిగే అసెంబ్లీల్లో దీన్ని ఆలపించాలని నాలుగేళ్ల క్రితమే ఆదేశాలు ఇచ్చినా అవి సక్రమంగా అమలుకాకపోవడంతో మళ్లీ ఈ సర్క్యులర్ పంపించారు.

భారత్‌లో న్యాయబద్ధంగా ఎన్నికలు

విస్తృత సాంకేతికతతో అత్యంత పారదర్శకంగా నిర్వహణ

» నా గెలుపు ప్రపంచ ప్రజాస్వామ్య విజయం

» టెక్నాలజీలో గుత్తాధిపత్యం పోవాలి..

» జి-7 సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

బారి, జూన్ 14: భారత్‌లో ఇటీవలి ఎన్నికలు అత్యంత న్యాయంగా జరిగాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రతి అంచెలోనూ విస్తృత స్థాయి సాంకేతికత వినియోగంతో పూర్తి పారదర్శకతతో నిర్వహించారని తెలిపారు. తాను మరోసారి గెలవడం ప్రజాస్వామ్య ప్రపంచానికంతటికీ విజయంలాంటిదని అభివర్ణించారు. ఇటలీలోని అపూలియాలో జరుగుతున్న జీ7 దేశాల కూటమి సదస్సులో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇది జి-7 కూటమి 50వ సమావేశం. ఆహ్వానిత దేశ హోదాలో హాజరైన మోదీ మాట్లాడుతూ.. సాంకేతికతలో గుత్తాధిపత్యం పోవాలని, ఫలితాలు అందరికీ అందాలని ఆకాంక్షించారు. సమ్మిళిత సమాజానికి పునాది వేసేందుకు, అసమానతలు రూపుమాపేందుకు ఇది అవసరమని పేర్కొన్నారు. కృత్రిమ మేధను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, సురక్షితంగా అందుబాటులోకి తెచ్చేందుకు అన్ని దేశాలతో కలిసి పనిచేస్తూనే ఉంటామని ప్రకటించారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఒత్తిడి

అభివృద్ధి చెందుతున్న దేశాలు (గ్లోబల్ సౌత్) ప్రపంచంలో అనిశ్చిత పరిస్థితులు, ఉద్రిక్తతల కారణంగా ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దేశాల ప్రాధామ్యాలు, ఆందోళనలను ప్రపంచ వేదికపై వెల్లడించడాన్ని భారత్ తన బాధ్యతగా స్వీకరించిందని పేర్కొన్నారు. ఆఫ్రికా యూనియన్‌ను జి20 శాశ్వత సభ్యురాలిగా చేర్చుకుని తాము అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన సంగతిని గుర్తుచేశారు. "ఏఐ అందరికీ అంటూ కృత్రిమ మేధపై జాతీయ విధానం రూపొందించిన అతి తక్కువ దేశాల్లో భారత్ ఒకటి. మానవ కేంద్రీకృతంగా ఉంటేనే సాంకేతికత విజయవంతం అవుతుంది. టెక్నాలజీని విధ్వంసానికి కాదు.. అభివృద్ధికి వాడాలి. ఈ ధోరణితోనే మేం ముందుకెళ్తున్నాం" అని ప్రధాని వివరించారు.



నమస్కారంతో మోదీని స్వాగతిస్తున్న మెలోని

పర్యావరణాన్ని కాపాడేందుకు అందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

వరుస భేటీలతో బిజీబిజీ

జి7 సదస్సులో మోదీ.. బ్రిటన్, ఇటలీ ప్రధానులు రిషి సునాక్, మెలోనీ, ఫ్రాన్స్, ఉక్రెయిన్ అధ్యక్షులు మేక్రాన్, జెలెన్ స్కీతో సంభాషించారు. క్రైస్తవ మత పెద్ద పోప్ ఫ్రాన్సిస్‌ను హత్తుకుని, కొద్దిసేపు మాట్లాడారు. రష్యాతో యుద్ధం పరిస్థితిని జెలెన్‌స్కీ వివరించగా చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాంతి నెలకొనే వీలు ఉంటుందని మోదీ స్పష్టం చేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) చర్చల పురోగతిపై సునాక్‌తో సంభాషించారు. రక్షణ, సెమీ కండక్టర్లు, సాంకేతికత, వాణిజ్య రంగాల్లో ఇరు దేశాల సంబంధాలను మరింత విస్తృతం చేసేందుకు చాలా అవకాశాలు ఉన్నాయని ట్వీట్ చేశారు. మేక్రాన్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం, రక్షణ, అణు, సాంకేతికత, కృత్రిమ మేధ, సముద్ర మార్గ వాణిజ్యం, అంతరిక్ష రంగాల్లో సంబధాలను పటిష్ఠం చేసుకోవడంపై చర్చించారు. కాగా, మెలోని.. సదస్సుకు మోదీని ఆహ్వానిస్తూ భారతీయ పద్ధతుల్లో రెండు చేతులూ జోడించి 'నమస్కారం' చేశారు. మోదీ సైతం ఆమె ప్రతి నమస్కారం చేశారు.

ఏఐతో జాగ్రత్త: పోప్ ఫ్రాన్సిస్

చరిత్రలో తొలిసారిగా పోప్ ఫ్రాన్సిస్.. జి-7 సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. కృత్రిమ మేధ (ఏఐ)తో లాభాలు, పొంచి ఉన్న ముప్పు గురించి మాట్లాడారు. చాట్ జీపీటీ తదితర సాంకేతికతల అందుబాటుతో మానవ సంబంధాలను ఏఐ యాంత్రికంగా మార్చే ముప్పుందని హెచ్చరించారు. "మన నిర్ణయాలు యంత్రాలు కాకుండా మనమే తీసుకునేలా ఏఐని కట్టడి చేయండి. దీనికోసం అంతా చేతులు కలిపేందుకు ఇదో అవకాశం" అని పిలుపునిచ్చారు.

కేరళకు చేరిన 45 మంది భారతీయుల మృతదేహాలు

» సీఎం విజయన్, మంత్రుల నివాళులు

» చికిత్స పొందుతూ మరో భారతీయుడి మృతి

న్యూఢిల్లీ/కువైట్ సిటీ, జూన్ 14: గల్ఫ్ దేశం కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మరణించిన 45 మంది భారతీయుల మృతదేహాలతో ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ప్రత్యేక విమానం శుక్రవారం ఉదయం కేరళలోని కొచ్చికి చేరుకుంది. మృతుల్లో 23 మంది కేరళ వారే ఉండటంతో కువైట్ నుంచి నేరుగా కొచ్చికే విమానం బయలుదేరింది. అప్పటికే మృతుల కుటుంబీకులు కొచ్చి విమానాశ్రయానికి భారీగా చేరుకోవడంతో పరిస్థితి ఉద్విగ్నంగా మారింది. అలాగే కేరళ సీఎం పినరయి విజయన్, క్యాబినెట్ మంత్రులు, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ, ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ తదితరులు అక్కడికి చేరుకుని నివాళులర్పించారు. అనంతరం శవపేటికలను బంధువులకు అప్పగించారు. ప్రమాద వార్త విని కువైట్ వెళ్లిన కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ కూడా అదే విమానంలో తిరిగొచ్చారు. మృతుల్లో తమిళనాడుకు చెందిన ఏడుగురు, ఏపీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల వారు ముగ్గురు చొప్పున, ఒడిశాకు చెందిన ఇద్దరు, బిహార్, పంజాబ్, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్, హరియాణలకు చెందిన వారు ఒక్కొక్కరున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందినవారి మృతదేహాలను కొచ్చి నుంచే తరలిస్తామని.. మిగతావారి మృతదేహాలను ఢిల్లీకి పంపి అక్కడి నుంచి ఆయా రాష్ట్రాలకు చేరవేస్తామని అధికారులు వెల్లడించారు. ఇక అగ్నిప్రమాదంలో గాయపడిన మరో భారతీయుడు చికిత్స పొందుతూ చనిపోయాడు. దీంతో దేశానికి చెందిన మృతుల సంఖ్య 46కి చేరింది. మృతుడిది యూపీ అని సమాచారం.

తమిళిసైతో అన్నామలై భేటీ

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు బీజేపీలో వర్గపోరు చల్లబడినట్లే కనిపిస్తోంది. ఇటీవల తనపై తీవ్ర విమర్శలు గుప్పించిన మాజీ గవర్నర్, బీజేపీ తమిళనాడు రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌తో అధ్యక్షుడు అన్నామలై తాజాగా భేటీ అయ్యారు. శుక్రవారం ఉదయం చెన్నైలోని సాలిగ్రామంలోని తమిళిసై నివాసానికి వెళ్లిన అన్నామలై.. ఆమెతో గంటపాటు సమావేశమయ్యారు. అనంతరం అన్నామలై తన 'ఎక్స్' పేజీలో ఓ సందేశం వెలువరించారు. 'అక్క తమిళిసైతో భేటీ కావటం నాకెంతో సంతోషంగా ఉంది' అన్నారు. రాష్ట్రంలో ఖచ్చితంగా కమలం వికసిస్తుందన్నారు. దీని కోసం ఆమె రాజకీయ అనుభవాలు, సలహాలు స్ఫూర్తిని ఇస్తాయని పేర్కొన్నారు. కాగా అంతకు ముందు గురువారం రాత్రి తమిళిసై తన ఎక్స్ పేజీలో అమరావతిలో అమిత్‌షాతో తాను జరిపిన సంభాషణపై వివరణ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి అమిత్‌షా తనతో చర్చించారని పేర్కొన్నారు. అంతేకాకుండా నియోజకవర్గాలవారీగా పార్టీని అభివృద్ధిపరిచే విషయంపై దృష్టిసారించాలంటూ ఆయన సలహా ఇచ్చారని, ఆ సలహాలు తనకు ఎంతో ఉద్వేగాన్ని కలిగించాయని వ్యాఖ్యానించారు. తమిళిసై-అన్నామలై ఇలా స్పందించడంతో ఇప్పటికి వీరి మధ్య వివాదం సమసినట్లేనని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

ఇంతకీ అసలేం జరిగింది?

లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ తమిళనాడు శాఖలో చిచ్చు రేగింది. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడు అన్నామలై, మాజీ అధ్యక్షులు తమిళిసై, పొన్ రాధాకృష్ణన్, ఎల్.మురుగన్ తదితరులంతా ఓటమి చెందిన విషయం తెలిసిందే. దక్షిణచెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో పరాజయం పొందిన తమిళిసై.. అన్నామలైపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వ్యూహరచన సరిగ్గా లేదని, అన్నాడీఎంకేతో పొత్తు వుంటే తమ పార్టీ విజయం సాధించేదన్నారు. అనేకమంది క్రిమినల్స్‌ని అన్నామలై పార్టీలో చేర్చుకున్నారని, తాను అధ్యక్షురాలిగా ఉంటే వారిని దరిచేరనిచ్చేదాన్ని కాదంటూ వ్యాఖ్యానించారు. వీటన్నింటి నేపథ్యంలోనే అమిత్‌షా తమిళిసైని గత బుధవారం సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవ వేదికపై హెచ్చరించారు. కాగా, ఢిల్లీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఇద్దరు నేతల భేటీ జరిగినట్లు బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.



అహంకారం వల్లే బీజేపీకి 240 సీట్లు

» ఆరెస్సెస్ సిద్ధాంతకర్త ఇంద్రేశ్‌కుమార్

జైపూర్, జూన్ 14: లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఆరెస్సెస్ సిద్ధాంతకర్త ఇంద్రేశ్‌కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శ్రీరాముడిని పూజించి క్రమంగా అహంకారం పెంపొందించుకున్న పార్టీ ఎన్నికల్లో 240 సీట్లకే పరిమితమైందని, కానీ అతి పెద్ద పార్టీగా నిలిచిందని అన్నారు. అలాగే, శ్రీరాముడిని విశ్వసించని వారు 234 స్థానాల వద్దే ఆగిపోయారని పేర్కొన్నారు. జైపూర్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ బీజేపీ, ఇండియా కూటమిని ఉద్దేశిస్తూ ఇంద్రేశ్‌కుమార్ పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారు. రాముడిని పూజిస్తున్నప్పటికీ అహంకారం పెంచుకున్న వారి ఓట్లను, అధికారాన్ని దేవుడు అడ్డుకున్నాడని ఇంద్రేశ్‌కుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో యూపీ సీఎం యోగి ఆరెస్సెస్ చీఫ్‌తో శనివారం భేటీ కానున్నారనే వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

బీజేపీతో విభేదాల్లేవ్: ఆరెస్సెస్ వర్గాలు

న్యూఢిల్లీ, జూన్ 14: ఆరెస్సెస్, బీజేపీ మధ్య ఎలాంటి విభేదాలు లేవని సంఘ్ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఆరెస్సెస్ చీఫ్ భాగవత్ ఇటీవల బీజేపీపై విమర్శలు చేసిన నేపథ్యంలో ఈ స్పష్టతనిచ్చాయి. "2014, 2019 ఎన్నికల అనంతరం ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన ప్రసంగాలకూ తాజా ప్రసంగానికి పెద్దగా తేడా ఏమీ లేదు. కానీ, కొందరు ఆయన మాటలను వక్రీకరించి, గందరగోళం సృష్టిస్తున్నారు. 'అహంకారం' అన్న వ్యాఖ్యలు ప్రధాని మోదీ లేదా ఏ బీజేపీ నేతనూ ఉద్దేశించి చేసినవి కాదు" అని తెలిపాయి. ఆరెస్సెస్ ఏటా బీజేపీ సహా అనుబంధ సంస్థల ప్రతినిధులతో నిర్వహించే సమన్వయ భేటీని ఆగస్టు 31 నుంచి కేరళలోని పాలక్కడ్‌లో నిర్వహించనున్నట్లు, దీనికి బీజేపీ అధ్యక్షుడు కూడా రానున్నట్లు సంఘ్ వర్గాలు తెలిపాయి

మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌లో శుక్రవారం 21వ నెంబరు గేటును ఎత్తారు. దీంతో 10 గేట్ల ఎత్తివేత పూర్తయింది. మరోవైపు, బ్యారేజీ వద్ద సీఎస్ఎంఆర్ఎస్ చేపట్టిన మట్టి నమూనా పరీక్షల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది.

ఆరేళ్ల బాలికను ఎత్తుకెళ్లి రేప్, హత్య!

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ సమీపంలో ఘోరం

సుల్తానాబాద్, మణుగూరు టౌన్, జూన్ 14: రాత్రి విల్లులో నిద్రిస్తుండగా కరెంట్ పోవడంతో ఉక్కబోత భరించలేక తమ ఇద్దరు బిడ్డలను తీసుకొని ఆరుబయటకొచ్చి నిద్రకు ఉపక్రమించడమే ఆ దంపతుల తప్పయింది! తల్లి చుట్టూ చేతులేసి హాయిగా నిద్రిస్తున్న ఆరేళ్ల బాలికను ఓ దుండగుడు ఎత్తుకెళ్లి, ఆమెపై అత్యాచారానికి పాల్పడి హత్య చేశాడు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్-కాట్నపల్లి మధ్య రాజీవ్ రహదారి పక్కనే ఉన్న ఓ రైస్ మిల్లు వద్ద ఈ ఘోరం జరిగింది. ఈ మిల్లులో పని చేయడానికి ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన దంపతులు వారం క్రితమే చేరారు. ఈ దంపతులకు ఆరేళ్లు, ఏడాది వయసున్న ఇద్దరు కూతుళ్లున్నారు. గురువారం రాత్రి ఆ దంపతులు మిల్లులోని లేబర్ రూములో నిద్రపోయారు. కరెంటు పోవడంతో ఉక్కపోత భరించలేక రాత్రి పదిన్నరకు తమ ఇద్దరు చిన్నారులతో కలిసి గది ముందు భాగంలోని రేకుల షెడ్డు కిందకొచ్చి పడుకున్నారు. కొద్దిసేపటికి తల్లి లేచి చూసేసరికి పెద్ద కూతురు కనిపించలేదు. భర్తను నిద్రలేపి విషయం చెప్పింది. అతడు, మిల్లులోని తోటి కార్మికులందరికి పాప కనబడడం లేదని చెప్పడంతో చుట్టు పక్కల వెతికారు. డయల్ 100కు కాల్ చేసి సమాచారమిచ్చారు. వారొచ్చి విల్లు పరిసరాల్లో పాప ఆచూకీ దొరక్కపోవడంతో సీసీ ఫుటేజీని పరిశీలించగా ఒక వ్యక్తి పాపను భుజాన వేసుకుని వెళుతున్న దృశ్యాలు కనిపించాయి. పాప అపహరణకు గురైన మిల్లును అనుకుని మరో మిల్లు ఉంది. అక్కడికి పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున వెళ్లగా ఓ కార్మికుడు బట్టలు ఉతుకుతూ కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా అతడే దుర్మార్గానికి ఒడిగట్టినట్లు తేలింది. పాపను మిల్లు వెనుక వైపు పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి, హత్య చేసినట్లు అతడు ఒప్పుకొన్నాడు. అనంతరం పొదల్లో వెతగ్గా చిన్నారి మృతదేహం కనిపించింది. నిందితుడు మధ్యప్రదేశ్ వాస్తవ్యుడని, ఆ విల్లులో డ్రైవర్‌గా పని చేస్తున్నట్లు తోటి కార్మికులు తెలిపారు. అతడిని పోలీసులు అరెస్టు చేశారు. కాగా కొత్తగూడెం జిల్లా మణుగూరులో తొమ్మిదేళ్ల బాలికపై ఓ దుండగుడు లైంగిక దాడికి యత్నించాడు. భద్రాచలం డివిజన్‌లోని తోటపల్లికి చెందిన 40 ఏళ్ల వ్యక్తి ఉద్యోగ రీత్యా పినపాక మండలం జానంపేటలో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం 7:30 గంటలకు పూటుగా మద్యం తాగిన ఆ వ్యక్తి, ఇంటికి తిరిగొస్తున్న క్రమంలో ఓ చోట బయట మెట్లపై కూర్చున్న తొమ్మిదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి మెట్లమీదుగా ఆమెను డాబాపైకి తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై లైంగికదాడికి ప్రయత్నించగా ఆమె బిగ్గరగా కేకలు వేయడంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లారు. అప్పటికే నిందితుడు పారిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

ప్రాణం తీసిన భూ వివాదం

దాయాదుల మధ్య ఘర్షణ

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు
- నారాయణ పేట జిల్లా ఊట్కూర్ మండలం చిన్నపొర్లలో ఘటన.. ఎస్సై సస్పెన్షన్



సంజప్పపై దాడి చేస్తున్న దాయాదులు



ఊట్కూర్, జూన్ 14: భూమి పంపకాల వివాదం.. ఓ ప్రాణాన్ని బలిగొంది. దాయాదుల ఘర్షణలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంచిన్నపొర్ల గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన సంజప్ప(28) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. చిన్నపొర్లకు చెందిన ఎర్రగండ్ల లక్ష్మప్పకు బాలమ్మ, తిప్పమ్మ అనే ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య బాలమ్మకు సంజప్ప, రెండో భార్య తిప్పమ్మకు పెద్ద నవరప్ప, చిన్న నవరప్ప అనే కుమారులు ఉన్నారు. లక్ష్మప్పకు ఉన్న తొమ్మిది ఎకరాల భూమిని ముగ్గురు సంతానానికి సమానంగా పంపిణీ చేశారు. ఈ పంపకాన్ని మొదటి నుంచి బాలమ్మ మనవడు ఆటో సంజీవ్ వ్యతిరేకిస్తున్నాడు. పది రోజుల క్రితం పెద్ద నవరప్ప కుమారుడు సంజప్ప తన పొలం సాగు కోసం వెళ్లగా దాయాదులు అడ్డుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూ వివాదం కోర్టు తీర్పు వచ్చే వరకు యథావిధిగా ఉండాలని పోలీసులు సూచించారు. అనంతరం గురువారం పెద్ద నవరప్ప, చిన్న నవరప్ప, సంజప్ప పొలం దున్నడానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న దాయాదులు బాలమ్మ మనుమడు ఆటో సంజీవ్, గుట్టప్ప, ఆశప్ప తదితరులు పొలం వద్దకు చేరుకొని గొడవకు దిగారు. అనంతరం సంజప్పపై కర్రలతో దాడి చేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చిన్న నవరప్ప, పెద్ద నవరప్పలు కూడా గాయపడ్డారు. డయల్ 100కు ఫోన్ చేసినా పోలీసులు రాకపోవడంతో అక్కడే రెండు గంటలపాటు ఉన్నామని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. చివరికి మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సంజప్ప మృతి చెందాడు. పోలీసులు స్పందించకపోవడంతోనే సంజప్ప మృతి చెందాడని గ్రామస్థులు ఆరోపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగా కుటుంబ సభ్యులు, బంధువులు అంబులెన్స్‌ను అడ్డుకున్నారు. డీఎస్పీ లింగయ్య మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మృతుడి చిన్నమ్మ కవిత ఫిర్యాదుతో ఏడుగురిపై కేసు నమోదు చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, శాంతి భద్రతలు పరిరక్షించడంలో విఫలమైన ఊట్కూర్ ఎస్సై బి.శ్రీనివాసులును సస్పెండ్ చేస్తూ ఐజీ వి.సుధీర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పెద్దపల్లి, ఊట్కూర్ ఘటనలపై సీఎం సీరియస్

హైదరాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో పట్టపగలు వ్యక్తిపై దాడిచేసి హత్య చేసిన ఘటన, పెద్దపల్లి జిల్లాలో ఆరేళ్ల బాలికపై హత్యాచారం ఘటనలపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా స్పందించారు. భౌతికదాడులకు దిగి అరాచకాలు, హత్యలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ ఘటనలో పోలీసుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ రవిగుప్తాను ఆదేశించారు. బాలికపై హత్యాచారం ఘటన బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు.

సీఎం, మంత్రుల జీతభత్యాల్లో 10% కోత విధించాలి

పలు సూచనలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఎఫ్‌జీజీ లేఖ

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్లిష్ట పరిస్థితి నుంచి గట్టేందుకు సీఎం, మంత్రులు జీతభత్యాల్లో 10 శాతం కోత విధించడంతో పాటు పలు సూచనలు చేస్తూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు శుక్రవారం ఓ లేఖ రాసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారం గత ప్రభుత్వం రూ. 6.72 లక్షల కోట్లు అప్పులు చేయగా, రెవెన్యూ రాబడుల్లో 34 శాతం వడ్డీలకే సరిపోతున్నాయంటే సమస్య తీవ్రతను తెలుస్తుందని ఎఫ్‌జీజీ పేర్కొంది. ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు దుబారా ఖర్చులు తగ్గించుకోవాలని సూచించింది. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల జీతభత్యాల్లో 10 శాతం కోత విధించాలని, ఉద్యోగులను కూడా కోరాలని తెలిపింది. రైతు భరోసా ఆర్థిక సాయాన్ని ఐదెకరాలకే పరిమితం చేయాలని, సాగులో ఉన్న భూములకే ఇవ్వాలని, దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ ప్రమేయం లేకుండా చేయాలని సూచించింది. ప్రస్తుతం రెవెన్యూ వ్యయంలో 40% పాలనా వ్యవహారాలకే సరిపోతుందని, ఇందులో దుబారాను అరికట్టి 10 శాతానికి తగ్గించాలని సూచించింది.

హెల్త్ సెక్రటరీపై మంత్రికి ఫిర్యాదు

- తనను అవమానించారని ఓ విభాగాధిపతి ఆవేదన

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి(హెల్త్ సెక్రటరీ) క్రిస్టినా జడ్ చోంగ్తుపై ఆ శాఖలోని ఓ విభాగాధిపతి(హెచ్‌వోడీ) వైద్య మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేశారు. ఏకంగా హెల్త్ సెక్రటరీపైనే విభాగాధిపతి ఫిర్యాదు చేయడం ఆ శాఖలో చర్చనీయాంశమైంది. బ్లడ్‌బ్యాంకుల పనితీరు, వాటిల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణపై గురువారం సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ముందు ఆరోగ్య శాఖలో పలు విభాగాల అధిపతులు హెల్త్ సెక్రటరీని కలిశారు. ఈ క్రమంలో బ్లడ్‌బ్యాంకుల పని తీరు గురించి ఆమె అడిగారు. తన వద్ద బ్లడ్ బ్యాంకుల సమాచారం ఏదీ లేదని సదరు విభాగాధిపతి తెలియజేశారు. దాంతో సెక్రటరీ అసహనానికి గురయ్యారు. కనీస సమాచారం లేకుండా సమీక్షకు ఎలా హాజరవుతారని మండిపడ్డారు. సమీక్ష సమావేశంలో ఉండాల్సిన అవసరం లేదని బయటకు పంపారు. ఈ తతంగమంతా జరుగుతోన్న సమయంలో హెల్త్ సెక్రటరీ కార్యాలయ అధికారులు, సిబ్బంది అక్కడే ఉన్నారు. దాంతో అవమానంగా భావించిన సదరు విభాగాధిపతి ఆగ్రహంగా బయటకు వెళ్లిపోయారు. తర్వాత నేరుగా మంత్రి దామోదర ఛాంబర్‌కు వెళ్లారు. జరిగిన విషయాన్ని మంత్రికి వివరించి, సెక్రటరీపై ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఇలాగే అకారణంగా తనను అవమానించారని చెప్పినట్లు తెలిసింది. అనంతరం బ్లడ్ బ్యాంకులపై సమీక్షకు హాజరవకుండానే ఆయన సచివాలయం నుంచి వెనక్కు వెళ్లిపోయారు. ఆ విభాగాధిపతి లేకుండానే మంత్రి బ్లడ్ బ్యాంకులపై సమీక్ష కూడా జరిపారు. సమీక్షకు సంబంధించిన సబ్జెక్టు ఏంటో ముందస్తు సమాచారం ఇవ్వకుండా హడావుడిగా రమ్మన్నారని, అలా అయితే ఎలా సిద్ధమవుతామని సదరు విభాగాధిపతి తన సన్నిహితుల వద్ద అన్నట్లు తెలిసింది. కాగా సదరు విభాగాధిపతికి తన విభాగానికి సంబంధించిన విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండదని, ముందే సమాచారం ఇచ్చినా సరైన సమాచారంతో రారని సచివాలయ వర్గాలు వెల్లడించాయి.

బస్సు దిగబోతూ చక్రాల కిందపడి.. ఇంటర్ విద్యార్థిని దుర్మరణం



మెహ్రీన్

యూసుఫ్‌గూడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు దిగుతుండగా కాలు జారి దాని చక్రాల కింద పడి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని దుర్మరణం పాలైంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శుక్రవారం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బోరబండ సబ్దార్ నగర్‌కు చెందిన మహ్మద్ సలీముద్దీన్‌కు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. అయితే ఆయన ఇద్దరు కుమార్తెలు జవేరియా మెహక్, మసీరా మెహ్రీన్ (16) యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు సమీపంలోని మాస్టర్ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నారు. అక్కాచెల్లెలు కాలేజీ అయిపోగానే మధ్యాహ్నం ఇంటికెళ్లేందుకు చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నారు. సికింద్రాబాద్ నుంచి బోరబండ వెళ్తున్న బస్సు రాగానే మెహ్రీన్ బస్సు ఎక్కింది. రద్దీగా ఉండటంతో మెహక్ ఎక్కలేకపోయింది. దీంతో బస్సు కదులుతుండగానే అక్క కోసం మెహ్రీన్ ఫుట్‌బోర్డు నుంచి దిగుతుండగా కాలు జారి కిందపడింది. ఆమెపై నుంచే బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బస్సు వెనకాలే పరుగున వచ్చిన మెహక్ అది చూసి నిర్ఘాంతపోయింది. బస్సు చక్రాల కిందపడి నలిగిన చెల్లెలిని చూసి గుండెలవిసేలా రోదించింది. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరిని చిదిమేసిన కలప లారీ!

- రోడ్డు పక్కన టీ తాగుతుండగా అదుపు తప్పి వారిపై బోల్తా
- మానుకోట జిల్లా గూడూరులో ఘోరం
- మరో ఘటనలో ఇద్దరు కూలీల మృతి



పాపారావు, దేవేందర్, వెంకటలక్ష్మి, దుర్గయ్య

గూడూరు, (మహబూబాబాద్ జిల్లా)/అశ్వారావుపేట రూరల్, జూన్ 14: కలప లోడుతో వెళుతున్న ఓ లారీ మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు దుర్మరణం చెందారు. మృత్యు శకటంలా దూసుకొచ్చిన లారీ అదుపుతప్పి.. రోడ్డుపక్కన టీ తాగుతున్న వారిపై బోల్తా పడటంతో ఈ ఘోరం జరిగింది. మహబూబాబాద్ జిల్లా గూడూరులో శుక్రవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి జామాయిల్ కలప లోడుతో ఓ లారీ మహబూబాబాద్ మీదుగా బలార్షాకు వెళుతోంది. గూడూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మూలమలుపు వద్ద అతివేగం కారణంగా అదుపు తప్పి బోల్తా పడింది. అదే సమయంలో రోడ్డు పక్క టీ తాగుతున్న గూడూరు మండలం మట్టేవాడ శివారు కొంగరిగిద్దకు చెందిన ధనసరి పాపారావు(35), మచ్చర్లకు చెందిన చుంచా దేవేందర్(34)లపై కలప దుంగలు పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. పాపారావు గూడూరు సీఐ గన్‌మెన్‌గా, దేవేందర్ ములుగు జిల్లా రాయినిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల సీఆర్టీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ..

మరో ఘటనలో ట్రాక్టర్‌ను లారీ ఢీకొనగా ఇద్దరు కూలీలు మృతి చెందగా.. మరో 14 మందికి గాయాలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గుమ్మడివల్లికి చెందిన కూలీలు శుక్రవారం సాయంత్రం అశ్వారావుపేటలోని ఓ నర్సరీ నుంచి నారంవారిగూడెంలోని మరో నర్సరీకి మామిడి మొక్కలను ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్నారు. అయితే నారంవారిగూడెం కాలనీ సమీపానికి ట్రాక్టర్ చేరగానే ఖమ్మం వైపు వెళుతున్న లారీ వేగంగా దూసుకొచ్చి ఢీకొంది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడి కూలీలు రోడ్డు ప్రక్కన చెల్లాచెదురుగా పడిపోయారు. ప్రమాదంలో వంటిపులి వెంకటలక్ష్మి(35) అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన బత్తుల దుర్గయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

నీటుకు చేటు

దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయస్థాయి అర్హత పరీక్ష 'నీట్‌'లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవకతవకలు జరిగాయన్న అనుమానాలను, పేపర్ లీక్ ఆరోపణలనూ నిగ్గుతేల్చడానికి సీబీఐ దర్యాప్తు చేయించాలంటూ ఏడు పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో, కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే), సీబీఐ, బిహార్ ప్రభుత్వం స్పందనలను సుప్రీం కోర్టు శుక్రవారం కోరింది. సీబీఐ దర్యాప్తు విషయంలో సర్వోన్నత న్యాయ స్థానం ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది అటుంచితే, అక్రమాలు జరిగాయన్న తమవాదనకు మద్దతుగా పిటిషన్‌దారులు ప్రస్తావించిన ఉదంతాలు చిన్నవేమీ కావు. ఒడిశా, కర్ణాటక, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన పదహారుమంది విద్యార్థులు గుజరాత్‌లోని గోధ్రాలో ఓ పరీక్షాకేంద్రాన్ని ఎంచుకోవడం, మంచి మార్కులకోసం వారు పదిలక్షలు లంచంగా ఇచ్చారన్న ఆరోపణల మేరకు గుజరాత్‌లో ఒక టీచర్‌పై కేసు నమోదుకావడం, బిహార్‌లోని పట్నాలో పేపర్ లీక్‌కు సంబంధించి ఎఫ్ఐఆర్ దాఖలు కావడం వంటివి వారు ఉదహరించారు. యూపీలో నీట్ పేపర్ లీక్ రాకెట్ నడిచిందన్న కథనాలను కూడా వారు ప్రస్తావించినప్పటికీ, కనీసం మూడు రాష్ట్రాల్లో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో, లోతుగా విచారణ జరగాల్సిన అంశం ఇది.

అవకతవకలు జరగలేదనీ, విపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని కేంద్ర విద్యామంత్రి గట్టిగానే అంటున్నారు కానీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వేస్తున్న ప్రశ్నలు కూడా కొట్టిపారేయలేనివే. పేపర్‌లీక్ లీక్ కాకపోతే బిహార్‌లో పదమూడుమందిని ఎందుకు అరెస్టు చేశారు, రాకెట్‌లో భాగమైన గ్యాంగులు యాభైలక్షలవరకూ వసూలుచేశారన్న విషయాన్ని అక్కడి ఆర్థిక నేరాల విభాగం బయటపెట్టలేదా, గుజరాత్‌లోనూ ఓ ముగ్గురి మధ్య పన్నెండు కోట్ల రూపాయల లావాదేవీ జరిగిన విషయం బయటకు రాలేదా అంటూ ఆయన చాలా ప్రశ్నలు వేశారు. అసలే పలు అనుమానాలు, ఆందోళనలు చుట్టుముట్టిన తరుణంలో, ఒక జాతీయ స్థాయి పరీక్షనుంచి కాంగ్రెస్ రాజకీయంగా లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించడం సులభమే. కానీ, లక్షసీట్లకోసం పాతికలక్షలమంది విద్యార్థులు రేయింబవళ్ళు శ్రమించి రాసిన ఈ పరీక్ష చివరకు అవకతవకలకు గురై, అందరి నమ్మకాన్ని వమ్ముచేయడం సరికాదు.

ఎన్నడూ లేనిది, ఆరవైయేడు మంది విద్యార్థులు పూర్తిమార్కులతో టాపర్లుగా నిలవడం, హర్యానాలోని ఒక పరీక్షా కేంద్రంలో పక్కపక్కనే కూచున్న ఆరుగురు విద్యార్థులు వీరిలో ఉండటం, కొంతమందికి 718, 719లాంటి అసంభవమైన మార్కులు రావడం వంటివి అనుమానాలకు కారణం. ఇక, అత్యున్నత ప్రతిభావంతులను గుర్తించేందుకు ఉద్దేశించిన ఓ కఠినాతి కఠినమైన పరీక్షలో గ్రేస్ మార్కులు ఇవ్వడమనేదే తప్పు. ఒక్క గ్రేస్ మార్కుతో వేలాది ర్యాంకులు మారిపోయి, విద్యార్థుల భవిష్యత్తు తారుమారవుతుంది. ఏ కారణాన, ఏ ప్రాతిపదికన ఆ మార్కులు ఇచ్చారన్నది అటుంచితే, వివాదం రేగిన తరువాత వాటిని రద్దుచేసి, ఇప్పుడు ఆ పదిహేనువందల పైచిలుకు విద్యార్థులకు తిరిగి పరీక్షరాసుకొనే అవకాశం ప్రభుత్వం కల్పిస్తున్నది. నచ్చినవారు రాయవచ్చు, వద్దనుకున్నవారు తమ అసలు స్కోరుతో కౌన్సెలింగ్ ఎదుర్కోవచ్చు అని కేంద్రప్రభుత్వం అంటోంది. వినడానికి బాగున్నది కానీ, ఈ రీ టెస్ట్ తరువాత వివాదం మరిన్ని మలుపులు తిరగవచ్చు, అనుమానాలు పెంచవచ్చు.

నీట్‌లో అక్రమాలు జరుగుతున్నాయని తాము ఎప్పటినుంచో అంటున్నామని స్టాలిన్ గుర్తుచేస్తున్నారు. వ్యాపం 2.0 అంటూ దశాబ్దం క్రితం మధ్యప్రదేశ్‌ను కుదిపేసిన కుంభకోణంతో కాంగ్రెస్ నాయకులు దీనిని పోల్చుతున్నారు. నీట్–చీట్ వంటి నినాదాలు, కొత్త నిర్వచనాలు జోరందుకుంటున్నాయి. నీట్ పరీక్షావిధానంమీద చాలా విమర్శలు, అనుమానాలు ఉన్నప్పటికీ, ఇప్పుడు కొన్ని ఆధారాలు కూడా తోడైనందున లోతైన శస్త్రచికిత్స వెంటనే జరగడం అవసరం. పాతికలక్షలమంది విద్యార్థుల ఆశయం, భవితవ్యం, కుటుంబీకుల కష్టనష్టాలతో ముడిపడిన అంశమిది. ఇంతటి అస్తవ్యస్థమైన, అనుచిత నిర్ణయాలు, చర్యలు ఎన్టీయే ఎన్నడూ తీసుకోలేదు. తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి అది చేస్తున్న ప్రయత్నాలు వికటిస్తున్నాయి. పరీక్షను పూర్తిగా రద్దుచేయకుండా ఆగినప్పటికీ, సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు, చేసిన నిర్ణయాలు ఈ వ్యవహారంలో లోతైన దర్యాప్తు జరగడం, విశ్వాసాన్ని పెంపొందించడం అవసరమని రుజువుచేస్తున్నాయి.

ప్రజా తీర్పుపై క్రూర పరిహాసం

జూన్ 9న పదవీ ప్రమాణస్వీకారం చేసిన కొత్త ప్రభుత్వం కథను సంగ్రహంగా ఇలా చెప్పవచ్చు: ప్రజలు మార్పు కోసం ఓటు వేశారు, నరేంద్ర మోదీ అవిచ్ఛిన్నతను ఎంచుకున్నారు.

ఓటర్లకు ఇంగిత జ్ఞానం సమృద్ధిగా ఉన్నది. కనుకనే మార్పు కోసం ఓటు వేశారు సరైన తీర్పునిచ్చారు. గత పది సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం అనుసరించిన పాలనా నమూనాను వారు తిరస్కరించారు. అయితే నరేంద్ర మోదీకి మరో అవకాశాన్ని ఇచ్చారు. ఆయన తన ప్రభుత్వ విధానాలలో మౌలిక మార్పులు తీసుకురావాలని, తీసుకురాగలరని వారు భావిస్తున్నారు. బీజేపీ 303 సీట్లతో ఈ సార్వత్రిక ఎన్నికల గోదాలోకి దిగింది. తను సొంతంగా 370 సీట్లను గెలుచుకోవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. తన నేతృత్వంలోని ఎన్డీఏకు 400కు పైగా సీట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ రెండు లక్ష్యాలు నెరవేరగలవని ప్రధాని మోదీతో సహా బీజేపీ శ్రేణులు నిండుగా విశ్వసించాయి. అయితే వారి ఆశలు ఘోరంగా వమ్మయ్యాయి. బీజేపీ అంతిమంగా 240 సీట్లను మాత్రమే గెలుచుకోగలిగింది. కనీస మెజారిటీ కూడా దక్కలేదు. ఇక ఎన్డీఏ 292 సీట్లతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. ఈ తీర్పుతో బీజేపీకి ప్రజలు పంపించిన సందేశమేమిటో స్పష్టమే : సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయండి. భాగస్వామ్య పక్షాలకు కీలక బాధ్యతలు అప్పగించండి. ప్రజల్లో విభేదాలు, విభజనలను సృష్టిస్తున్న విధానాలను విడనాడండి. ఆర్థిక రంగ వాస్తవ పరిస్థితులను అంగీకరించండి. సామాజిక వైమనస్యతలను రూపుమాపండి. పాలన గురించి డాబుసరి మాటలను కట్టిపెట్టండి. ఆచరణాత్మకం కాని హామీలు ఇవ్వొద్దు. సమస్త భారతీయులనూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లండి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్, కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకోవడానికి దృఢ సంకల్పంతో పోరాడిందనే అభిప్రాయానికి ఓటర్లు వచ్చారు. అయితే ఆ పార్టీ బహుశా బృహత్తర పాలనా బాధ్యతలకు సన్నద్ధం కాలేదని కూడా ఓటర్లు భావించినట్టున్నారు. 170 లోక్‌సభా నియోజకవర్గాలు ఉన్న 9 రాష్ట్రాలలో కాంగ్రెస్ తన పునాదులను తిరిగి పటిష్ఠం చేసుకోవలసి ఉన్నది. ఆ రాష్ట్రాలలో పార్టీ పెరుగుదలకు గల అనుకూలతలను కంగ్రెస్ సద్వినియోగపరచుకోవలసి ఉన్నది.

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు షరతులతో కూడిన ప్రజామోదాన్ని నరేంద్ర మోదీ పొందారు. అయితే ప్రజా తీర్పుపై వ్యక్తమైన ప్రజల అభీష్టాన్ని ఆయన గుర్తించలేదు. ఈ దురహంకారం మోదీకి స్వాభావికమైనదని మరి చెప్పనవసరం లేదు. ఎన్నికల ఫలితాలపై తొలి దిగ్భ్రాంతి నుంచి తేరుకున్న వెంటనే తనను సవాల్ చేయగల నేతలు బీజేపీలో లేరన్న వాస్తవాన్ని గుర్తించారు. మరి ఏ ఇతర పార్టీకీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సంఖ్యా బలం లేదన్న యథార్థాన్నీ అర్థం చేసుకున్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన కొత్త ప్రస్థానం మొదటి అడుగు– ప్రభుత్వం ఏర్పాటు– లోనే తడబడ్డారు. దేశ ప్రజలకు భరోసా కల్పించడంలో విఫలమయ్యారు. ప్రజలు ఆశాజీవులు. మరి కేంద్రంలో కొలువుదీరిన కొత్త సర్కార్ తన రెండవ, మూడవ అడుగులు– పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ సమర్పణ– ఎలా ఉండనున్నాయోనని ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మొత్తం 99 సీట్లను కైవసం చేసుకున్నది. వీటిలో 79 కేవలం తొమ్మిది రాష్ట్రాలలో మాత్రమే ఉన్నాయి. 170 నియోజకవర్గాలు ఉన్న మరో తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెస్ కేవలం నాలుగు సీట్లను మాత్రమే గెలుచుకున్నది (ఐదు రాష్ట్రాలలో ఒక్క సీటు కూడా రాకపోగా మిగతా నాలుగు రాష్ట్రాల నుంచి ఒక్కొక్క సీటును సాధించుకున్నది) 79 సీట్లను ఇచ్చిన తొలి తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెస్ చేసిన మంచి ఏమిటి? కేవలం ఐదు స్థానాలను మాత్రమే ఇచ్చిన మరో 9 రాష్ట్రాలలో కాంగ్రెస్ చేసిన చెడు ఏమిటి? ఉదయ్‌పూర్, రాయపూర్‌లలో జరిగిన పార్టీ జాతీయ సదస్సులలో సార్వత్రిక ఎన్నికలలో విజయ సాధనకు సన్నాహక కృషి జరిగింది. అయితే ఆ కృషిని తార్కిక అంతానికి తీసుకువెళ్లి, అధికారాన్ని కైవసం చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలమయింది. హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో కాంగ్రెస్ మంచి ఫలితాలను సాధించింది. ఈ మూడు రాష్ట్రాలలో మరి కొద్దినెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో గెలుచుకున్న సీట్ల ప్రాతిపదికన చూస్తే కాంగ్రెస్ తన మిత్రపక్షాలతో పాటు బీజేపీ కంటే ముదంజలో ఉన్నది. ఈ మూడు రాష్ట్రాలలోను అధికారాన్ని కైవసం చేసుకునేందుకు అవకాశాలు సమృద్ధంగా ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాలపై ప్రభావాన్ని తప్పక చూపుతాయి కనుక ఆ మూడు రాష్ట్రాలను కోల్పోయేందుకు బీజేపీ ఇష్టపడదు. కనుక రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ప్రత్యర్థి పార్టీలకు తీవ్ర పోటీనిస్తుంది. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ మూడు రాష్ట్రాలలోనూ గెలుపే లక్ష్యంగా ఇండియా కూటమి పోరాడాలి.

మార్పు కంటే ప్రభుత్వ విధానాల కొనసాగింపు క్రమాన్నే ఎంచుకున్నారు తద్వారా ఆయన అనుద్దేశపూర్వకంగా క్లిష్ట పరిస్థితులను సృష్టించుకున్నారని చెప్పవచ్చు. మోదీ మూడో ప్రభుత్వ మంత్రిమండలి కూర్పు మంత్రిత్వ శాఖల కేటాయింపు నుంచి అనేక నిర్ధారణలకు రావచ్చు.

అవేమిటో చూద్దాం. 1) ప్రభుత్వ విధానాలలోను, తన పాలనా శైలిలోను మౌలిక మార్పులు రావాలన్న ఓటర్ల హెచ్చరికను మనసున పెట్టుకునేందుకు మోదీ నిరాకరించారు. 2) తన ప్రభుత్వ మౌలిక విధానాలలో అపసవ్యతలు లేవన్న వైఖరిని మోదీ దృఢంగా వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికాభివృద్ధి, అంతర్గత భద్రత, విదేశాంగ వ్యవహారాలకు సంబంధించిన విధానాలు దేశ ప్రయోజనాలను సంపూర్ణంగా కాపాడుతున్నాయని ఆయన గట్టిగా అభిప్రాయపడుతున్నారు. 3) తన మూడో ప్రభుత్వం ప్రధానమంత్రి కార్యాలయం పర్యవేక్షణలో నడుస్తుందన్న వాస్తవాన్ని అంగీకరించిన వారికి తన కేబినెట్‌లో స్థానముంటుందని మోదీ స్పష్టం చేశారు. 5) ప్రభుత్వంలో మిత్రపక్షాలకు గౌరవప్రదమైన పాత్ర కల్పించకుండానే వాటిని తమపక్షాన ఉంచుకునేందుకు అవసరమైన సకల వనరులు తనకు, అమిత్ షాకు ఉన్నాయన్న ధీమా మోదీలో బాగా వ్యక్తమవుతోంది.

మంత్రులు ఎవరూ ఇంతవరకు తమ ప్రాథమ్యాలు, విధానాల గురించి మాట్లాడలేదు. పి.కె. మిశ్రాను ప్రిన్సిపల్ సెక్రటరీగాను, అజిత్ డోవల్‌ను జాతీయ భద్రతా సలహాదారుగాను నియమించారు. ఈ నియామకాలతో మోదీ ప్రభుత్వం మార్పులేకుండా అదే విధంగా కొనసాగుతుందనే విషయం సందిగ్ధతకు తావు లేకుండా ధ్రువీకరణ అయింది. ఈ కొత్త ప్రభుత్వం నిస్సందేహంగా మోదీ 3.0 కాదు, అది మోదీ 2.1 మాత్రమే.

ప్రజలు తమ జీవన స్థితిగతులను మెరుగుపరిచే మార్పును ఆకాంక్షించారు. ఉద్యోగాలు, ధరల స్థిరీకరణ, భద్రత, శాంతి సామరస్యాల కోసం ఓటు వేశారు. మరి పాత ప్రభుత్వంలో ఉన్న మంత్రులే ఈ కొత్త సర్కార్‌లోనూ కొనసాగుతున్నారు. గతంలో వారు ఏ మంత్రిత్వ శాఖలు నిర్వహించారో ఇప్పుడూ అవే శాఖలకు సారథ్యం వహిస్తున్నారు. మరి విధానాలో? అవే. పాతవే. మార్పు లేనివి, మారనివి. ఈ యథాతథ పరిస్థితి ప్రజాతీర్పుపై క్రూర పరిహాసమే అవుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన కొత్త ప్రస్థానం మొదటి అడుగు– ప్రభుత్వం ఏర్పాటు– లోనే తడబడ్డారు. దేశ ప్రజలకు భరోసా కల్పించడంలో విఫలమయ్యారు. ప్రజలు ఆశాజీవులు. మరి కేంద్రంలో కొలువుదీరిన కొత్త సర్కార్ తన రెండవ, మూడవ అడుగులు– పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ సమర్పణ– ఎలా ఉండనున్నాయోనని ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

నరేంద్రుని పాలనా శైలి మారేనా?

సరిగ్గా ఏడాది క్రితం (జూలై 1, 2023) ఇదే కాలమ్‌లో భారత ప్రజాస్వామ్య నవీకరణ గురించి నా భావాలు, ఆలోచనలు, ఆకాంక్షల గురించి తెలియజేస్తూ తదుపరి (2024) సార్వత్రిక ఎన్నికల విషయమై ఒక ఆశను వెల్లడించాను. 'ఏ ఒక్క పార్టీ లోక్‌సభలో మెజారిటీ సీట్లు పొందకూడదు. ఏకైక పెద్ద పక్షంగా ఆవిర్భవించిన పార్టీకి సైతం కనీస మెజారిటీ (272) కంటే తక్కువ సీట్లు రావాలి'– నా యీ చిన్న ఆశ గురించి ఒకటి రెండు ఆసక్తికరమైన విషయాలను తెలియజేసేందుకు కుతూహలపడుతున్నాను.

మన ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాభావికంగా నిరంకుశవాది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులకు ఇటువంటి ప్రవృత్తి ఉండడం ఎంతమాత్రం తగదు. సార్వత్రిక ఎన్నికలలో వరుసగా రెండుసార్లు గణనీయమైన మెజారిటీతో గెలుపొందడంతో ఆయనలో నియంతృత్వ ధోరణులు మరింతగా పెరిగాయి. 18వ లోక్‌సభలో ఏ పార్టీకి కనీస మెజారిటీ ఉండకూడదన్న ఆశ నెరవేరడమనేది జూలై 2023లోను, ఆ తరువాత అనేక నెలల తరబడి కూడా అసాధ్యంగా కనిపించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 'ఫారిన్ ఎఫైర్స్' అన్న జర్నల్‌లో ప్రధాని మోదీ విధానాలను తీవ్రంగా విమర్శిస్తూ రాసిన ఒక వ్యాసంలో 'మోదీని, ఆయన పార్టీ బీజేపీని అధికారం నుంచి దించివేసేందుకు ఇండియా కూటమి చాలా చాలా కష్టపడవలసి ఉన్నది. మహా అయితే పార్లమెంటులో వారి మెజారిటీని దెబ్బతీయడం మాత్రమే ప్రతిపక్ష కూటమి చేయగలుగుతుంది' అని వ్యాఖ్యానించాను.

అదే నెలలో ఒక మిత్రుడు నాకు రాసిన ఒక లేఖలో 'బీజేపీని ప్రతిపక్షం దెబ్బతీయడమేకాదు, పార్లమెంటులో ఆ పార్టీ మెజారిటీని కూలదోస్తుంది' అని పేర్కొన్నాడు. జర్నలిస్టు అనీల్ మహేశ్వరి ఆ మిత్రుడు. ఉత్తర భారతావని రాజకీయాల గురించి బాగా లోతైన అవగాహన ఉన్న పాత్రికేయుడు. హిందీ రాష్ట్రాలలో దశాబ్దాలుగా పాత్రికేయుడుగా పనిచేసిన అనుభవంతో వర్తమాన భారత చరిత్రపై ఆయన పలు పుస్తకాలు రాశారు. 'ది పవర్ ఆఫ్ ది బ్యాలెట్' అన్న సుప్రసిద్ధ గ్రంథానికి ఆయన సహ రచయిత. 'మీ భయాలు నిరాధారమైనవి. వామపక్షాలు, ఉదారవాదులు సైతం వాస్తవ పరిస్థితులను గుర్తించడంలో విఫలమవుతున్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి ఇంచుమించు 230 సీట్లు మత్రమే రావచ్చు' అని కూడా ఆయన పేర్కొన్నారు. మార్చి 18న నాకు పంపిన ఒక ఈ–మెయిల్‌లో మహేశ్వరి ఇలా పేర్కొన్నారు: 'బీజేపీకి 230 సీట్లు మాత్రమే రాగలవని మరో మారు చెప్పుతున్నాను. ఉత్తరప్రదేశ్‌లోని 80 సీట్లలో ఆ పార్టీకి 30 మాత్రమే దక్కుతాయి. ఓటర్లలో ఆ పార్టీ పట్ల తీవ్ర అసంతృప్తి ఉన్నది– రాహుల్‌గాంధీ నాయకత్వ దక్షత పట్ల నాకు సందేహాలు ఉన్నప్పటికీ బీజేపీయేతర పార్టీ నాయకులలో ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్న ఏకైక నేత ఆయనేనని చెప్పి తీరాలి'. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవడానికి నెల రోజులు ముందే అనీల్ మహేశ్వరి ఈ విషయాలను పేర్కొన్నారు. రెండు దశల పోలింగ్ పూర్తయిన తరువాత, బీజేపీ మంచి మెజారిటీతో మళ్లీ అధికారానికి వస్తుందని వివిధ ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడయిన విషయం పట్ల పలువురు వ్యాఖ్యాతలు సంశయాన్ని వ్యక్తం చేశారు. పోల్‌స్టర్స్ పూర్తిగా పొరపడ్డారని కూడా కొంతమంది స్పష్టంగా అభిప్రాయడ్డారు. దేశ వ్యాప్తంగా ప్రచలితంగా ఉన్న ఒక అభిప్రాయానికి విరుద్ధమైన అభిప్రాయాన్ని ఘంటాపథంగా వ్యక్తం చేసిన నిశిత పరిశీలకుడు అనీల్ మహేశ్వరి. బీజేపీకి మెజారిటీ రాదని ముందే గ్రహించిన ప్రతిభావంతుడు. ఆయన దూర దృష్టి బహుధా అభినందనీయమైనది.



నరేంద్ర మోదీ పాలనా శైలిలో ప్రతీకాత్మక సంయమనం చోటుచేసుకోవాలని నేను ఆశిస్తున్నాను; పార్లమెంటులో చర్చలకు మరింత సమయాన్ని కేటాయించి అవి సమగ్రంగా జరిగేందుకు అవకాశమివ్వాలని కోరుతున్నాను. ప్రతిపక్షాల ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గవర్నర్ల విధుల నిర్వహణ రాజ్యాంగబద్ధంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రధాని మోదీతో సహా సీనియర్ మంత్రులు మన తోటి భారతీయ పౌరులు అయిన ముస్లింలను అనుక్షణం తెగనాడే అలవాటుకు స్వస్తి చెప్పి తీరాలి.

1989–2014 సంవత్సరాల మధ్య పార్లమెంటులో ఏ ఒక్క పార్టీకి మెజారిటీ లేదు. ఆ కాలంలో ఏడుగురు ప్రధాన మంత్రులు అధికారంలో ఉన్నారు. వారిలో నలుగురు– వి.పి.సింగ్, చంద్రశేఖర్, దేవేగౌడ, ఐ.కె.గుజ్రాల్– ఒక్కొక్కరు రెండు సంవత్సరాల కంటే తక్కువ కాలమే అధికారంలో ఉన్నారు. అదే కాలంలో కనీసం ముగ్గురు ప్రధానమంత్రులు– పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజపేయి, మన్మోహన్ సింగ్– కనీసం ఒక పర్యాయమైనా ఐదేళ్ల పాటు పూర్తిగా అధికారంలో ఉన్నారు.

ఇప్పుడు మూడో పర్యాయం ప్రధాన మంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ఈ విశిష్ట జాబితలో చోటు సాధించుకున్నారు లోక్‌సభలో తన పార్టీకి మెజారిటీ లేక పోయినప్పటికీ ఆయన ప్రధానమంత్రిగా ఉన్నారు. మోదీకి ముందు ప్రధాన మంత్రిగా ఉన్నవారు ఆలనానుభవాలు, స్వభావ రీత్యా ఇతర పార్టీలతో సమన్వయ సహకారాలతో సమర్థ పాలననందించ గలిగారు. వారికి పూర్తిగా భిన్నమైన పాలకుడు నరేంద్ర మోదీ. పీవీ నరసింహారావు ప్రధానమంత్రి కాక పూర్వం ఇందిర, రాజీవ్ ప్రభుత్వాలలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించారు. వాజపేయి ప్రధానమంత్రి కాకపూర్వం మొరార్జీ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా ఉన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రికాక పూర్వం నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా పని చేశారు. అనేక సంవత్సరాల పాటు ఆరెస్సెస్ ప్రచారక్‌గా, బీజేపీ కార్యకర్తగా నరంద్ర మోదీ ఇతరులతో కలిసి, లేదా వారి నాయకత్వంలో పని చేసిన మాట నిజమే అయితే ఎన్నికల రాకీయాలలోకి ప్రవేశించిన నాటి నుంచీ ఆయన స్వతంత్రంగా ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మంత్రిగా గానీ, చివరకు ఎంపీ లేదా ఎమ్మెల్యేగా గానీ ఎన్నడూ ఆయన లేరు. 2001 నుంచి మోదీ ఒకే ఒక్క ధ్యేయంతో పని చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం లేదా దేశ ప్రధాన మంత్రి కావడమే ఆయన లక్ష్యంగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే 23 సంవత్సరాల పాటు బిగ్‌బాస్, టాప్‌బాస్ లేదా సుప్రీంబాస్‌గా మాత్రమే ఆయనకు జీవితం తెలుసు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ముఖ్యమంత్రిగాను, ప్రధానమంత్రిగాను నరేంద్ర మోదీ అవధులు లేని స్వీయ వ్యక్తి పూజను ప్రోత్సహించారు, పెంపొందించారు. తొలుత గుజరాత్‌ను, ఆ తరువాత దేశాన్ని మహా సంపద్వంతంగా తీర్చిదిద్దిన పాలకుడుగా, నాయకుడుగా తనను తాను దేశ ప్రజలకు, విశాల ప్రపంచానికి నిస్సంకోచంగా చాటుకున్నారు. ఇలా అధికారానికి వ్యక్తిత్వారోపణను మరింత ముమ్మరం చేసేందుకు గాంధీ నగర్‌లోను, న్యూఢిల్లీలోను, తనకు ఎటువంటి మినహాయింపులు లేని విధేయత చూపాలని కేబినెట్ సహచరులను పురిగొల్పారు. మోదీ ఆశించిన విధంగానే వారూ ఆయన అధికారాన్ని సంపూర్ణంగా అంగీకరించారు. విధేయులు అయ్యారు. ముఖ్యమంత్రిగాను, ప్రధానమంత్రిగాను తన ప్రభుత్వం ఎప్పుడు ఎక్కడ ఏ కొత్త ప్రాజెక్టును ప్రారంభించినా, దాని నిర్మాణాన్ని ముగించినా ఆ ఘనతను పూర్తిగా తనకే ఆపాదించుకోవడం ఆయనకు పరిపాటి అయింది.

తన నేతృత్వంలో బీజేపీ వరుసగా మూడోసారి కూడా ఘన విజయం సాధిస్తుందని, తాను మరోసారి తప్పక ప్రధానమంత్రిని అవుతానని మోదీ విశ్వసించారు. అందుకే మూడోసారి ప్రధానమంత్రి పదవినధిష్ఠించిన వెన్వెంటనే తొలి 100 రోజుల్లో అమలుపరిచే ఒక ఎజెండాను ప్రజలకు నివేదించనున్నట్టు మోదీ ప్రకటించారు. తన 100 రోజుల ఎజెండాలో 50 నుంచి 70 లక్ష్యాలను మోదీ నిర్దేశించుకోనున్నారని మే 10న ఒక జాతీయ దినపత్రిక వెల్లడించింది. మోదీ తన తొలి 100 రోజుల్లో అమలుపరచదలిచిన ఎజెండా విషయమై అధికారులతో సమావేశమవనున్నారని జూన్ 2న మరో జాతీయ దినపత్రిక పేర్కొంది. గమనించారా? అధికారులతో సమావేశమవడానికి మాత్రమే మోదీ నిర్ణయించుకున్నారు!

సరే, అనుకున్నవన్నీ జరగవు కదా. సార్వత్రిక ఎన్నికల అనంతరం మోదీ మూడో ప్రభుత్వం వస్తుందని ఆయనతో పాటు చాలా మంది భావించారు. అయితే అనూహ్యంగా మోదీ మూడో ప్రభుత్వానికి బదులుగా ఎన్డీఏ రెండో ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ దిగ్భ్రాంతికర పరిణామం ఒక ప్రశ్నను లేవనెత్తుతుంది! స్వాభావికంగా నిరంకుశుడు అయిన నాయకుడు ఒక ప్రజాస్వామ్య పాలకుడుగా పరిణమిస్తారా? ఈ పుణ్యభూమిలో తాను భగవంతుడి ప్రతినిధినని ఇటీవలే చెప్పుకున్న వ్యక్తి తననుతాను మానవ మాత్రుడుగా పరిగణించుకుంటారా? తానూ తప్పులు చేస్తానని అంగీకరిస్తారా? పాలనా వ్యవహారాలలో ఇతరుల సలహాలు తీసుకునేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారు. సలహాలు ఇచ్చిన వారి గురించి ఒక మంచి మాట చెప్పే సుగుణం ఆయనకు ఉన్నదా? పార్లమెంటులో సంఖ్యాబలం లేని ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ప్రధాని మోదీ, తన కేబినెట్ సహచరులకు మరింత అధికారాన్ని ఇచ్చేందుకు అంగీకరిస్తారా? తన ఎంపీలపై అనుచిత పెత్తనం చెలాయించడాన్ని మానుకుంటారా? ప్రతిపక్షాన్ని సమాదరించి పాలనలో దాని సహాయాన్ని తీసుకోవడానికి సిద్ధమవుతారా? తన పార్టీ పాలనలో లేని రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను గౌరవిస్తారా?

జాగ్రత్తగా ఆలోచించిన తరువాత మాత్రమే సమాధానాన్ని ఇవ్వాల్సిన ప్రశ్నలివి. ఆ సమాధానాలు వెల్లడయేందుకు తప్పక కొన్నినెలలు లేదా సంవత్సరాలు పడుతుంది. అందుకు ఆశాభావంతో వేచి వుందాం. ఈ లోగా నరేంద్ర మోదీ పాలనా శైలిలో ప్రతీకాత్మక సంయమనం చోటుచేసుకోవాలని నేను ఆశిస్తున్నాను; పార్లమెంటులో చర్చలకు మరింత సమయాన్ని కేటాయించి అవి సమగ్రంగా జరిగేందుకు అవకాశమివ్వాలని కోరుతున్నాను. ప్రతిపక్షాల ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గవర్నర్ల విధుల నిర్వహణ రాజ్యాంగబద్ధంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఆ రాజ్యాంగ అధికారులు అసహ్యకరమైన పద్ధతుల్లో వ్యవహరించకుండా కేంద్రం వారిని కట్టడి చేసి తీరాలి. ప్రధాని మోదీతో సహ సీనియర్ మంత్రులు మన తోటి భారతీయ పౌరులు అయిన ముస్లింలను అనుక్షణం తెగనాడే అలవాటుకు స్వస్తి చెప్పి తీరాలి. పాలనా రీతుల్లో గణనీయమైన మార్పు వస్తుందో లేదో వేచి చూడవలసి ఉంది. ప్రధాని మోదీ స్వాభావికంగా సమస్త అధికారాలను తన చేతుల్లోకి తీసుకునేందుకు ఇష్టపడతారు. ఆధిపత్య చెలాయింపే ఆయన సహజ ప్రవృత్తి. రెండు దశాబ్దాల పాటు అడ్డూ అదుపు లేని విధంగా అధికారాన్ని చెలాయించిన కారణంగా ఆయనలో అప్రజాస్వామిక ధోరణులు మరింతగా దృఢపడ్డాయి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

బీజేపీకి 'ఆమె' మద్దతు తక్కువే!

రైతుల ఆగ్రహమే భారతీయ జనతా పార్టీకి కనీస మెజారిటీని నిరాకరించిందా? దళితులలో రహస్య వ్యాకులత బీజేపీకి వ్యతిరేకంగా పని చేసిందా? ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు బీజేపీకి దూరమయ్యారా? లేక ముస్లిం ఓటర్ల వ్యతిరేకత వల్లే పాలక పక్షానికి సీట్ల ఆధిక్యత లభించలేదా? బీజేపీ కొత్తగా సమకూర్చుకున్న మహిళా ఓటుకు ఏమయింది? 18వ సార్వత్రిక ఎన్నికల ఫలితాల విశ్లేషణలో ఈ ప్రశ్నలకు కీలక ప్రాధాన్యమున్నది.

ఆ ఫలితాల సమగ్ర విశ్లేషణ అనేక భ్రమలను తొలగించింది. జాతీయ స్థాయిలో ప్రధాన సామాజిక వర్గాల ఓటింగ్ ప్రాధాన్యాలలో ఎటువంటి మార్పు లేదు. అయితే దళితులు, పేదలు, సన్నకారు రైతాంగ వర్గాలలో అటువంటి మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు, ముస్లిం ఓటర్లు సంఘటితమయ్యారు. అగ్రకులాలు, మధ్యతరగతి ప్రజలు, హిందువులలోని బాగా వెనుకబడిన కులాలవారు, ఆదివాసీలలో బీజేపీ తన ప్రభావాన్ని, ఆధిక్యాన్ని నిలబెట్టుకున్నది. ఓటింగ్ తీరుతెన్నులలో ఈ మార్పులు, యథాతథ పరిస్థితుల మూలంగా ఎన్‌డీఏకు లభించిన ఓట్ల శాతం జాతీయ స్థాయిలో లభించిన ఓట్ల శాతం తగ్గిపోయింది రాష్ట్ర స్థాయిలో ఆయా సామాజక వర్గాల ఓటింగ్ ప్రాధాన్యాలలో మార్పులు చాలా ఆసక్తికరంగాను, ప్రభావ శీలంగాను ఉన్నాయి. మా విశ్లేషణ ఒక బృహత్ రాజకీయ సవాల్‌ను నివేదిస్తుంది. 1990ల్లో అధికార సాధనలో బీజేపీ ఉత్థానం ఒక కొత్త సామాజిక కూటమిని సృష్టించింది.. 'అగ్ర' కులాల, 'మధ్య' తరగతి, పట్టణ ప్రాంతాల, , పురుష ఓటర్ల సామాజిక సంకీర్ణమది. ఈ సామాజిక సంకీర్ణం రాజకీయ మెజారిటీని సాధించేందుకు సామాజికంగా దిగువ స్థాయిలో ఉన్న కులాలను కూడా కలుపుకున్నది. మోదీ జాతీయ స్థాయిలో రంగంలోకి వచ్చిన తరువాత ఈబీసీలు, పేదలు, ఆదివాసీలను కలుపుకోవడం ద్వారా ఆ సామాజిక కూటమి మరింతగా సంఘటితమయింది. అయితే ఈబీసీలు, పేదలు, ఆదివాసీలు ఈ సామాజిక సంకీర్ణంలో అనుబంధ, ప్రతీకాత్మక భాగస్వాములు మాత్రమే అన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. ఈ సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ రాజకీయ ఓటమికి లోనయినప్పటికీ దానికి మద్దతునిచ్చే సామాజిక సంకీర్ణం చాలవరకు ఆ పార్టీ పక్షానే ఉన్నది. సామాజిక వ్యవస్థలో బాగా దిగువ స్థాయిలో ఉన్న పేదలు, గ్రామీణులు, దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మైనారిటీలను ఏకం చేసే రాజకీయ కర్తవ్యం నెరవేరేందుకు ఇంకా చాలా దూరం పయనించవలసి ఉన్నది. సామాజికంగా అధిక సంఖ్యాకులు అయిన బహుజనులను రాజకీయంగా అధిక సంఖ్యాక వర్గంగా మార్చవలసి ఉన్నది. బహుజనులను రాజకీయ అధిక సంఖ్యాకులుగా మార్చడమనేది కాంగ్రెస్, ఇండియా కూటమిలోని దాని భాగస్వామ్యపక్షాల ముందున్న ఒక ప్రధాన సవాల్.



■ యోగేంద్ర యాదవ్

1) హిందూ అగ్రకులాల వారు బీజేపీకి విధేయ ఓటు బ్యాంకుగా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఏదో ఒక రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్నారనే వార్తలు రావడం పరిపాటిగా ఉంది. ఇటీవలి ఎన్నికలలో యూపీలో రాజ్‌పుట్‌లు, గుజరాత్‌లో క్షత్రియులు బీజేపీ పట్ల అసంతృప్తితో ఉన్నారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే అగ్రకులాల హిందువులు బీజేపీకి అత్యంత విధేయ ఓటు బ్యాంకుగా ఉన్నారని మా విశ్లేషణలో వెల్లడయింది. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు ఉన్న 'ముస్లిం ఓటు బ్యాంకు కంటే బీజేపీకి ఉన్న అగ్రకులాల ఓటు బ్యాంకే చాలా పెద్దది. మొత్తం ఓటర్ల మొగ్గు బీజేపీ నుంచి ఇతర పార్టీల వైపు ఉన్నప్పుడు అగ్రకులాల హిందువులు సైతం స్వల్పసంఖ్యలో బీజేపీకి దూరమయ్యారు. హర్యానా, యూపీలలో ఓటింగ్ ధోరణులే ఇందుకు నిదర్శనాలు.

2) ఇండియా కూటమి వైపు కిసాన్ సామాజిక వర్గాల మొగ్గు : గ్రామీణ ప్రాంతాలలో భూవసతి గల రైతు కులాలు (సవర్ణేతరులు, అయితే చాల వరకు ఓబీసీ యేతరులు) బీజేపీకి కాకుండా ఇండియా కూటమికి మద్దతు తెలిపారు వ్యవసాయరంగ దురవస్థలు, రైతుల ఆందోళనలే ఇందుకు కారణం కావచ్చు. రాజస్థాన్, హర్యానాలో జాట్‌లు, యూపీలో యాదవులు, మహారాష్ట్రలో మరాఠాలు కర్ణాటకలో కొంతవరకు లింగాయత్‌లు, ఒక్కళిగలు ఎన్‌డీఏను దెబ్బ తీశారు. అయినప్పటికీ బీజేపీ కొన్ని రైతు కులాల వారిలో తన ఓట్ల వాటాను పెంచుకున్నది. గుజరాత్‌లో పాటీదార్లు, మధ్యప్రదేశ్‌లో యాదవులు బీజేపీ విజయానికి బాగా తోడ్పడ్డారు.

3) కీలక రాష్ట్రాలలో నష్టపోయినా ఈబీసీలను నిలుపుకున్న బీజేపీ : గ్రామీణ భారతదేశంలో బీజేపీ ప్రధాన మద్దతుదారులుగా బాగా వెనుకబడిన కులాల వారు ఆవిర్భవించారు. అయితే ఈ వర్గాల మద్దతు విషయంలో దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల మధ్య వ్యత్యాసమున్నది.

4) బీఎస్పీకి దూరమైన దళిత ఓటర్లు: ఉత్తరప్రదేశ్‌లోను, ఇతర ఉత్తరాది రాష్ట్రాలలోను బీఎస్పీకి, మహారాష్ట్రలో వంచిత్ బహుజన్ అఘాడి దళిత ఓటర్లు దూరమయ్యారు. ఇండియా కూటమి వైపు వారు మొగ్గారు. అయినప్పటికీ బీజేపీ, దాని మిత్రపక్షాలు దళిత ఓట్లలో తమ వాటాను ఐదు శాతం మేరకు కోల్పోయాయి. మధ్యప్రదేశ్, గుజరాత్‌లో దళిత ఓటర్ల మద్దతును బీజేపీ నిలుపుకున్నది. అలాగే తెలంగాణలో మాదిగలు బీజేపీకి మద్దతునిచ్చారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దళిత ఓట్లను మళ్లీ గణనీయంగా పెంచుకున్నాయి. ఈ విషయంలో ఇండియా కూటమి ఎన్‌డీఏతో సరిసమానంగా ఉన్నది.



ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల ఓటింగ్‌లో మహిళలు మున్నెన్నడూ లేని విధంగా పాల్గొన్నారు. మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలూ అత్యధిక ప్రాధాన్యమిచ్చాయి. మహిళా కేంద్రిత సంక్షేమ పథకాల గురించి బీజేపీ ఎంతగా ప్రచారం చేసినప్పటికీ మహిళా ఓటర్ల మద్దతును పొందడంలో బీజేపీ వెనుకబడే ఉన్నది.

5) హిందూ ఆదివాసీ ఓట్లలో ఎన్‌డీఏ ఆధిక్యత: ఈ పరిణామం కాంగ్రెస్‌కు కలవరపాటు కలిగించేది. 2009 – 2024 మధ్య బీజేపీ ఆదివాసీల వాటా ఇతోధికంగా పెరిగింది. ఆదివాసీ ఓటర్లలో కాంగ్రెస్ బీజేపీ కంటే 20 శాతం మేరకు వెనుకబడి ఉన్నది. హిందూ ఆదివాసీ ఓట్లను బిజూ జనతాదళ్, బీఆర్ఎస్, తృణమూల్ కాంగ్రెస్ నష్టపోయిన మేరకు బీజేపీ లబ్ధి పొందింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో హిందూ ఆదివాసీ ఓట్లను కాంగ్రెస్ గణనీయంగా కోల్పోయింది.

6) బీజేపీ ఓటమి లక్ష్యంగా సంఘటితమైన ముస్లిం ఓటర్లు: ముస్లింలకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ ఎడతెగని ప్రచారం కారణంగా ఆ పార్టీని ఓడించేందుకు ముస్లింలు సంఘటితమయ్యారు. జాతీయ స్థాయిలో సగటు ఓటింగ్ (65 శాతం) కంటే ముస్లింల ఓటింగ్ (62 శాతం) స్వల్పంగా తక్కువ. బీజేపీకి వ్యతిరేకంగా వేసిన ఓట్లు 65 శాతం మేరకు ఉన్నాయి. ఇండియా కూటమిలోని తృణమూల్ కాంగ్రెస్ ఓట్లను కూడా కలుపుకుంటే బీజేపీ వ్యతిరేక ముస్లిం ఓటింగ్ శాతం మరింత అధికంగా ఉంటుంది. 2019లో యూపీఏ / ఇండియా కూటమికి ముస్లిం ఓట్లు 45 శాతం లభించగా 2024లో అది 65 శాతం మేరకు ఉన్నది. అయితే ఈ పెరుగుదల ఒక మిథ్య మాత్రమే. ఎందుకంటే సమాజ్‌వాది పార్టీ, జేఎంఎమ్ మొదలైన పార్టీలు 2019లో యూపీఏ కూటమిలో భాగస్వాములుగా లేవు. ముస్లిం ఓట్లు ఈ పార్టీలకు గణనీయంగా పడి ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుత విశ్లేషణలో ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు కనుకనే బీజేపీ వ్యతిరేక ముస్లిం ఓటింగ్ శాతం అత్యధికంగా ఉన్నది. యూపీలో ఎస్పీ, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు కారణంగా ముస్లిం ఓట్లలో చీలిక సంభవించలేదు.

7) కాంగ్రెస్‌కు పేద ఓటర్ల, బీజేపీకి ధనిక ఓటర్ల మద్దతు: పేద ప్రజల ఓట్లలో బీజేపీ వాటా స్తంభించిపోయింది. పేదల ఓట్లలో కులాల వారీ చీలికలు సంభవించాయనేందుకు రుజువులు లేవు. పేదల, నిరుపేదల ఓట్లలో బీజేపీ తన వాటా లోటును మోదీ రంగంలోకి వచ్చిన తరువాత భర్తీ చేసుకోగలిగింది. అయితే సంపన్నవర్గాల వారి ఓట్లలో తన వాటాను అంతకంతకూ పెంచుకొంటోంది. పేదల అనుకూల గ్యారంటీల ద్వారా పేదల ఓట్లలో తమ వాటాను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు గణనీయంగా పెంచుకున్నాయి. అయితే పేద ప్రజల సానుకూల విధానాలను ఓట్లకు ప్రాతిపదికలుగా మార్చుకోవడానికి కాంగ్రెస్ ఇంకా చాలా దూరం ప్రయాణించవలసి ఉన్నది.


8) మహిళా ఓటర్ల మద్దతులో బీజేపీ ఎప్పటి మాదిరిగానే వెనుకబడి ఉన్నది: ఈ సార్వత్రిక ఎన్నికల ఓటింగ్‌లో మహిళలు మున్నెన్నడూ లేని విధంగా పాల్గొన్నారు. మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు అత్యధిక ప్రాధాన్యమిచ్చాయి. అయితే మహిళా కేంద్రిత సంక్షేమ పథకాల గురించి బీజేపీ ఎంతగా ప్రచారం చేసినప్పటికీ మహిళా ఓటర్ల మద్దతును పొందడంలో వెనుకబడే ఉన్నది.

9) బీజేపీకి యువ ఓటర్ల మద్దతు తగ్గుదల: ఐరోపాలో మాదిరిగా మన దేశంలో వయస్సుల వారీగా ఓటింగ్ ప్రాధాన్యాలు లేవు. 35 సంవత్సరాల వయసులోపు ఓటర్ల మద్దతు బీజేపీకి 1 నుంచి 2 శాతం మేరకు తగ్గిపోయింది యువ ఓటర్లు ఇండియా కూటమి వైపు మొగ్గు చూపారనేందుకు గట్టి రుజువులు లేవు.

10) నగరాలలో ఎన్‌డీఏ, గ్రామాలలో ఇండియా కూటమికి మద్దతు: నగర ప్రాంతాలలో తన ప్రాబల్యాన్ని బీజేపీ నిలబెట్టుకున్నది. చిన్న పట్టణాలు, గ్రామాలలో మద్దతును స్వల్పంగా కోల్పోయింది. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలైన శివసేన (యుబిటి) ముంబైలోను, డీఎంకే చెన్నైలోను మంచి ఫలితాలను సాధించినప్పటికీ ఈ కూటమికి నగరాలలో చాలా తక్కువ మద్దతు మాత్రమే లభించింది. గ్రామీణ, చిన్న పట్టణాలలోనే ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు ప్రధాన విజయాలను సాధించాయి.

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందిస్తున్న ఐదు వ్యాసాల పరంపరలో ఇది నాలుగవది)



శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.2 కనిష్ఠం 23.7

ఐసెట్ టాపర్లు మనోళ్లే..

● నగర అభ్యర్థులకే తొలి మూడు ర్యాంకులు

హైదరాబాద్ సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్స్ ఇన్ కంప్యూటర్ అప్లికేషన్(ఎంసీఏ) కోర్సుల్లో ప్రవేశాలకు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఐసెట్)లో గ్రేటర్ హైదరాబాద్ యువతీ యువకులు సత్తా చాటారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో టాప్ టెన్ ర్యాంకుల్లో ఆరింటిని కైవసం చేసుకున్నారు. తొలి మూడు ర్యాంకులతో పాటు 6, 8, 9 ర్యాంకులు నగర విద్యార్థులు హస్తగతం చేసుకున్నారు.

జాబ్ చేస్తూనే రాశా..



వాసవి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఐటీ చదివా. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నా. మంచి ర్యాంకు వస్తుందనుకున్నా కానీ, ఫస్ట్ ర్యాంకు వస్తుందనుకోలేదు. అమ్మ గృహిణి. నాన్న ముజీబుల్లా హుస్సేనీ సౌదీలో ఉద్యోగం చేస్తున్నారు. ఎంబీఏ చేస్తే ప్రమోషన్ వస్తుందని ఆశ. ఆర్థిక అవసరాల కారణంగా ఉద్యోగం వదల్లేను. ప్రస్తుతం జాబ్ చేస్తున్న సంస్థ సహకరిస్తే రెగ్యులర్‌గా ఎంబీఏ చదువుతా.

- మునీబుల్లా హుస్సేనీ, 1వ ర్యాంకు.

కూలీపనుల కోసం వలసొచ్చాం..




కూలీ పనుల కోసం రంగారెడ్డి జిల్లా సుద్దపల్లి నుంచి తుర్కయాంజాల్‌కు అమ్మానాన్నలతో కలిసి వలసొచ్చాం. మూడేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపేరవుతూ ఐసెట్ రాశా. టాప్ 2 ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబీఏ బిజినెస్ ఎనలిటిక్స్ చదువుతా.

- జెల్లా భరత్, 2వ ర్యాంకు.

మరికొందరి అభిప్రాయాలు.. 8లో

క్యాంపస్ ప్లేస్‌మెంటుకు చెల్లు





- 5శాతం మందికైనా దక్కని క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు
- ఐఐటీలో చదివినవారికీ అందని ద్రాక్షగా ఉద్యోగాలు
- నైపుణ్యం లేకపోతే ఉద్యోగం కష్టమేనంటున్న రిక్రూటర్లు

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌పై కంపెనీలు ఆసక్తి చూపడం లేదు. పేరొందిన కళాశాలల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మరి ఐటీ రంగంలో నియామకాలు జరగడం లేదా అని అంటే, గతమంత ఘనంగా లేవని, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో భారీ కోత పడిందని రిక్రూటర్లు చెబుతున్నారు.

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో భారీ కోత పడింది. 2024లో దాదాపు 15 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు క్యాంపస్‌ల నుంచి బయటకు వస్తే, దాదాపు 1.5 లక్షల మందికి క్యాంపస్‌లో ఉద్యోగాలు వస్తాయని స్టాఫింగ్ సంస్థల ప్రతినిధులు అంచనా వేశారు. కానీ, దానిలో సగం మంది కూడా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ పొందలేకపోయారని అంటున్నారు. ఇప్పటికే పేరొందిన ఎంఎన్‌సీ కంపెనీలు సైతం క్యాంపస్ రిక్రూట్‌మెంట్లకు విరామం ఇవ్వడం ద్వారా ఖర్చు తగ్గించుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

యూఎస్, యూకేల్లో ఎన్నికలు ముగిస్తే..

ఎన్నాళ్లు ఈ పరిస్థితులు ఉంటాయంటే, చెప్పడం కష్టమేనంటున్నారు ఓ కన్సల్టెన్సీ ప్రతినిధి రవికుమార్. 'సర్వీస్ ఓరియెంటెడ్ సెక్టార్ అయిన ఐటీలో నియామకాలన్నీ ఇతర దేశాల్లోని పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. మీరు గతం చూస్తే 10, 12 ఏళ్ల క్రితం కూడా ఇలాగే క్యాంపస్‌లను వదిలి ఆఫ్ క్యాంపస్ నియామకాలను కంపెనీలు చేసుకున్నాయి. తర్వాత పరిస్థితి మారింది. ఇప్పుడూ అలాగే ఉంటుందనుకుంటున్నాం. యూఎస్, యూకేల్లో ఎన్నికలు ముగిసి నూతన ప్రభుత్వాలు ఏర్పడి, తీసుకునే విధానపరమైన నిర్ణయాల వల్ల రాబోయే సంవత్సరంలోనే పరిస్థితి మారినా ఆశ్చర్యం లేదు' అని విశ్లేషించారు.

మారిన సంప్రదాయం

సాధారణంగా ఐటీ కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు అధిక ప్రాధాన్యమిస్తుంటాయి. భారీ ఎంఎన్‌సీ కంపెనీలతో పాటుగా మిడ్ రేంజ్ ఐటీ కంపెనీలు కూడా కొన్నేళ్లుగా ఇదే విధానం అనుసరించేవి. 2024లో పరిస్థితులు మారిపోయాయి. ఐఐటీ ముంబై లాంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లోనే ఈ సంవత్సరం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ చేసుకున్న విద్యార్థుల్లో 35 శాతానికి పైగా ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నారని నివేదికలు చెబుతున్నట్లు ఓ ప్రముఖ సంస్థలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంజనేయులు తెలిపారు. 'అంతర్జాతీయంగా, మరీ ముఖ్యంగా యూఎస్, యూకేలాంటి దేశాల్లో ఐటీ రంగంలో మందగమనం కనిపిస్తున్నది. ఆ దేశాలపై

మిగతా 8వ పేజీలో..



ప్రతి జిల్లా కేంద్రంలో బ్లడ్ బ్యాంకు

కార్యక్రమానికి విచ్చేసిన మంత్రికి వేదికపై ప్రత్యేక కుర్చీ వేయడంతో అందరితో పాటు తనకూ సమాన కుర్చీనే వేయాలని సూచిస్తూ తీయిస్తున్న పొన్నం ప్రభాకర్

● మంత్రి పొన్నం ప్రభాకర్

బేగంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి జిల్లా కేంద్రంతో పాటు 100 పడకలు ఉన్న హాస్పిటల్‌కు ఒక బ్లడ్‌బ్యాంక్ ఉండేలా కృషి చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ సర్టిఫికెట్లను అందజేశారు. రెడ్‌క్రాస్ వాహనాలకు రవాణా శాఖ తరఫున పన్ను మినహాయింపు ఇవ్వాలని మంత్రికి ప్రతినిధులు ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ, రాజ్‌భవన్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీతో పాటు రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 'ప్రైడ్ ఇండియా' బాధితులు

● ఇళ్ల కూల్చివేతలపై ఫిర్యాదు ● ప్రజావాణికి 702 దరఖాస్తులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్

బేగంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బేగంపేట మాతాజీనగర్‌లోని ప్రైడ్‌ఇండియా వెంచర్‌లో ఇళ్ల కూల్చివేతపై బాధితులు ప్రజాభవన్‌లోని ప్రజావాణిలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆరు సంవత్సరాల క్రితం లక్షలాది రూపాయలు పెట్టి ప్లాట్లు కొని, మున్సిపల్ ట్యాక్స్ చెల్లిస్తున్నామని, ఇటీవలే కరెంటు మీటర్లు కూడా వచ్చాయని, ఇంతలోనే రెండు రోజుల క్రితం జీహెచ్‌ఎంసీ అధికారులు ఇళ్లను కూల్చివేశారని ప్రజాభవన్‌లోని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్యలకు బాలాజీనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. రకరకాల సమస్యలకు సంబంధించి ప్రజావాణికి శుక్రవారం 702 దరఖాస్తులు వచ్చాయి. ప్రధానంగా భూసమస్యలు, ఇళ్లు, పెన్షన్లు, కాంట్రాక్టు ఉద్యోగాల నుంచి తొలగించారని ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి.



పొట్టేళ్లు, మేకలు దిగుమతి

బక్రీద్ నేపథ్యంలో 'ఖుర్బానీ' ఇవ్వడానికి ముస్లిం సోదరులు గొర్రెలు, మేకలు, పొట్టేళ్లు కొనేందుకు పోటీ పడుతున్నారు. ఈ మేరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గోవాతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల నుంచి నగరానికి భారీ సంఖ్యలో వాటిని తెప్పిస్తున్నారు. సైదాబాద్, చంచల్‌గూడ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు తాత్కాలికంగా అమ్మకం కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- సైదాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి)

బల్క్ గార్బేజ్‌తో రూ. 100 కోట్ల భారం

8

24/7 సిద్ధం

- వర్షాల ఇబ్బందులు ఎదుర్కొనేలా చర్యలు
- తాగునీరు కలుషితమవ్వకుండా పరీక్షలు
- మాన్‌సూన్ ప్రణాళికలు వెల్లడించిన వాటర్‌బోర్డు



హైదరాబాద్ సిటీ, జూన్14 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో గ్రేటర్ హైదరాబాద్‌లో ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కొనేందుకు 24/7 సిద్ధంగా ఉంటామని 24/7 వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షాల వల్ల తలెత్తే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు కార్యాలయంలో ఎండీ సుదర్శన్‌రెడ్డి మాన్‌సూన్ ప్రణాళికను శుక్రవారం వివరించారు. లోతట్టు ప్రాంతాలు, బస్తీల్లో తాగునీరు కలుషితమవ్వకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, క్షేత్రస్థాయిలో క్లోరిన్ పరీక్షలు నిర్వహించి నీటి నాణ్యతను పరిశీలిస్తామని తెలిపారు. రిజర్వాయర్ల వద్ద మరో విడత క్లోరినేషన్ జరపడంతో పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో క్లోరిన్ మాత్రలను పంపిణీ చేసేలా చర్యలు చేపడుతామని వివరించారు. వాటర్‌బోర్డులో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి 24/7 పని చేసేవిధంగా చర్యలు చేపట్టామని, ఫిర్యాదులను తీసుకోవడంతో పాటు వెంటనే పరిష్కరించేలా క్షేత్రస్థాయిలో అప్రమత్తం చేస్తారని తెలిపారు. వర్షాకాలంలో జీహెచ్‌ఎంసీలో ఏర్పాటు చేసే కంట్రోల్ రూమ్‌లో కూడా తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. మ్యాన్‌హోళ్ల మూతలు తీయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, లోతైన

మిగతా 8వ పేజీలో..

అత్యవసర పంపింగ్‌కు ట్రయల్ రన్

ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో నీటిమట్టాలు తగ్గుతుండడంతో వాటర్‌బోర్డు అప్రమత్తమైంది. గోదావరి జలాలను నగరానికి తరలించడంలో ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసర పంపింగ్‌కు ట్రయల్ రన్ ప్రారంభించింది. ఎల్లంపల్లి రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 485.560 అడుగులు. ప్రస్తుతం 458.257 అడుగులకు చేరింది. రిజర్వాయర్‌లో 3.3 టీఎంసీల నీరు ఉన్నంత వరకు గోదావరి జలాలు నగరానికి తరలింపులో ఇబ్బందులుండవు. ప్రస్తుతం మరో 0.6 మీటర్లకు నీటిమట్టం తగ్గితే అత్యవసర పంపింగ్‌లను ప్రారంభించాల్సి ఉంటుంది.



హైదరాబాద్ సిటీ, జూన్14 (ఆంధ్రజ్యోతి): ఓవైపు సంప్రదాయ సొగసులు, మరోవైపు ఆధునిక పోకడలు.. దానితో పాటే పర్యావరణం పట్ల ప్రేమ.. వీటన్నింటి మేళవింపుగా నిర్వహించిన ఫ్యాషన్ షో అదిరిపోయింది. 20కు పైగా డిజైనర్ల కలెక్షన్‌లతో జెడీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థుల ప్రదర్శన ఔరా అనిపించింది.


దయచేసి అమ్మను చంపొద్దు..

దయచేసి అమ్మను ఏమీ చేయవద్దని కొడుకు వేడుకుంటున్నా ఆగలేదు. కోపంతో ఊగిపోయాడు. కుమారుడి కళ్లెదుటే మహిళను కత్తితో పొడిచి చంపేశాడో ఆటోడ్రైవర్.



హత్యకు గురైన విజయలక్ష్మి (ఫైల్)

● కనికరించని ఆటోడ్రైవర్ ● కత్తితో మెడపై పొడిచి మహిళ దారుణ హత్య





నిందితుడు భరత్‌గౌడ్

చందానగర్, జూన్14(ఆంధ్రజ్యోతి): పట్టపగలే మహిళ హత్య జరిగింది. తమ్ముడి అప్పుకు జామీనుగా ఉండి డబ్బులివ్వలేదని కత్తితో పొడిచి చంపేశాడు. చందానగర్ పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఠాగూర్ విజయలక్ష్మి(40) జీవనోపాధి కోసం నగరానికి వలసొచ్చి, శేరిలింగంపల్లి నియోజకవర్గం నల్లగండ్ల లక్ష్మీవిహార్ ఫేజ్-1 లో నివాసం ఉంటోంది. ఆమె భర్త కూలీగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు రాహుల్‌సింగ్ టెన్త్ పాసయ్యాడు. రెండో కుమారుడు కార్తీక్ 8వ తరగతి చదువుతున్నాడు. విజయలక్ష్మి అపర్ణ సరోవర్ అపార్ట్‌మెంట్‌లోని ఇళ్లల్లో పని చేస్తోంది. రోజూ లక్ష్మీవిహార్ నుంచి అపర్ణకు ఆటోలో వెళ్లివచ్చేది. రాకపోకల సమయంలో ఆటోడ్రైవర్ భరత్ గౌడ్‌తో పరిచయం ఏర్పడింది. భరత్ ఫైనాన్స్ కూడా చేస్తుంటాడు. విజయలక్ష్మికి అవసరం ఉన్నప్పుడు పలుమార్లు డబ్బు అప్పుగా ఇచ్చాడు. విజయలక్ష్మి తిరిగి ఇచ్చేది. విజయలక్ష్మి తమ్ముడు సునీల్‌సింగ్‌కు ఫైనాన్స్‌పై భరత్ రెండు ఆటోలను ఇప్పించాడు. విజయలక్ష్మి జామీనుగా ఉంది. సునీల్ సింగ్ డబ్బులు చెల్లించడంలో ఆలస్యం చేయడంతో గొడవలు మొదలయ్యాయి. తెల్లాపూర్‌లో ఉండే సునీల్ సింగ్ అప్పు అసలు చెల్లించినప్పటికీ భరత్‌గౌడ్ ఇబ్బందులు పెడుతున్నాడని కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై సంగారెడ్డి కోర్టులో ఇటీవల జరిగిన లోక్‌అదాలత్‌లో కేసు రాజీ కూడా అయింది. ఈక్రమంలో విజయలక్ష్మి ఇళ్లలో పనిచేయడానికి శుక్రవారం వెళ్లింది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు లక్ష్మీవిహార్ ఫేజ్-1లో నివాసం ఉండే విజయలక్ష్మి ఇంటికి భరత్‌గౌడ్ వెళ్లాడు. ఆమె వచ్చేటప్పటికీ విజయలక్ష్మి ఇంటి వద్ద భరత్‌గౌడ్ ఉన్నాడు. అతడిని చూసిన విజయలక్ష్మి ఇక్కడికి ఎందుకువచ్చావ్ వెళ్లిపోవాలని చెప్పడంతో భరత్‌గౌడ్ కోపంతో ఊగిపోయాడు. తలుపులు తీసి విజయలక్ష్మి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా వెనుక నుంచి భరత్‌గౌడ్ కత్తితో మెడపై పొడిచాడు. దీంతో ఆమె కుప్పకూలింది.

ఇదంతా విజయలక్ష్మి కుమారుడు రాహుల్ కళ్ల ముందే జరిగింది. తల్లిని ఏమీ చేయవద్దని రాహుల్ వేడుకుంటున్నా వినకుండా భరత్‌గౌడ్ కత్తితో పొడిచాడు. ఆపే ప్రయత్నంలో రాహుల్ చేతులకు గాయాలు అయ్యాయి. విజయలక్ష్మి అక్కడికక్కడే చనిపోవడంతో ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే రాహుల్‌ను కూడా చంపేస్తానని బెదిరించి తలుపులకు గొళ్లెం పెట్టి వెళ్లిపోయాడు. భరత్‌గౌడ్ వెళ్లిన తర్వాత రాహుల్ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు తీసి పోలీసులకు సమాచారం అందించారు. ఈ హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అని పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ప్రముఖ లీగల్ కరస్పాండెంట్ పద్మనాభరావు మృతి

న్యూఢిల్లీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): హిందూ పత్రిక మాజీ లీగల్ కరస్పాండెంట్ టి.పద్మనాభరావు శుక్రవారం మధ్యాహ్నం న్యూఢిల్లీలో మరణించారు. ఆయన వయస్సు 92 సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దాదాపు 50 సంవత్సరాలపాటు లీగల్ రిపోర్టింగ్‌లో అనుభవం ఉన్న పద్మనాభరావు నెల్లూరు జిల్లాకు చెందినవారు. ఏపీ హైకోర్టులో లీగల్ కరస్పాండెంట్‌గా చాలా సంవత్సరాలపాటు బాధ్యతలు నిర్వర్తించిన తర్వాత ఆయన ఢిల్లీకి బదిలీ అయ్యారు. అనేక సంవత్సరాల అనుభవం ఉన్న పద్మనాభరావును ఉద్యోగ విరమణ సందర్భంగా సుప్రీంకోర్టు సత్కరించింది. ఆంధ్ర అసోసియేషన్, ప్రెస్‌క్లబ్ తదితర సంస్థలూ ఆయన సేవలను గుర్తించి సన్మానం చేశాయి. పద్మనాభరావు మృతిపట్ల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌తోపాటు పలువురు న్యాయకోవిదులు, జర్నలిస్టులు సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియలు శనివారం ఢిల్లీలోనే నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

రేవంత్‌రెడ్డి, చంద్రబాబు కలిసికట్టుగా ఉండాలి

వేంకటేశ్వర స్వామిని ప్రార్థించా: ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

తిరుమల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు కలిసికట్టుగా ఉండాలని వేంకటేశ్వర స్వామిని ప్రార్థించానని తెలంగాణ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. దేశంలోనే తెలుగు రాష్ట్రాలను అగ్రగామిగా చేయాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండాలని, అన్నిరంగాల్లో రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలిపారు.

అసోసియేషన్ సభ్యులకు చెప్పకుండా

ఈసీ తీసుకుని ఇతరులకు భూమి మార్ట్‌గేజ్

● ఇద్దరు డైరెక్టర్లను అరెస్ట్ చేసిన నేర విభాగం అధికారులు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ ఎంప్లాయిస్ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను మోసం చేసి, భూమిని ఇతరులకు మార్ట్‌గేజ్ చేసిన ఇద్దరు డైరెక్టర్‌లను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్ట్ చేశారు. సైబరాబాద్ పరిధిలోని పేరొందిన సంస్థల్లో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులు 320మంది కలిసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ ఎంప్లాయిస్ హౌసింగ్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను 2007లో ఏర్పాటు చేశారు. సొసైటీ తరఫున పలు దఫాలుగా 6 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. ఆ స్థలంలో 240 అపార్ట్‌మెంట్‌లు, 15 విల్లాలు కట్టేందుకు ప్రణాళికలు రచించారు. సొసైటీకి సంబంధించి 2018లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సొసైటీ సెక్రటరీ ఉదయ్‌కుమార్ చావా, యాక్టింగ్ ప్రెసిడెంట్ గుజ్జారి అశోక్‌రావు... సొసైటీ సమావేశం నిర్వహించకుండా, సభ్యుల అనుమతి తీసుకోకుండా భూమిపై ఎన్‌కంబరెన్స్ సర్టిఫికేట్(ఈసీ) తీసుకొని ఇతరులకు మార్ట్‌గేజ్ చేశారు. విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సైబరాబాద్ ఆర్థికనేరాల విభాగం అధికారులు అశోక్‌రావు, ఉదయ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు.

15 రోజుల్లో 147 మంది ఆకతాయిల పట్టివేత

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత 15 రోజుల్లో 147 మంది ఆకతాయిలను పట్టుకున్నారు. వారిలో తీవ్రనేరాలు చేసిన వారిపై కేసులు నమోదు చేసి, మిగతా వారికి కుటుంబసభ్యుల సమక్షంలో ఎల్బీనగర్ క్యాంప్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో ఉమెన్ సేఫ్టీవింగ్ డీసీపీ ఉషావిశ్వనాథ్, ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీటీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు. మహిళకు పోర్న్ వీడియోలు చూపుతూ వేధించిన యువకుడికి, ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన ఓ వ్యక్తికి, ప్రేమించమంటూ వేధింపులకు గురిచేస్తున్న మరో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు షీటీమ్స్ సిబ్బంది తెలిపారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయండి: సీపీ తరుణ్ జోషి

బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ సీపీ డా.తరుణ్ జోషి తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే, మెట్రోస్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ షీటీం డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, బాలికలను, మహిళలను వెంబడించే, వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ, వారిని, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు వివరించారు.

విద్యారుణ శిబిరాలు నిర్వహించండి

- బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యారుణ శిబిరాలు నిర్వహించి నిరుపేద తల్లిదండ్రులకు తక్షణమే సాయం అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుల వారీగా రుణ లక్ష్యాలు, సాధింపులపై కలెక్టర్ సమీక్షించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో విద్యారుణాలు రూ.1203.84 కోట్లు లక్ష్యంగా ఉండగా.. ఇప్పటివరకు కేవలం రూ. 131.95 కోట్లు (10.96 శాతం) మాత్రమే అందించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బ్యాంకులు తక్షణమే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి నిరుపేదలకు విద్యా రుణాలు అందించి ఆదుకోవాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.55,908.22 కోట్లు కాగా.. రూ. 37,185.65 కోట్లు సాధించడం జరిగిందని, బ్యాంకులు నెల వారీగా టార్గెట్ నిర్దేశించుకుని అర్హులకు రుణాలను అందించాలని సూచించారు. స్వానిధి ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సకాలంలో రుణాలు అందించాలన్నారు. సమావేశంలో ఆర్‌బీఐ ఏజీఎం ఆర్.గోమతి, నాబార్డ్ డీడీఎం హర్ష రఘురాం, ఎల్‌డీఎం జీఎం సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు, జిల్లా పరిశ్రమ కేంద్రం జనరల్ మేనేజర్లు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

బల్దియాలో దొంగలు పడ్డారు..!

- ఫ్యాన్లు, నల్లాలు, ఏసీ కాపర్ వైర్లు చోరీ
- పాత ఫర్నిచర్, ఏసీలు కూడా..
- వరుసగా జరుగుతున్న దొంగతనాలు
- అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
- సెక్యూరిటీ నిఘా అంతంతే

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయంలోని ఏసీల కాపర్ వైర్లు, మరుగుదొడ్లలోని నల్లాలు, లైట్లు, కంప్యూటర్ల వద్ద స్పీకర్లు, కీబోర్డులు దొంగలించి అమ్ముకుంటున్నారు. కార్యాలయ ప్రాంగణంలో ఉంచిన పాత ఫర్నిచర్, ఏసీలూ చోరీ అయినట్టు ఓ అధికారి చెప్పారు. వాస్తవంగా పాత ఫర్నిచర్, ఇతర వస్తువులను వేలం వేసి అమ్మాల్సి ఉండగా.. సంబంధిత అధికారులు నెలల తరబడి పట్టించుకోకపోవడంతో దొంగల పాలయ్యాయి. కార్యాలయం చుట్టూ, ప్రతి అంతస్తులో సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు పనిచేయడం లేదు. ఇప్పటికే పలుమార్లు చోరీలు జరిగినా.. ఒక్కరినీ గుర్తించలేదు. దొంగతనాలకు సంబంధించి అధికారులు రెండు, మూడు పర్యాయాలు పోలీసులకూ ఫిర్యాదు చేశారు. అయినా చోరీలు ఆగకపోగా.. క్రమేణా పెరుగుతున్నాయి. సీసీ కెమెరాలతోపాటు 24 గంటలూ కార్యాలయంలో సెక్యూరిటీ ఉంటుంది. అయినా చోరీలు జరుగుతుండడం గమనార్హం. భవనంలోకి వెళ్లేందుకు మేయర్, కమిషనర్ వైపున్న ద్వారాలను, ప్రధాన గేట్లూ అర్ధరాత్రి 11, 12 గంటల వరకు తెరిచే ఉంచుతున్నారు. ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై ఓ వివాదానికి సంబంధించి కేసు నమోదు కాగా.. పోలీసులు జీహెచ్ఎంసీ ఐటీ విభాగం అధికారులను సీసీఫుటేజీ అడిగారు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని ఐటీ విభాగం చెప్పడంతో పోలీసులు ఆశ్చర్యపోయారు. కెమెరాలు పనిచేయకపోతే మీ సంస్థలో జరిగే చోరీ చేసిన వారిని ఎలా గుర్తిస్తామని ప్రశ్నించారు. రెండు, మూడేళ్లకోసారి కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తోన్న అధికారులు.. వాటి నిర్వహణకూ రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. అయినా అవి సక్రమంగా పనిచేయకపోవడం గమనార్హం.



మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/kCibqGV లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.

అధిక డొనేషన్లు వసూలు చేస్తున్న
ఇంజనీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోండి


ప్రొఫెసర్ లింబాద్రికి వినతిపత్రం అందజేస్తున్న ఐఎస్‌యూ నేతలు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అధిక డొనేషన్లు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఐఎస్‌యూ నేతలు శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు మాట్లాడుతూ.. అటానమస్ హోదా తెచ్చుకున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు రూ. 2లక్షలు మొదలుకొని రూ. 26లక్షల దాకా డొనేషన్ల కింద దోచుకుంటున్నాయన్నారు. మేనేజ్‌మెంట్ కోటా భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వకుండానే కాలేజీల యాజమాన్యాలు సీట్లను భర్తీ చేసుకుంటున్నాయని ఆరోపించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల అడ్మిషన్లపై పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కలిసిన వారిలో ఐఎస్‌యూ రాష్ట్ర నాయకులు పి.వెంకటేష్‌గౌడ్, ముత్యాల సతీష్ కుమార్ తదితరులున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి హత్య


సమీర్, అబ్దుల్ కుదీస్ (ఫైల్)

కార్వాన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు హత్యకు గురయ్యారు. జిర్రా గంగాబౌలి ప్రాంతంలో నివసిస్తున్న అబ్దుల్ కుదీస్(27) రౌడీషీటర్. స్థానికంగా వుడ్‌వర్క్ చేస్తుంటాడు. అతడిపై గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఆసిఫ్‌నగర్ క్రాస్‌రోడ్డు వద్ద కత్తులతో దాడి చేసి పారిపోయారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన కుదీస్‌ను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. గత ఏడాది ఆగస్టులో జరిగిన ముజీబ్ హత్య కేసులో అబ్దుల్ కుదీస్ నిందితుడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలాపూర్‌లో యువకుడు..

పహాడిషరీఫ్ జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని ఐదుగురు వ్యక్తులు కత్తులతో దాడిచేసి హత్య చేశారు. హఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ మునీర్ కుమారుడు మహ్మద్ సమీర్(19) డెకొరేషన్ పనిచేస్తుంటాడు. కాలనీలో మహిళ వద్దకు ఓ యువకుడు తరచూ వస్తున్నాడు. రావద్దని సమీర్ అతడిని హెచ్చరించాడు. కక్ష పెంచుకున్న ఆ యువకుడు సమీర్‌ను అడ్డుతొలగించాలనుకున్నాడు. స్నేహితులతో కలిసి పథకం వేశాడు. మట్లాడాలని సమీర్‌ను బాలాపూర్ రాయల్ కాలనీ గుర్రం చెరువు వద్దకు గురువారం రాత్రి పిలిపించారు. సమీర్ అక్కడికి వెళ్లగానే కత్తులతో దాడి చేశారు. సమీర్ కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని తీవ్రంగా గాయపడిన అతడిని ఒవైసీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమ వ్యవహారం నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. నిందితులు లొంగిపోయినట్లు సమాచారం.

పోలీస్ ఉద్యోగిని ఆత్మహత్య

నార్సింగ్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనురాధ (40) హైదరాబాద్ సిటీ పోలీస్ స్పెషల్ బ్రాంచిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త జనార్దన్‌రెడ్డి క్రాప్రా ప్రాంతంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. తాండూర్ ప్రాంతానికి చెందిన వీరు గచ్చిబౌలిలో ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. అనురాధ రెండవ చెల్లి అమెరికాలో ఉంటున్నారు. ఆమె ఫ్లాట్ మైహోం అవతార్ టౌన్‌షిప్‌లో 14వ అంతస్తులో ఉంది. చిన్న చెల్లి, తల్లి అందులో నివసిస్తున్నారు. అమెరికాలో ఉంటున్న చెల్లి డెలివరీ కోసం అనురాధ తల్లి వెళ్లగా చిన్న చెల్లి ఒక్కరే ఉంటున్నారు. అనురాధ శుక్రవారం చెల్లి వద్దకు వెళ్లింది. చెల్లి కిచెన్‌లో వంట చేస్తుండగా అనురాధ 14వ అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న నార్సింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కుటుంబ సభ్యులను అడిగి వివరాలు సేకరించారు. అనురాధ కొద్ది రోజులుగా డిప్రెషన్‌లో ఉందని, ఉద్యోగం మానేస్తానని చెప్పిందన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం


కేతావత్ కిషన్

మదీన, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గురువారం రాత్రి ఇంట్లో నిద్రపోయిన ఓ వృద్ధుడు కనిపించకుండాపోయాడు. బహదూర్‌పురా చిరాగ్‌అలీ నగర్‌కు చెందిన కేతావత్ కిషన్(63) ఈనెల 12వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రపోయాడు. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు కుటుంబ సభ్యులు లేచి చూడగా కిషన్ కనిపించలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో బహదూర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిషన్‌కు కొద్దిరోజుల నుంచి మానసిక పరిస్థితి సరిగా లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మోహనంగా నృత్యోత్సవం


కళాకారుల నాట్యప్రదర్శన

రవీంద్రభారతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నాట్యాంశాలకు వైవిధ్యభరితంగా నర్తించిన నర్తకులు ఆహూతులను సమ్మోహనపరిచారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో సద్గురు శివానంద నృత్యమాల స్కూల్ ఆఫ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో నృత్యోత్సవం శీర్షికన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నాట్య గురువు బి.సుధీర్‌రావు శిష్య బృందంచే కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించారు. తాండవ నృత్యకరి, జతిస్వరం, కొలువై ఉన్నాడే.., రామ కోదండరామ, సాధించెనే, లింగాష్టకం, శృంగార లహరి, రార వేణు, వెడలేర వయ్యారులు, తిల్లాన తదితర అంశాల్లో నర్తించిన కళాకారులు ప్రేక్షకుల్ని రంజింపజేశారు. చక్కటి ఆహార్యం ఆకట్టుకునే హావభావాలతో నర్తకులు ఔరా అనిపించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, ప్రముఖ నాట్య గురువు అలేఖ్య పుంజాల, సుధీర్‌రావు తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు. వారు మాట్లాడుతూ.. శాస్త్రీయ కళలు భారతీయ సంస్కృతికి నిదర్శనమని అన్నారు.

బీర్లను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు

- లక్ష్యాలను చేరుకోవడానికి కృషిచేయండి
- అధికారులకు ఎక్సైజ్ కమిషనర్ ఆదేశం


మాట్లాడుతున్న కమిషనర్ శ్రీధర్

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీర్ల కొరత లేకున్నా.. కొరత ఉన్నట్లు వస్తున్న ప్రచారంపై అధికారులు స్పందించాలని, కింగ్‌ఫిషర్ బీర్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని మద్యం దుకాణాదారులు పక్కదారిపట్టించి కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఇ. శ్రీధర్ హెచ్చరించారు. శుక్రవారం అబ్కారీ భవన్‌లో అన్ని జిల్లాల బీసీలు, ఏసీలతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి కిందిస్థాయి వారితో పనిచేయించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. శుక్రవారం ప్రభుత్వ పెద్దలతో జరగాల్సిన సమావేశం చివరి నిమిషంలో వాయిదా పడిందని, త్వరలో జరిగే సమావేశానికి సంబంధిత శాఖ అధికారులు అన్ని రికార్డులతో హాజరుకావాలని కమిషనర్ ఆదేశించారు. మారుమూల జిల్లాలతోపాటు మహానగరానికి దగ్గరగా ఉన్న జిల్లాలో అశించిన స్థాయిలో నాటుసారా తయారీ, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ దిగుమతులపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇతర ఎక్సైజ్ యంత్రాంగం గట్టి నిఘ పెట్టి అరికట్టాలని ఆదేశించారు. ప్రతినెల ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారుల, సిబ్బంది పనితీరుపై నివేదిక తయారు చేయాలన్నారు. అధికారులందరూ హెడ్‌క్వార్టర్‌లోనే ఉండాలన్నారు. బాగా పనిచేసిన వారికి ప్రశంసాపత్రాలు ఇస్తామని కమిషన్ అన్నారు. ప్రమోషన్లు, ఇతర బెనిఫిట్స్ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ అజయ్‌తోపాటు బ్రూవరేజస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహం ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా భానుచందర్



చార్మినార్ జూన్ 14 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొల్లూర్ భానుచందర్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. భానుచందర్ దశాబ్దకాలంగా సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటానని, ప్రజల్లో న్యాయవ్యవస్థపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తానన్నారు.

అంతర్జాతీయ అవార్డుకు అమృతవల్లి ఎంపిక



రవీంద్రభారతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కాకినాడ జిల్లా, పెద్దాపురం గ్రామానికి చెందిన ఏవీఎస్‌డీ అమృతవల్లి అంతర్జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారని మన సంస్కృతి సంస్థ సభ్యుడు డాక్టర్ అనిల్‌కుమార్ దివేది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన సంస్కృతి నిర్వహించిన రాష్ట్రస్థాయి తెలుగు ప్రతిభా పరీక్షల్లో అమృతవల్లి వరుసగా ఆరుసార్లు విజేతగా నిలిచిందన్నారు. సీబీఎస్‌సీ పదో తరగతి తెలుగు సబ్జెక్టులో వందకు 99 మార్కులు సాధించిందన్నారు. మాతృభాషలో రాణిస్తున్న అమృతవల్లి ప్రతిభను మలేషియాకు చెందిన యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్ అండ్ కల్చరల్ సంస్థ గుర్తించినట్లు చెప్పారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రతియేటా వివిధ దేశాలకు చెందిన ప్రతిభావంతులను గుర్తించి అంతర్జాతీయ పురస్కారాలు అందజేస్తారని, ఈ ఏడాది పురస్కారాల్లో అమృతవల్లిని ఎంపిక చేశారని తెలిపారు. ఈ నెల 17న మలేషియాలో జరగనున్న అంతర్జాతీయ పురస్కార ప్రదానోత్సవంలో అమృతవల్లి అవార్డు అందుకోనున్నారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తిచేయండి

అధికారులతో సమావేశంలో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

మదీన, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. యాకుత్‌పురా నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్ టి.వెంకన్నతో కలిసి శుక్రవారం పూల్‌బాగ్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులు, సమస్యలు, నాలాల విస్తరణ, ఇంజనీరింగ్, ప్రాజెక్ట్స్, హెల్త్, పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్, అర్బన్ బయోడైవర్సిటీ, వీధి దీపాలు తదితర విభాగాలకు చెందిన అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రెయిన్‌బజార్, తలాబ్ చంచలం, కుర్మగూడ, సంతోష్‌నగర్, డబీర్‌పురా డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. నాలాలు, డ్రైనేజీల్లో పూడికతీత పనులను పూర్తి చేయాలన్నారు. బక్రీద్ పండుగకు ఏర్పాట్లు చేయాలని, ఖుర్బానీ చేసిన జంతు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, ముహమ్మద్ వసియుద్దీన్, ఆలందార్ వాలా జాహి, ముజఫర్ హుస్సేన్, సయ్యద్ సొహైల్ ఖాద్రి, నస్రీన్ సుల్తానా, సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శివకుమార్, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ఈఈలు హరికిశోర్, ఏకాంబరం, రామారావు, రవాణాశాఖ డీసీటీఓ వినయ్ భూషణ్, ఏసీపీ, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఈఎంఆర్ఐలో డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈఎంఆర్ఐలో డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్‌షాహిద్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు పదో తరగతి పాసై 23 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు వారై ఉండాలని, ఎల్ఎంవీతోపాటు బ్యాడ్జ్ లైసెన్స్‌గల వారు అర్హులన్నారు.

ఆసక్తిగలవారు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూకు డిస్ట్రిక్ ప్రభుత్వ ఆస్పత్రి, కింగ్‌కోఠిలోగల రీజనల్ ఆఫీస్‌కు జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 9000001674 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

'గౌలిగూడలో లో-ప్రెషర్ సమస్యను పరిష్కరించాలి'

అఫ్జల్‌గంజ్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గౌలిగూడలో పలు బస్తీల్లో లో-ప్రెషర్‌తో తాగునీరు సరఫరా కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. సమస్యను పరిష్కరించాలని శుక్రవారం జలమండలి మేనేజర్ మధుసూదనచారికి ఫిర్యాదు చేశారు.

జూలై 4 నుంచి ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలల పరీక్షలు

రవీంద్రభారతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 13 ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల, కళాశాలల్లో వివిధ కోర్సులు చదివిన రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులకు వార్షిక పరీక్షలు జూలై 4 నుంచి 17వరకు నిర్వహిస్తున్నట్లు తెలుగు వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. సర్టిఫికెట్ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు జూలై 4న, డిప్లొమా విద్యార్థులకు 5, 6వ తేదీలలో థియరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని కోర్సుల విద్యార్థులకు ప్రాయోగిక పరీక్షలను జూలై 7 నుంచి ప్రారంభించి 17వ తేదీ వరకు ముగించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ చూడవచ్చన్నారు.

రైళ్లలో చోరీ కేసుల ఛేదన

- లక్షల రూపాయల సొత్తు బాధితులకు అప్పగింత

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రైల్వే పోలీసులు పలు కేసుల్లో నిందితులను అరెస్ట్ చేశారని, లక్షలాది రూపాయల విలువైన సొత్తు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. 'ఆపరేషన్ యాత్రిసురక్ష' ద్వారా 53 కేసులను నమోదు చేసి 37మంది నేరస్థులను అరెస్ట్ చేశామని, వారి నుంచి రూ.29.58 లక్షల విలువైనసొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. 'ఆపరేషన్ అమానత్' కార్యక్రమం ద్వారా 243 మంది ప్రయాణికులు పోగొట్టుకున్న దాదాపు రూ. 57లక్షల విలువైన సామగ్రి స్వాధీనం చేసుకుని యజమానులకు అప్పగించినట్టు తెలిపారు. ఆపరేషన్ నార్కోస్ ద్వారా 8 మందిని అరెస్టు చేసి రూ.38 లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఆపరేషన్ నాన్ హే ఫారిస్తే కింద వివిధ కారణాలతో ఇంటి నుండి తప్పిపోయిన/పారిపోయిన 133మంది (102 బాలురు, 31మంది బాలికలు) పిల్లలను గుర్తించి వారి తల్లి తండ్రులకు అప్పగించినట్టు తెలిపారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా -ఆపరేషన్ ఆహ్ట్ కింద 18 మంది మానవ అక్రమరవాణాదారుల బారి నుంచి 58 మందిని (52 మంది బాలురు, మరో 6 గురు బాలికలు) రక్షించినట్టు తెలిపారు. 'ఆపరేషన్ సటార్క్' కింద 21 కేసులు నమోదు చేసి 11 మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రైళ్లలో అక్రమంగా రవాణా చేస్తున్న రూ.3,94,092 మద్యాన్ని సీజ్ చేసినట్టు తెలిపారు. ఆపరేషన్ ఉపలబ్ద్ కింద రూ.2,30,779 విలువైన 129 లైవ్ రైల్వే టికెట్లను స్వాధీనం చేసుకుని 27 మంది దళారులను అరెస్టు చేసి కేసులు నమోదు చేశామని, సీసీటీవీ సాంకేతికతను ఉపయోగించి నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1.40 లక్షల విలువైన దొంగసొత్తును స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఆపరేషనల్ రైల్ సురక్ష కింద 41 కేసులను నమోదు చేసి రూ.1.62 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.

తెలంగాణ హాజీలపై నిర్లక్ష్యం

- బస్సులు లేక రెండురోజులుగా నిరీక్షణ : ఎంబీటీ

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి హజ్‌యాత్రకు వెళ్లిన హాజీలకు రవాణా సౌకర్యం కల్పించడంలో మైనారిటీ సంక్షేమ మంత్రిత్వ శాఖ, కేంద్ర హజ్ కమిటీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మజ్లిస్ బచావో తహ్రీక్(ఎంబీటీ) అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ పేర్కొన్నారు. సౌదీలో 466 భవనంలో వసతి సౌకర్యం పొందిన రాష్ట్ర హాజీలు మక్కా చేరుకునేందుకు రెండు రోజులుగా బస్ సౌకర్యం కోసం నిరీక్షిస్తున్నారన్నారు.

రవాణా సౌకర్యం కల్పించకపోవడంతో శుక్రవారం ప్రార్థనలకు హాజరు కాలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వైద్య సేవలు అందక ఒక హాజీ తుది శ్వాస విడిచినట్టు సమాచారం అందినట్టు తెలిపారు. తెలంగాణ నుంచి వెళ్లిన హాజీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

'తెలంగాణ అభివృద్ధికి సాయం చేయండి'

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధికి సాయం చేయాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ కోరారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు గణనీయంగా పెంచాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

వ్యవసాయ వర్సిటీ ఉద్యోగులకు వైద్య శిబిరం

- 150 మందికి పరీక్షలు

రాజేంద్రనగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలకు శుక్రవారం వర్సిటీ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఇండో బ్రిటిష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్ డాక్టర్లు 150 మంది ఉద్యోగులకు పరీక్షలు చేశారు. డాక్టర్లు పి. నిఖిత, చైతన్య పాల్గొన్నారు. ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి. పద్మవేణి వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు.

నేటి నుంచి పత్రీజీ ధ్యాన జ్ఞాన మహా యజ్ఞం



గోషామహల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మర్షి పితామహ పత్రీజీ మహారాజ్ స్థాపించిన పీఎస్ఎస్ఎం ధ్యాన్ భాగ్యనగర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో పత్రీజీ ధ్యాన జ్ఞాన మహా యజ్ఞంను నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ సుధీర్‌షా పేర్కొన్నారు. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉదయం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రవేశం ఉచితమని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు విజయభాస్కర్ రెడ్డి,లక్ష్మి, చంద్రశేఖర్, రాకేశ్ పోలా, రాజశేఖర్, ఆర్.వెంకటేశ్ పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న యూనియన్ నాయకులు

ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘంగా
జీహెచ్ఎంసీటీఈయూకు గుర్తింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘంగా జీహెచ్ఎంసీ తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్(జీహెచ్ఎంసీటీఈయూ)కు గుర్తింపు దక్కిందని యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం నూతన కార్యవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గానికి పలు సర్కిళ్లకు చెందిన జవాన్లు మద్దతు తెలిపారు. సమావేశంలో సలహాదారులు నాగన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, ఉపాధ్యక్షులు అమరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురాలో రోడ్లపై మురుగు పరుగు



రోడ్లపై పారుతున్న మురుగునీరు

చాంద్రాయణగుట్ట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. గౌలిపురా, ఉప్పుగూడ, జంగమ్మెట్ డివిజన్లలో ఎక్కడ చూసినా రోడ్లపై మురుగునీరే కనిపిస్తోంది. గౌలిపురా మిత్ర క్లబ్ వెనుక రోజుల తరబడి మురుగునీరు నిలిచి ఉండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

డాక్టర్ కంది శుభాకర్‌కు రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అవార్డు



ఎర్రగడ్డ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శ్వాసకోశ వ్యాధుల నిపుణులు, ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ కంది శుభాకర్‌కు స్కాట్లాండ్ దేశం రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్ అవార్డుకు ఎంపిక చేసింది. త్వరలో స్కాట్లాండ్‌లో జరగనున్న కార్యక్రమంలో డాక్టర్ శుభాకర్ ఈ అవార్డును అందుకోనున్నారు. ప్రస్తుతం కామినేని వైద్య కళాశాలలో శ్వాసకోశ వ్యాధుల విభాగానికి అధిపతిగా వ్యవహరిస్తున్న డాక్టర్ కంది శుభాకర్‌ను 2022లో రాయల్ కాలేజీ ఆఫ్ లండన్ వారు కూడా ఇదే అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శుభాకర్ మాట్లాడుతూ స్కాట్లాండ్ రాయల్ కాలేజీ సంస్థ తనకు ఇంతటి గౌరవ అవార్డును అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. శ్వాసకోశ వ్యాధులపై మరిన్ని పరిశోధనలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేటినుంచి వాటర్‌బోర్డులో 'డయల్ యువర్ ఎండీ'

హైదరాబాద్ సిటీ, జూన్14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ పరిధిలోని వాటర్‌బోర్డు వినియోగదారుల నుంచి నేరుగా సమస్యలు తెలసుకునేందుకు చేపట్టిన 'డయల్ యువర్ ఎండీ' కార్యక్రమం శనివారం పునఃప్రారంభం కానుంది. ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో శనివారం సాయంత్రం 4గంటలకు ఎండీ సుదర్శన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. సుమారు గంటన్నర పాటు జరిగే డయల్ యువర్ ఎండీ కార్యక్రమానికి 040- 23442881 లేదా 23442882 లేదా 23442883 నంబర్లకు ఫోన్ చేసి.. తమ సమస్యల్ని నివేదించవచ్చు. కరోనా తర్వాత కొన్ని కారణాల రీత్యా నిలిచిపోయిన డయల్ యువర్ ఎండీ కార్యక్రమం తాజాగా మళ్లీ పునఃప్రారంభించాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి నిర్ణయించారు. ప్రతి 15 రోజులకోసారి ఈ కార్యక్రమానికి నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే వినియోగదారులు నేరుగా వాటర్‌బోర్డు మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసే 'మీట్ యువర్ ఎండీ' కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. స్థానిక ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ డివిజన్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని సైతం పునఃప్రారంభం చేస్తున్నట్లు ప్రకటించారు.



బస్‌భవన్‌లో ట్రైయినీ ఐఏఎస్‌లతో టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

బస్‌భవన్‌ను సందర్శించిన ట్రైయినీ ఐఏఎస్‌లు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో అమలు చేస్తోన్న పలు కార్యక్రమాల అధ్యయనానికి ట్రైయినీ ఐఏఎస్‌లు ముషీరాబాద్‌లోని బస్ భవన్‌ను శుక్రవారం సందర్శించారు. సంస్థ ఉన్నతాధికారులతో కలిసి టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్టీసీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను వారికి వివరించారు. ఆర్టీసీ పనితీరు, ఉద్యోగుల సంక్షేమం, మహాలక్ష్మి పథకం అమలు, ప్రయాణికులకు కల్పిస్తోన్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. బస్ భవన్‌ను సందర్శించిన వారిలో ఉమా హారతి, గరియా నరులా, మనోజ్, మృణాల్, శంకేత్, అభిజ్ఞాన్, అజయ్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీవోవో డా.రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్‌లతో పాటు ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ సీడీఎస్ సెంటర్ హెడ్ డాక్టర్ కందుకూరి ఉషారాణి, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

నులి పురుగులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నులి పురుగులతో వచ్చే ఆరోగ్య సమస్యలపై పిల్లలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటు కోసం తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఆయన సూచించారు. ఈనెల 20న జరగనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మాత్రలను తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ సూచించారు. 20వ తేదీన వేయని వారికి 27న వేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి వెంకట్, జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ పద్మజ, డాక్టర్ శ్రీకాంత్, డీఈఓ రోహిణి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి అక్కేశ్వర్‌రావు, బీసీ, ఎస్సీ, మైనార్టీ అభివృద్ధిశాఖల అధికారులు ఆశన్న, యాదయ్య, ఇలియాస్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన సత్యగౌడ్‌ను సత్కరిస్తున్న విభాగాధిపతులు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిమ్స్‌లో రక్తదాన శిబిరాన్ని ఆస్పత్రి డైరెక్టర్ బీరప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్స్‌లో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు పదకొండు వేల మంది దాతలు రక్తదానం చేశారని తెలిపారు. రక్తదాతలు వారి సేవలు, రక్త దానం చేయడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, అపోహలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రిలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, వైద్య విద్యార్థులు, బ్లడ్‌బ్యాంక్ వైద్యులు మహేష్, సుధీర్, మురళీ కృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, టెక్నికల్ స్టాఫ్, నర్సింగ్, ఓటీ స్టాఫ్ రక్తదానం చేశారు. బుధవారం ఒక్క రోజే దాదాపు 150 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. దాతలను విభాగాధిపతి శాంతి సత్కరించి అభినందించారు. పీజీ డాక్టర్లు, టెక్నికల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

13 రోజుల్లో గ్రేటర్ ఆర్టీసీ ఆదాయం

రూ. 34.91 కోట్లు

● అత్యధికంగా కంటోన్మెంట్‌లో రూ. 2.41 కోట్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ ఆర్టీసీ 13 రోజుల్లో రూ.34.91 కోట్ల ఆదాయం సాధించింది. గ్రేటర్‌జోన్‌లో 25 బస్‌డిపోల పరిధిలో ఆదాయం పెంచుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. టికెట్ల ఆదాయంతో పాటు బస్‌పాస్‌ల ఆదాయం పెంచుకునేందుకు మొబైల్ వాహనాలతో బస్‌పాస్ జారీ, రద్దీస్టాపుల్లో సూపర్‌వైజర్లను నియమిస్తూ ప్రయాణికుల సంఖ్య పెంచుకునే దిశగా చర్యలు తీసుకుంది. జూన్ 1నుంచి 13వ తేదీ నాటికి పలు డిపోలు వందశాతంకు పైగా ఆక్యుపెన్సీతో పాటు ఆదాయం సాధించాయి. కంటోన్మెంట్ డిపో రూ. 2.41 కోట్లు, మియాపూర్ -2 డిపో రూ.2.23కోట్ల ఆదాయం సాధించాయి. బస్‌పాస్‌ల జారీతో రోజూ గ్రేటర్‌ఆర్టీసీకి రూ.70 లక్షల వరకు ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.

కూకట్‌పల్లిలో మోటోప్లెక్స్ షోరూం ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేసి మోటోప్లెక్స్ షోరూం ప్రారంభిస్తున్న పియాజియో కంపెనీ ప్రతినిధులు

కూకట్‌పల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఇటాలియన్ పియాజియో గ్రూపునకు చెందిన పియాజియో వెహికల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి వైజంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మోటోప్లెక్స్ షోరూంను శుక్రవారం సంస్థ ప్రతినిధులు అజయ్ రఘువంశీ, అపూర్వ సైగల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూంలో ఆప్రిలియా, వెస్పా, మెటోగుజ్జీ వంటి ఉత్పత్తులను ప్రదర్శించారు.

బల్క్ గార్బేజ్‌తో రూ.100కోట్ల భారం

● వ్యాపార, వాణిజ్య సంస్థల నుంచి అంతంత మాత్రం వసూలు చేస్తున్న బల్దియా
● నెలకు రూ. కోటి కూడా దాటని వసూలు
● చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
● కర్నాటకలో విధివిధానాలు ఖరారు
● కేటగిరీ, నిర్మాణ విస్తీర్ణాన్ని బట్టి రుసుము

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బల్క్‌గార్బేజ్ నిర్వహణ జీహెచ్ఎంసీకి ఆర్థికభారంగా మారుతున్నది. గ్రేటర్‌లో వెలువడుతున్న చెత్తలో దాదాపు 20- 25 శాతం బల్క్‌గార్బేజ్ ఉంటోంది. వాస్తవంగా బల్క్‌గార్బేజ్‌కు సంబంధించి రవాణా, నిర్వహణ వ్యయాన్ని ఆయా సంస్థల నుంచే వసూలు చేయాలి కానీ, నగరంలో ఆ పరిస్థితి లేదు. ఆశించిన స్థాయిలో బల్క్ గార్బేజ్ రుసుము వసూలు కాకపోవడంతో ఆ భారం బల్దియా భరించాల్సి వస్తోంది. కేవలం బల్క్ గార్బేజ్ సేకరణ, రవాణా, శాస్త్రీయ నిల్వ, నిర్వహణకు నెలకు రూ.9 కోట్ల చొప్పున యేటా రూ.100 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నారు.

దేశంలోని పలు రాష్ట్రాలు, నగరాల్లో సమగ్ర వ్యర్థాల నిబంధనల అమలుతో అక్కడి కార్పొరేషన్లపై చెత్తనిర్వహణ భారం తగ్గింది. రాష్ట్రంలో విధివిధానాలు ఖరారు కాకపోవడంతో బల్క్‌గార్బేజ్ రుసుము వసూలు పూర్తిస్థాయిలో జరగడం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సమగ్ర వ్యర్థాల నిబంధనల ప్రకారం తమ పరిధిలో విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వాలు ఖరారు చేసుకోవాలి. కేటగిరీలు.. నగరాల్లోని జనాభా ఆధారంగా సమగ్ర వ్యర్థాల వినియోగ రుసుము ఎంతన్నది నిర్ధారిస్తారు. దాని ఆధారంగా గార్బేజ్ రుసుము వసూలు చేస్తారు.



గార్బేజ్ రుసుము అంతంతే...

గ్రేటర్‌లో నిత్యం సగటున 7,500 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. వాస్తవంగా హోటళ్లు, మాల్స్, రెస్టారెంట్లు, ఫంక్షన్‌హాళ్లు, వ్యాపార, వాణిజ్య సంస్థల నుంచి నిబంధనల ప్రకారం గార్బేజ్ రుసుము వసూలు చేయాలి. నగరంలో ఆ పరిస్థితి లేదు. హోటళ్ల యజమానుల వైఖరిని బట్టి కొందరు అధికారులు గార్బేజ్ రుసుము నిర్ణయిస్తున్నారు. నివాసేతర సముదాయాల నుంచి స్వచ్ఛ ట్రాలీల కార్మికులు లేదా జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థకు చెందిన వాహనాలు చెత్త సేకరిస్తున్నాయి. బల్దియాలేదా ప్రైవేట్ ఏజెన్సీ వాహనాలు సేకరించే చోట కిలోకు రూ.1.85 చొప్పున వినియోగ రుసుము ప్రస్తుతం వసూలు చేస్తున్నారు. నగరంలో వేల సంఖ్యలో వ్యాపార, వాణిజ్య సంస్థలున్నా.. జీహెచ్ఎంసీకి వస్తోన్న గార్బేజ్ రుసుము నెలకు రూ.కోటి దాటడం లేదు. హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లు, మాల్స్, మల్టీప్లెక్స్‌లు, ఆస్పత్రుల నిర్వాహకులతో కుమ్మక్కవుతోన్న అధికారులు వాస్తవంగా రావాల్సిన రుసుములో 30 శాతం కూడా వసూలు చేయడం లేదు. ఇక స్వచ్ఛ ట్రాలీ కార్మికులు హోటళ్లు, ఇతర దుకాణదారుల నుంచి నెలకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. దీంతో బల్దియా ఖాతాలో పైసా గార్బేజ్ రుసుము జమ కావడం లేదు.

కర్నాటకలో ఇలా..

పొరుగున ఉన్న కర్నాటక రాష్ట్రంలో సమగ్ర వ్యర్థాల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక విధివిధానాలు అమలు చేస్తున్నారు. లక్షలోపు, 10 లక్షల లోపు, 10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాలను మూడు కేటగిరీలుగా విభజించారు. నిర్మాణ విస్తీర్ణం, వినియోగం ఆధారంగా రుసుము నిర్ధారించారు. 10 లక్షలకుపైగా జనాభా ఉన్న నగరాల్లో కేటగిరీని బట్టి రూ.500 నుంచి రూ.7వేల వరకు వినియోగ రుసుము వసూలు చేస్తున్నారు. 10 లక్షల్లోపు జనాభా ఉన్న చోట రూ.400 నుంచి రూ.5 వేలు, లక్షలోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.300 నుంచి రూ.4 వేలు రుసుముగా నిర్ణయించారు.

నెలకు రూ.38కోట్ల చెల్లింపులు..

గ్రేటర్‌లో వెలువడుతోన్న చెత్త రవాణా, శాస్త్రీయ నిల్వ, నిర్వహణ బాధ్యతలను ఉమ్మడి రాష్ట్రంలో ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. మెట్రిక్ టన్నుకు రూ.2 వేలకుపైగా.. నెలకు ఆ సంస్థకు రూ.38 కోట్లు చెల్లిస్తున్నారు. యేటా ఈ మొత్తం రూ.460 కోట్లకు చేరింది. అంటే కిలోకు రూ.2.10 చొప్పున రవాణా, నిర్వహణకు వెచ్చించాల్సి వస్తోంది. అధికారులు, ఉద్యోగుల వేతనాలతో కలిపి రూ.2.50 నుంచి రూ.2.90 వరకు వినియోగ రుసుము తీసుకోవాలి. కానీ, జీహెచ్ఎంసీ కిలోకు రూ1.85, అది కూడా పూర్తిస్థాయి వ్యర్థాలకు వసూలు చేయడం లేదు. నిర్మాణ విస్తీర్ణంతో కాకుండా అధికారులు విచక్షణతో సగటు వ్యర్థాల తూకాన్ని నిర్ధారిస్తున్నారు. గార్బేజ్ రుసుము కూడా మూడు, ఆరు నెలలకోమారు సంస్థలు చెల్లిస్తున్నాయి. దీంతో వాణిజ్య, వ్యాపార సంస్థల నుంచి వెలువడుతోన్న వ్యర్థాల నిర్వహణకూ బల్దియా ఖజానా నుంచి చెల్లింపులు చేయాల్సి వస్తోంది. ఎక్కువ వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థలు తప్పనిసరిగా నిర్వహణ చేపట్టాలి. లేని పక్షంలో కిలోకు రూ.20 చొప్పున రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

సూడో పోలీస్ అరెస్ట్

● కాల్‌గర్ల్స్‌ను బుక్‌చేసుకునే వారే లక్ష్యంగా..
● బెదిరించి దోచుకుంటున్న ప్రబుద్ధుడు
● జూదం, గుర్రపు పందాలకు బానిసై దోపిడీలకు శ్రీకారం



పోలీసులు అరెస్టు చేసిన సూడో పోలీస్ సన్నీజాదవ్

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జూదానికి, గుర్రపు పందేలకు బానిసగా మారిన ఓ వ్యక్తి సూడో పోలీస్ అవతారం ఎత్తాడు. హోటల్స్‌లో కాల్‌గర్ల్స్‌ను బుక్‌చేసుకునేవారిని లక్ష్యంగా చేసుకొని, బెదిరించి, భయపెట్టి వారినుంచి రూ.లక్షల్లో లాక్కుంటూ దోపిడీలకు పాల్పడుతున్నాడు. నిఘాపెట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి అతని నుంచి రూ. 3లక్షలు, 3 సెల్‌ఫోన్‌లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ రష్మి పేరుమాళ్ తెలిపిన వివరాల ప్రకారం..

సికింద్రాబాద్ పార్సీగుట్టకు చెందిన సన్నీ జాదవ్ ఓ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తూ జూదం, గుర్రపు పందాలకు బానిసగా మారాడు. ఆదాయం సరిపోక సూడో పోలీస్ అవతారం ఎత్తాడు. స్టార్ హోటల్స్‌లో కాల్‌గర్ల్స్‌ను బుక్‌చేసుకునే సంపన్నులనే లక్ష్యంగా చేసుకుని పోలీస్ అధికారిగా నటిస్తూ వారిని బ్లాక్ మెయిల్ చేసేవాడు. తన మొబైల్ ఫోన్‌లో ఉన్న పోలీస్ ఐడీ, పోలీస్ యూనిఫాం ఫొటోలు చూపించి భయపెట్టేవాడు. హోటల్‌లో ఎంజాయ్ చేసిన న్యూడ్ ఫొటోలు, వీడియోలు ఉన్నాయంటూ బెదిరించి వారి నుంచి అందినంతా దండుకునేవాడు. ఈ క్రమంలో 2017లో మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సన్నీ జాదవ్‌పై కేసు నమోదైంది.

2023 ఫిబ్రవరిలో సికింద్రాబాద్‌లోని మారియట్ హోటల్‌లో ఇదే తరహా ప్లాన్‌తో వెళ్లిన సన్నీ జాదవ్ ఓ సంపన్నుడిని లక్ష్యంగా చేసుకొని హోటల్ బిల్డింగ్‌పైకి తీసుకెళ్లి బెదిరించాడు. రూ. 5లక్షలు ఇవ్వకుంటే కాల్‌గర్ల్స్‌తో ఎంజాయ్ చేసిన ఫొటోలు, వీడియోలు మీ కుటుంబసభ్యులకు పంపి పరువు తీస్తానని బ్లాక్‌మెయిల్ చేశాడు. దాంతో బాధితుడు అతనికి రూ. 5లక్షలు ఇచ్చాడు. డబ్బు తీసుకోవడంతో పాటు మెడలోని రెండు తులాల బంగారు చైన్‌ను తీసుకున్నాడు. అంతటితో ఆగకుండా బాధితుని బలహీనతను ఆసరాగా చేసుకున్న అతను మళ్లీమళ్లీ బ్లాక్‌మెయిల్ చేసి మరో రూ.5లక్షలు వసూలు చేశాడు. అతని వేధింపులు భరించలేని బాధితుడు ఇటీవల గాంధీనగర్ పోలీసులను ఆశ్రయించి తన గోడు వెల్లబోసుకున్నాడు. నిందితునిపై నిఘాపెట్టి అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. నిందితుని ఆటకట్టించిన టాస్క్‌ఫోర్స్ ఎస్సైదాసు శ్రీనివాసులు, జ్ఞానదీప్, అశోక్‌రెడ్డి బృందాన్ని డీసీపీ అభినందించారు.

ఢిల్లీ అల్లర్లపై ఘంటా రాహూల్ డాక్యుమెంటరీ



రాహుల్ మిలింద్

న్యూఢిల్లీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన ఢిల్లీ అల్లర్లపై తెలంగాణ విద్యార్థి రూపొందించిన డాక్యుమెంటరీ 'ఏ వింటర్ దట్ బర్నర్ ఢిల్లీ' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. శుక్రవారం ఇక్కడ ఫారిన్ కరెస్పాండెంట్స్ క్లబ్ ఆఫ్ సౌత్ ఏషియా(ఎఫ్‌సీసీఎస్ఏ) ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనకు వేదికగా నిలిచింది. టీఎస్‌పీఎస్సీ మాజీ ఛైర్మన్ ప్రొ.ఘంటా చక్రపాణి కుమారుడు రాహుల్ మిలింద్ ఈ డాక్యుమెంటరీని రూపొందించడం గమనార్హం. గ్రాడ్యుయేషన్ థీసిస్ సమర్పణలో భాగంగా రాహుల్ ఈ డాక్యుమెంటరీని రూపొందించి, డాక్యుమెంటరీ స్క్రిప్టు రూపకల్పన, కెమెరా, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. విజువల్ హిస్టరీపై ఆసక్తి ఉండడంతో రాహుల్ సిక్కు కమ్యూనిటీకి వ్యతిరేకంగా జరిగిన అల్లర్లలో ప్రాణాలతో బయటపడిన వారి మానసిక క్షోభపై ఒక డాక్యుమెంటరీని తాను చదువుతున్న విశ్వవిద్యాలయ అనుమతితో రూపొందించారు. రాహుల్‌కు గైడ్‌గా ప్రొఫెసర్ రామచంద్రగుహ, ప్రొఫెసర్ పృథ్వీ దత్తా శోభి సహకారం అందించారు. కాగా, ఇటీవల జైపూర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఈ చిత్రాన్ని పంపగా స్పెషల్ జ్యూరీ అవార్డుకు ఎంపికైంది.



ఈఎంఈ సెయిలింగ్ కార్ప్స్ రెగట్టా విజేతగా జట్టుతో అధికారులు

ముగిసిన ఈఎంఈ సెయిలింగ్ కార్ప్స్ రెగట్టా

అల్వాల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌సాగర్‌లో నిర్వహిస్తున్న కార్ప్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీర్స్(ఈఎంఈ) వార్షిక సెయిలింగ్ రెగట్టా శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు వేడుకల్లో ఎంసీఈఎంఈ డిప్యూటీ కమాండెంట్, మేజర్ జనరల్ అజయ్‌శర్మ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్, లేజర్‌క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, హుస్సేన్‌సాగర్ సెయిలింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ జనరల్ అజయ్‌శర్మ మాట్లాడుతూ సెయిలర్స్ అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో పాటు క్రీడాస్ఫూర్తిని చాటారన్నారు. భారత సైన్యంలోని వివిధ విభాగాలకు చెందిన సెయిలర్స్ ఈ రెగట్టాల్లో పాల్గొన్నారు. విజేతగా నార్తరన్ కమాండ్ నిలిచింది. ఈ సెయిలింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన ఎం.ధర్మేందర్‌కు 'మోస్ట్ ప్రామిసింగ్ సెయిలర్ ట్రోఫీని' అందించారు.

డిజిటల్ సమాజంలో

ప్రైవసీ ఇంజనీరింగ్ కీలకం

● ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్

హైదరాబాద్ సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): డిజిటల్ సమాజంలో ప్రైవసీ ఇంజనీరింగ్ అత్యంత కీలకమని తెలంగాణా ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సైబర్ సెక్యూరిటీ అండ్ డాటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (సీసీఓఈ-డీఎస్‌సీఐ), గచ్చిబౌలిలోని ఐడీబీఐ క్యాంపస్‌లో నిర్వహించిన చాప్టర్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. సైబర్ సెక్యూరిటీ, గోప్యత పరంగా తాజా ఆవిష్కరణలు, ధోరణులను చర్చించడం కోసం పరిశ్రమ నిపుణులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీలో ఆవిష్కరణ, భాగస్వామ్యంలో సీసీఓఈ అత్యంత కీలకపాత్ర పోషిస్తుందన్నారు. సీసీఓఈ సీఈఓ డాక్టర్ శ్రీరామ్ మాట్లాడుతూ సంస్థలో గోప్యతను అమలు చేయడం కోసం ప్రైవసీ ఇంజనీరింగ్ కీలకమని అన్నారు. దీని గురించి మరింతగా తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 'ప్రైవసీ ఇంజనీరింగ్ : వే ఎ హెడ్ నివేదిక' ను సీసీఓఈ టెక్నికల్ కన్సల్టెంట్ సాయికృష్ణ విడుదల చేయగా, సైబర్ సెక్యూరిటీలో అప్రెంటిస్‌షిప్ అవకాశాలను గురించి నాస్కామ్ ప్రతినిధులు వివరించారు. సీసీఓఈ త్వరలో నిర్వహించబోయే కార్యక్రమాలను గురించి సీసీఓఈ బిజినెస్ డెవలప్‌మెంట్ లీడ్ మిథాలీ అగర్వాల్ వెల్లడించారు.

24/7 సిద్ధం

(5వ పేజీ తరువాయి)

మ్యాన్‌హోళ్లకు ఇప్పటికే ఎరుపు రంగు వేసే ప్రక్రియ పూర్తయిందన్నారు. మ్యాన్‌హోళ్ల మూతలు ఎవ్వరూ తీయొద్దని, ఎక్కడైనా తీసినా వెంటనే 155313కి కాల్ చేయాలని సూచించారు. ఫిర్యాదులు కూడా తీసుకుంటామని తెలిపారు. సాధారణంగా వచ్చే మ్యాన్‌హోల్ ఇబ్బందుల కంటే వర్షాల నేపథ్యంలో చాలా సమస్యలు తలెత్తుతాయని, మ్యాన్‌హోళ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసే విధంగా డివిజన్ల వారీగా 225 ఎయిర్‌టెక్ మిషన్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. రోడ్లపై నిలిచే నీటిని తొలగించేందుకు అత్యవసర బృందాలను ఏర్పాటు చేశామని, అవి జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తాయని తెలిపారు. వాటర్‌బోర్డులో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతో పాటు వివిధ పోస్టుల్లో ఐదేళ్లకు మించి పని చేసేవారిని బదిలీ చేసేవిధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఐసెట్ టాపర్లు మనోళ్లే..

(5వ పేజీ తరువాయి)

సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడతా



ఇంటర్ తర్వాత బీటెక్ చేద్దామనుకున్నా కుదరలేదు. సికింద్రాబాద్‌లోని కీస్ కాలేజీలో బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తిచేశా. జేఎన్‌టీయూ లేదా ఓయూలో ఎంసీఏ చదివి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడాలనుకుంటున్నా.

- కందాల లాస్య, 3వ ర్యాంకు

స్టార్టప్‌పై ఫోకస్ పెడతా



గీతం వర్సిటీలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తిచేశా. స్టార్టప్ ఒకటి మొదలు పెట్టా. ఓయూ లేదా జేఎన్‌టీయూలో ఎంబీఏ చదివి ఆపై కొన్నాళ్లు జాబ్ చేశాక స్టార్టప్‌పై ఫోకస్ పెడతా.


- అక్షిత్, 6వ ర్యాంకు

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా

బేగంపేట్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్) పూర్తిచేశా. జేఎన్‌టీయూ లేదా సీబీఐటీలో ఎంసీఏ చదువుతా. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడమే లక్ష్యం. ఐసెట్ 8వ ర్యాంక్ సాధించడంలో మీరా సింగ్, రవీందర్ సింగ్‌ల కృషి ఎంతో ఉంది.

- గంగా షిండే, 8వ ర్యాంకు

సరదాగా రాశా..



జేబీఐటీ కాలేజీలో బీటెక్(సీఎస్ఈ) 2015లో పూర్తిచేశా. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నా. ఎంబీఏ చేస్తే మంచి కెరీర్ ఉంటుందని సరదాగా ఐసెట్ రాశా. 9వ ర్యాంకు సాధిస్తానని అనుకోలేదు.

- అరుణ్‌సింగ్, 9వ ర్యాంకు

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు చెల్లు!!

(5వ పేజీ తరువాయి)

ఆధారపడిన మన కంపెనీలకు ప్రాజెక్ట్‌లు తగ్గాయి. లాభాలపై ప్రభావం పడకుండా, నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడానికి కంపెనీలు ఈ రిక్రూట్‌మెంట్‌లపై పరిమితి విధించాయి.' అని ఆయన వెల్లడించారు. ఓ అంచనా ప్రకారం ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ 50 శాతానికి పైగానే తగ్గింది. అదే సమయంలో ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ 20 నుంచి 30 శాతం పెరిగిందని టీమ్ లీజ్ లాంటి సంస్థలు వెల్లడిస్తుండటం గమనార్హం.

సర్టిఫికెట్ ఉన్నా.. కొలువు అనుమానమే

ఆన్ క్యాంపస్‌లో సర్టిఫికెట్ ఉండి కాస్త సత్తా చాటితే కొలువు గ్యారెంటీ అన్నట్లుగా పరిస్థితులు ఉండేవి. కానీ, ఇప్పుడు ఎంత మంది ఉన్నారన్నది కాదు, ఎంత గొప్ప మేధావులన్నదే చూస్తున్నాయి కంపెనీలు. 'ఆన్ క్యాంపస్ ఇంటర్వ్యూలకు కొన్ని పరిమితులు ఉంటాయి. కాస్త శిక్షణ ఇస్తే ఉపయోగపడతారనుకునే వారిని కూడా తీసుకునే వారం. దీని వల్ల కాస్త ఖర్చు పెరిగినా అనుభవజ్ఞులైన ఉద్యోగుల జీతాలతో పోలిస్తే చాలా తక్కువ కావడంతో నియామకాలు జరిగేవి. ఇప్పుడా పరిస్థితి లేదు' అని అంటున్నారు ఓ ప్లేస్‌మెంట్ సంస్థ ప్రతినిధి రవికుమార్. ఓ ఐటీ సంస్థ ప్రతినిధి అనురాగ్ చెబుతూ శిక్షణ ఇచ్చి తయారుచేసుకునే కంటే, ప్రతిభావంతులైతే చాలు, నేరుగా ప్రాజెక్ట్‌పైకి ఎక్కిస్తున్నామని తెలిపారు. వాస్తవం కూడా ఇలాగే ఉందిప్పుడు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ లేని వారు అమీర్‌పేటలోని పలు కోచింగ్ సెంటర్లలో చేరి డిమాండ్ ఉన్న కోర్సులు చేస్తున్నారు. మచిలీపట్నంలోని ఓ కళాశాలలో ఇటీవలనే ఇంజినీరింగ్ పూర్తి చేసి వచ్చిన విద్యార్థులు మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, ఏఐ లాంటి అంశాలలో శిక్షణ పొందుతున్నామని, దానితో పాటుగా ఇంటర్వ్యూలకు కూడా హాజరవుతున్నామన్నారు.

నగర శివార్లలో దొంగల హల్‌చల్

● థార్ గ్యాంగ్‌గా అనుమానిస్తున్న పోలీసులు ● రాచకొండలో వరుస చోరీలకు యత్నం

హైదరాబాద్‌సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నగరంలోకి అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల చుడీదార్ దొంగలు ఎస్ఆర్‌నగర్‌లో చోరీలకు పాల్పడగా.. హబీబ్‌నగర్‌లో వరుస చోరీలకు పాల్పడిన దొంగల ఆచూకీ తెలియలేదు. ఇదిలా ఉండగానే నగర శివారు ప్రాంతాల్లో మరో దొంగల ముఠా హల్‌చల్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. హయత్‌నగర్, వనస్థలిపురం, ఆర్‌సీపురం, అమీన్‌పూర్ తదిర ప్రాంతాల్లో వరుస చోరీలకు ఈ ముఠా యత్నించింది. హయత్‌నగర్‌లో ఒకేరోజు వరుసగా ఐదు ఇళ్లలో చోరీలకు ప్రయత్నించారు.


కంజర్ ఖేర్వా గ్యాంగ్..

దొంగలు చోరీలు చేసిన ప్రాంతాల్లో పోలీసులు సేకరించిన ఆధారాలను బట్టి.. ఈ దొంగల ముఠా మధ్యప్రదేశ్ రాష్ట్రం థార్ జిల్లాకు చెందిన థార్ దొంగలుగా అనుమానిస్తున్నారు. వారినే కంజర్ ఖేర్వా గ్యాంగ్ అని కూడా పిలుస్తారు. వీరి చోరీల స్టైల్ కొత్తతరహాలో ఉంటుంది. గతంలో 2018లో సైబరాబాద్ పోలీసులు ఒక ముఠాను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. ఆ తర్వాత వారి ప్రభావం నగరంలో కనిపించలేదు. మళ్లీ ఇన్నాళ్లకు థార్ అలియాస్ కంజర్ ఖేర్వా గ్యాంగ్ నగరంలో తిరుగుతున్నట్లు పోలీసులు అనుమానించడం ఆందోళన కలిగిస్తోంది. రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్‌లకు చెందిన ప్రత్యేక పోలీస్ బృందాలు థార్ గ్యాంగ్‌ను పట్టుకోవడానికి రంగంలోకి దిగారు.

ఇదీ వారి చోరీల స్టైల్..

థార్‌గ్యాంగ్ సభ్యులు పెద్దపెద్ద కార్లలో వస్తారు. నగర శివారు ప్రాంతాల్లోని దాబాలు, హోటళ్ల వద్ద దూరంగా కారును పార్కు చేస్తారు. హోటల్స్ వద్ద భోజనం కోసం ఆగే బస్సులను టార్గెట్ చేస్తారు. అందులో ఉన్న ప్రయాణికులు దిగగానే దర్జాగా ప్రయాణికుల మాదిరిగానే ఒక్కొక్కరు ఒక్కో బస్సులోకి ఎక్కుతారు. ప్రయాణికుల బ్యాగుల్లోని ఖరీదైన వస్తువులను దోచేసి తమ బ్యాగుల్లో వేసుకుని బయటపడతారు. అక్కడ నుంచి మరో ప్రాంతానికి చేరుకుంటారు. ఇలా రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు పదుల సంఖ్యలో దోచేస్తారు. బస్సుల్లో చోరీలు చేయడం కుదరకపోతే రాత్రి పది తర్వాత శివారు ప్రాంతాల్లోని తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దోచుకొని వెళ్లిపోతారు.

5006 కిలోల గంజాయి, డ్రగ్స్ ధ్వంసం



డ్రగ్స్‌తో డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ అధికారులు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు డ్రగ్స్‌ను శుక్రవారం డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ అధికారులు బయో మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ధ్వంసం చేశారు. డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ ఛైర్మన్ డీసీపీ కె.నరసింహ ఆధ్వర్యంలో సైబర్ క్రైం ఏసీపీ రవీందర్ రెడ్డి, సీసీఆర్ ఏసీపీ కళింగరావు, నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌తోపాటు సిబ్బంది వీడియో చిత్రీకరిస్తూ డ్రగ్స్‌ను ధ్వంసం చేశారు. కమిషనరేట్ పరిధిలోని 30 పోలీస్‌స్టేషన్‌లలో గడిచిన మూడేళ్లలో 122 కేసుల్లో 5006 కిలోల గంజాయితోపాటు హాష్ ఆయిల్, కొకైన్, చరస్, ఎక్స్‌టసీ, ఎల్‌ఎస్‌డీ, హెరాయిన్, ఓపీయం తదితర డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు ఇతర డ్రగ్స్‌ను శుక్రవారం ధ్వంసం చేశారు.

చింతపండు పానకం

అమ్లికాయాః ఫలం పక్వే మర్దితం వారిణా హృద్యమ్!
శర్కరామరీచేన్మిశ్రం లవంగె నాధివాసితమ్!

చింతపండు అంటే సాంబారుల్లోనూ, పులుసు కూరల్లోనూ వేసేదనే అభిప్రాయం మనలో ఎక్కువ. అది గుండెని బల సంపన్నం చేస్తుందనీ, ఎంతకీ మాడని పుండ్లను తగ్గిస్తుందనీ, ఆకలి పుట్టిస్తుందనీ చాలామందికి తెలియదు. ఔషధాన్ని ఔషధంగా తీసుకోవాలి. ప్రతి ఔషధానికీ ఒక మోతాదు ఉంటుంది. మోతాదు మించితే ఔషధం వికటిస్తుంది. చింతపండూ అంతే. బాగా వేడి శరీర తత్త్వం ఉన్నవారికి, ఎసిడిటీ సమస్యలున్నవారికి, పైత్య వ్యాధులున్నవారికి తప్ప మిగిలిన వారందరికీ చింతపండు మంచిదే.



చింతపండు రసానికి విషదోషాలను హరించే గుణం ఉంది. ఆహారంలో చింతపండు మనకు కలిగించే ప్రయోజనం ఇదే. పురుగు మందులు, ఎరువులతో కలుషితమైన కూరగాయల్ని శుభ్రం చేసుకోవటానికి చింతపండు రసం ఎంతగానో ఉపయోగపడుతుంది. చింతపండుని నీటిలో నానబెట్టి, రసం పిండి, వడగట్టి బాగా పలుచన చేయాలి. ఆ ద్రవంలో కూరగాయ ముక్కలు తరిగితే... కాయలపైన ఉండే విష రసాయనాలు పోతాయి. పండ్లను కూడా ఈ నీళ్లతో కడిగితే పండ్లపైన ఉండే విష దోషాలు పోయి, పండు శుభ్రపడుతుంది.



చింపండు తియ్యతియ్యగా, పుల్లపుల్లగా ఉండి, నాలుక మీద జిగురుని పోగొట్టి, అన్న హితవు కలిగిస్తుంది. ఆహారాన్ని తేలికగా అరిగిస్తుంది. ఒంట్లో నీరు లాగేస్తుంది. 'భోజన కుతూహలం' అనే గ్రంథం చింతపండు రసాన్ని, పంచదారనీ కలిపి తాగితే వాత దోషం తగ్గుతుందని పేర్కొంది. జఠరాగ్నిని పెంపు చేసే ఉపాయాల్లో చింతపండు కూడా ఉపయోగపడుతుంది.

'అమ్లికాఫల పానకం' ఇలా...

క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో 'అమ్లికాఫల (చింతపండు) పానకం' తయారు చేసే విధానం ఇలా వివరించాడు:

- చింతపండుని గింజలు, పుల్లలు లేకుండా శుభ్రపరచుకోండి.
- ఒక పాత్రలో తగినన్ని వేడి నీళ్లు తీసుకొని, అందులో చింతపండు వేసి, కొద్దిసేపు నాననివ్వండి.
- నానిన చింతపండును చేత్తో పిసికి, రసం పిండి, జాలీలో వడగట్టండి.
- ఈ రసంలో పంచదార తగినంత కలపండి. మిరియాలు, లవంగాలు, ఏలకుల పొడి తగినంత చేర్చండి. ఇదే 'అమ్లికాఫల పానకం'.

'క్షేమ కుతూహలం'లోనూ, 'భోజన కుతూహలం'లోనూ ఈ చింతపండు పానకం తయారీ ఒకేలా పేర్కొన్నారు. ఇద్దరూ ఈ పానకాన్ని మరిగించటం గానీ, ఉడకబెట్టటం గానీ చెప్పలేదు.

తీపి పులుపు అనే రెండు విరుద్ధ రుచుల కలబోతగా తయారైన ఈ చింతపండు పానకం ఆలస్యంగా అరుగుతుంది. ఉత్తేజాన్ని కలిగిస్తుంది. చలి కాలంలో అనువుగా ఉంటుంది. వాత వ్యాధులతో బాధపడేవారు భయం లేకుండా తాగవచ్చు. ఎసిడిటీ లేకుండా ఉంటే మేలు చేస్తుంది. కొద్దిగా పైత్యాన్ని, కొద్దిగా కఫాన్ని పెంచుతుంది.

> అల్సర్లు, విరేచనాల్లాంటి జీర్ణకోశ వ్యాధుల్లో చింతపండు హాని చేస్తుంది. ఏ వ్యాధికైనా చికిత్స తీసుకుంటూ బాగా ఎక్కువగా మందులు వాడేవారు చింతపండుకి దూరంగా ఉండాలి. యాస్పిరిన్ లాంటి కొన్ని మందులు వాడేప్పుడు అధికంగా చింతపండు వాడితే... యాస్పిరిన్ రక్తంలో అవసరమైన దానికన్నా ఎక్కువ అందుబాటులోకి వస్తుంది. నొప్పి, వాపు తగ్గించే మందుల్ని వాడేప్పుడు చింతపండు వాడకాన్ని తప్పనిసరిగా తగ్గించాలి. ఇలాంటివేవీ లేని వ్యక్తులకు చింతపండు అన్ని విధాలా మంచిదే.

'చాంచేయం శర్కరాయుక్తం కర్పూరోదక మర్దనం!
ఫలమార్ధక సంయుక్తం ప్రాహసత్వాన కాంతరమ్!'

అంటే... ఈ చింతపండు పానకంలో తగినంత అల్లం, కొద్దిగా పచ్చకర్పూరం కూడా కలిపితే కఫాన్ని, పైత్యాన్ని కూడా తగ్గిస్తుందన్నాడు క్షేమశర్మ. చింతపండు మనకు ఔషధమే. ఇప్పటిలాగా ప్రతి కూరలోనూ, పప్పులోనూ, పచ్చడిలోనూ కలిపి వండే అలవాటు మనకు మొదటి నుంచీ లేదు. మిరప కారం పరిచయం అయ్యాక, ఆ కారానికి తగినంత పులుపు వేసి వండటానికి అలవాటు పడ్డాం. పూర్వపు రోజుల్లో భోజనం పులుసు కూరల్లోనూ, పులుసు లేదా చారులో మాత్రమే కొద్దిగా శాస్త్రార్థం ఒక రెబ్బ మాత్రమే చింతపండు వేసి వండేవారు. ఇప్పుడు కూడా ఇళ్లలో చింతపండుని పరిమితంగా వాడే అలవాటున్నవారికి చింతపండు పానకం మంచి ఔషధమే.

గంగరాజు అరుణాదేవి

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/qs2RF40 లో చదవండి.

రుచిలో.. ఫిష్‌మర్రైజ్!

ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి గానీ.. మాంసాహారంలో చేపల కథే వేరు. ప్రొటీన్లు, విటమిన్లు పుష్కలం. తిన్నా కడుపులో ఎలాంటి ఇబ్బందీ ఉండదు. అందుకే చేపలంటే ప్రత్యేకమే. చేపల వేపుడు, ఫిష్ నగ్గెట్స్, మసాలా చేపల కూరను సులువుగా చేసుకోండిలా...



ఫిష్ నగ్గెట్స్

కావాల్సిన పదార్థాలు

చేప ముక్కలు- పావు కిలో, మైదా- పావు కప్పు, ఉప్పు- రుచికి సరిపడ, బ్రెడ్ పొడి- నాలుగు టేబుల్ స్పూన్లు, కోడిగుడ్డు- 1, నిమ్మరసం- టీస్పూన్, మిరియాల పొడి- టీస్పూన్, నూనె- డీప్ ఫ్రైకి సరిపడ

తయారీ విధానం

ముల్లులు లేని లేత ఫిష్ ముక్కలనే తీసుకోవాలి. వీటిని చిన్నగా కట్ చేసి నిమ్మరసం వేశాక తగినంత ఉప్పు, మిరియాల పొడి వేశాక కోడిగుడ్డు సొన వేసి కలపాలి. ఒక ప్లేట్‌లో మైదా వేసి ఇందులోకి కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. మరో ప్లేట్‌లో బ్రెడ్ ముక్కలు ఉంచుకోవాలి.

బౌల్‌లోని చేప ముక్కను తీసుకుని మైదాలో ముంచి మళ్లీ బౌల్‌లో ముక్కను ఉంచి కోడిగుడ్డు సొనమీద ఉంచి.. చివరగా బ్రెడ్ ముక్కల్లో వేసి అన్ని వైపులా బ్రెడ్ ముక్కలు పట్టేట్లు చేయాలి. ఇలా అన్నింటికి రెండు కోటింగ్‌లు వేసి ప్లేట్‌లో ఉంచుకోవాలి. నూనె మరిగిన తర్వాత డీప్ ఫ్రై చేసుకోవాలి. ఈ ఫిష్ నగ్గెట్స్‌ను కెచప్‌తో తింటే రుచికరంగా ఉంటాయి. సాయంత్రం పూట పిల్లలకోసం వేగంగా చేసుకునే స్నాక్స్ ఇవి.



చేపల వేపుడు

కావాల్సిన పదార్థాలు

చేప ముక్కలు- అర కేజీ, ఉప్పు- రుచికి తగినంత, కారం- రెండున్నర టీస్పూన్, పసుపు- చిటికెడు, ధనియాల పొడి- ఒకటి పావు టీస్పూన్, జీలకర్ర పొడి- అర టీస్పూన్, గరం మసాలా- అరటీస్పూన్, మిరియాల పొడి- అర టీస్పూన్, జింజర్ గార్లిక్ పేస్ట్- 1 టీస్పూన్, నిమ్మరసం- టీస్పూన్, కార్న్‌ఫ్లోర్- టీస్పూన్, నూనె- మూడు టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

చేపముక్కలను మరీ మందంగా కాకుండా మీడియమ్ సైజ్‌లో కట్ చేయించుకోవాలి.

చేపముక్కలను శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత కొద్దిగా ఉప్పు, నిమ్మరసం పట్టించి పది నిముషాల పాటు అలానే ఉంచాలి. ఆ వెంటనే చేప ముక్కలను శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత బౌల్‌లో ఉప్పు, కారం, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి, మిరియాల పొడి, జింజర్ గార్లిక్ పేస్ట్, కార్న్‌ఫ్లోర్ వేశాక నిమ్మరసం వేసి మిశ్రమం కలపాలి. ఆ తర్వాత టేబుల్ స్పూన్ నూనె వేసి కలపాలి. చివరగా సరిపడ నీళ్లు పోసి మసాలాను మరీ గట్టిగా కాకుండా మరీ నీళ్లలా కాకుండా తయారు చేసుకోవాలి. ఉప్పు, కారం అవసరమైతే సరిపడ వేసుకోవాలి.

ఈ మసాలాను చేప ముక్కలకు రెండు వైపులానే కాకుండా లోపల వైపు పట్టించి.. ప్లేట్‌లో ఉంచుకోవాలి. ముక్కలకు బాగా పట్టిందా లేదో సరిచూసుకుని ఆ ప్లేట్‌ను ఫ్రిజ్‌లో రెండు గంటల పాటు ఉంచాలి. ఫ్రిజ్‌నుంచి ముక్కలను తీశాక.. ప్యాన్‌లో మిగిలిన నూనె వేసి ప్యాన్‌ను కదిలించాలి. నూనె మరిగాక మంటను కొద్దిగా తగ్గించి చేప ముక్కలను రెండు వైపులా వేయించుకోవాలి. వేయించేప్పుడు మాడిపోకుండా జాగ్రత్తపడాలి. ఈ చేప ముక్కల వేపుడును స్నాక్స్‌లా తినొచ్చు లేదా అన్నంలోకి సైడ్ డిష్‌లా కూడా తినొచ్చు.



మసాలా చేపల కూర

కావాల్సిన పదార్థాలు

రోహు చేప ముక్కలు- అర కేజీ, పసుపు- అర టీస్పూన్, ఉప్పు- టీస్పూన్, నూనె- ఐదు టేబుల్ స్పూన్లు, మెంతులు- పావు టీస్పూన్, ఉల్లిపాయల పేస్ట్- వంద గ్రాములు, అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 టీస్పూన్లు, కారంపొడి- ఒకటిన్నర టీస్పూన్లు, జీలకర్ర పొడి- ముప్పావు టీస్పూన్, ధనియాల పొడి- ఒకటిన్నర టీస్పూన్, కశ్మీరి చిల్లీ పౌడర్- 2 టీస్పూన్లు, చిన్న టమోటాలు-2 (సన్నగా తరగాలి), కసూరీ మేతీ- ఒక టీస్పూన్, పెరుగు- 2 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

చేప ముక్కలను శుభ్రంగా కడగాలి. చతురస్రాకార బాక్స్‌లో ఉంచి అందులో పసుపు, ఉప్పు వేసి ముక్కలకు రెండు వైపులా బాగా పట్టించాలి. గంట పాటు పక్కన ఉంచుకోవాలి.

మూకుడులో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి వేడయ్యాక చేప ముక్కలను రెండు వైపులా రంగు మారేంత వరకూ వేయించుకోవాలి. వీటిని తీసి పక్కన ఉంచుకోవాలి. మరో మూకుడులో మూడు టేబుల్ స్పూన్ల నూనె వేసి కొద్దిగా వేడయ్యాక.. మెంతులు వేసి ఆనియన్ పేస్ట్ వేసి గరిటెతో కలపాలి. ఇందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేశాక.. కొద్దిగా పసుపు, కారంపొడి, జీలకర్ర పొడి, ధనియాల పొడి, కశ్మీరీ చిల్లీ పౌడర్ వేశాక గరిటెతో బాగా కలపాలి. మంటను సిమ్‌లో ఉంచి పది నిముషాల పాటు కలిపితే పేస్ట్‌లా వస్తుంది.

ఇందులో టమోటా ముక్కలు, కసూరీ మేతీ, ఉప్పు వేసిన తర్వాత నాలుగైదు నిముషాల పాటు కలపాలి. ఇందులో పెరుగు వేసి మూడు నిముషాల కలిపాక మూడు వందల మిల్లీ లీటర్లు నీళ్లు పోసి బుడగలు వచ్చేంత వరకూ ఉడికించాలి. ఆ తర్వాత వేయించి పక్కన ఉంచుకున్న చేప ముక్కలను ఇందులో ఉంచి.. మూకుడు మూత పెట్టి పది నిముషాల పాటు ఉడికించాలి. చివరగా కొద్దిగా గరంమసాలా చల్లుకుని రెండు నిముషాల పాటు లోహీట్‌లో కుక్ చేసి దించేసుకోవాలి. ఈ మసాలా చేపల కూరను అన్నంతో తినాలి.

స్ఫూర్తి

అన్నం దొరకని స్థితి నుంచి అవార్డు వరకూ...



17 ఏళ్ల లేత వయసులోనే వయసుకు మించిన కష్టాలను చవిచూసింది పంజాబ్‌కు చెందిన టినెస్సా కౌర్. తల దాచుకోడానికి ఇల్లులేక, గురుద్వారలో దొరికే ఉచిత భోజనంతో ఆకలి తీర్చుకున్న టినెస్సా నేడు, యుకెలోని ప్రతిష్ఠాత్మక ప్రొ బోనో బారిస్టర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికయ్యే స్థాయికి ఎదిగి ఆ అవార్డును గెలుచుకున్న మొట్టమొదటి సిక్కు మహిళా లాయర్‌గా చరిత్ర సృష్టించింది. ఆవిడ గురించిన ఆసక్తికరమైన కథనమిది.

టినెస్సా కౌర్ బాల్యం కష్టాలు, కడగండ్లతోనే గడిచింది. దుర్భరమైన దారిద్ర్యంలో పుట్టిన కౌర్‌ది నిరక్ష్యరాస్యుల కుటుంబం. 2002లో ఆమె తండ్రి కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయాడు. 2007లో, జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ పరీక్ష సమయంలో తండ్రి జైలు పాలవడంతో ఆమె నిరాశ్రయురాలైంది. ఆ సమయంలో తన పరిస్థితి గురించి వివరిస్తూ... "భగవంతుడి పట్ల నాకున్న విశ్వాసమే నా జీవితంలో ప్రధాన భాగంగా మారింది. నా దగ్గర తినడానికి ఆహారమే ఉండేది కాదు. దాంతో గురుద్వారలో దొరికే ఒంటిపూట ఉచిత భోజనం మీదే ఆధారపడేదాన్ని" అంటే కౌర్ బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. టీనేజీ వయసులో ఉండడానికి ఇల్లు లేక రోడ్డు పాలైన తాను ఎ లెవెల్ స్థాయి విద్యను అభ్యసించే సమయంలో వీధి రౌడీలు, గ్యాంగ్‌ల నుంచి ముప్పులను ఎదుర్కొనేదాన్ననీ, ఆ కష్టాలతో పోరాడుతూనే 2010 నాటికి బడి చదువును పూర్తి చేయగలిగాననీ మీడియాకు కౌర్ వివరించింది.

నిరుపేదలకు సహాయపడుతూ...

తర్వాత, యుకెలోని సిక్కుల మద్దతుతో కౌర్ వెస్ట్ లండన్‌లోని గ్రీన్‌ఫర్డ్‌కు చేరుకుంది. అక్కడి సిక్కు సమాజం అండదండలతో, మొక్కవోని పట్టుదలతో ఉన్నత చదువు చదివింది. బార్ స్టడీస్ పూర్తి చేసి, 2013లో లా డిగ్రీలో గ్రాడ్యుయేట్ అయింది. 2019లో శ్రమ ఫలించి, కౌర్‌కు బార్ నుంచి పిలుపొచ్చింది. నాలుగేళ్ల తర్వాత 2023లో 32 ఏళ్ల వయసులో ఆవిడ బారిస్టరుగా అర్హత పొందింది. ఇతరుల సేవకే కట్టుబడిన కౌర్, తన కెరీర్ అంతటా తన సేవాతత్పరతను చాటుకుంది. మానవ హక్కుల పట్ల తనకున్న ఆసక్తితో, ఖాళీ సమయాల్లో నిరుపేద సమాజాలకు న్యాయ సలహాలు, సూచనలు ఇస్తూ ఉంటుంది. ప్రజా న్యాయవాదిగా, సిక్కుల, మానవ హక్కుల కార్యకర్తగా కౌర్ తన పరిధి మేరకు ప్రజలకు సహాయసహకారాలను అందించింది.

సిక్కుల లాయర్ల అసోసియేషన్ స్థాపించి...



సేవ, లేదా నిస్వార్థ సేవ అనే సిక్కుల ప్రధాన సూత్రం లక్ష్యంగా, సామాజిక బాధ్యతలో భాగంగా, కౌర్ సిక్కు లాయర్ల అసోసియేషన్‌ను స్థాపించింది. వేర్వేరు న్యాయ విభాగాల్లో అవసరమైన సలహాలు, సూచనలను అందించడం కోసం ఈ లీగల్ కన్సల్టెన్సీని ఆవిడ స్థాపించింది. 'జస్ట్ కట్ ఇట్ ఔట్ నౌ' అనే ప్రాజెక్టు ద్వారా, యువతలో స్వయం స్వావలంబన, ప్రేరణల కోసం కృషి చేస్తూ, ముఠా సంస్కృతి, హింసలను అరికట్టే ప్రయత్నం చేస్తోంది. "తర్వాతి తరంతో పాటు భవిష్యత్తు తరాలకు సహాయం చేయడం కోసం నా వంతు కృషి చేస్తూనే ఉంటాను. అన్ని దారులూ మూసుకుపోయి, జీవితం మీద ఆశ కోల్పోయిన వాళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తెలుసు. కాబట్టి ఒక బారిస్టరుగా నాకు సాధ్యమైనంత సహాయాన్ని నేను అందించాలనుకుంటున్నాను. చాంబర్స్‌లోకి అడుగు పెట్టిన ప్రతిసారీ, నేనిక్కడ ఒక సిక్కు మహిళగా వ్యవహరించబోతున్నాను అనే వాస్తవం నాకు స్ఫురిస్తూ ఉంటుంది. 'అవరోధాలను అధిగమించి, ఇతరులకు సహాయపడే స్థాయికి ఎదగగలిగాను' అనే విషయాన్ని నేను చర్యల్లో ప్రతిబింబించగలిగినప్పుడే, ఇతరులకు నేను మార్గదర్శకంగా మారగలుగుతాను" అంటూ తన ముందున్న బృహత్తర బాధ్యత గురించి వివరించింది కౌర్.

మేకప్

మెడకు మేకప్

మేకప్ ముఖానికే కాదు, మెడకూ వేయాలి. లేదంటే ముఖానికీ, మెడకూ పొంతన కుదరక ఎబ్బెట్టుగా కనిపిస్తాం. అందమైన ముఖారవిందంతో పాటు శంఖం లాంటి మెడతో మెరిసిపోవాలంటే ఇవిగో ఈ టిప్స్ పాటించాలి.

పైబడే వయసు మెడలో ప్రతిబింబిస్తుంది. అక్కడి చర్మం సాగుతూ, ముడతలుపడుతూ ఉంటుంది. కాబట్టి మేకప్ విషయంలో ముఖం పట్ల ఎంతటి శ్రద్ధను కనబరుస్తామో, మెడ పట్ల కూడా అంతే శ్రద్ధను కనబరచాలి.

- **సిలికాన్ ప్రైమర్:** మెడ మీద ఏర్పడే సన్నని లైన్లు, ముడతలు కనిపించకుండా చేయడం కోసం, మేకప్‌కు ముందు సిలికాన్ ప్రైమర్ అప్లై చేయాలి. దీంతో చర్మం నునుపుగా మారి గీతలు మటుమాయమవుతాయి. టింటెడ్ ప్రైమర్‌తో ఓపెన్ పోర్స్‌ను కూడా దాచేయవచ్చు. ఇందుకోసం మెడలోని డార్కర్ ఏరియాల్లో ప్రైమర్ అప్లై చేసి, తడి స్పాంజ్‌తో బ్లెండ్ చేయాలి. మెడ మీద డార్కర్ ఏరియాలను కరెక్ట్ చేయడం కోసం కన్‌సీలర్ కంటే ముందు కలర్ కరెక్టర్‌ను కూడా ఉపయోగించవచ్చు.
- **మాయిశ్చరైజర్:** మెడ మీద చర్మం పలుచగా ఉంటుంది కాబట్టి తేలికగా పొడిబారిపోతూ ఉంటుంది. కాబట్టి ముఖంతో పాటు తప్పనిసరిగా మెడకూ మాయిశ్చరైజర్ అప్లై చేస్తూ ఉండాలి. అప్పుడే మెడ మీద గీతలు, మచ్చలు, ముడతలు ఏర్పడకుండా ఉంటాయి.
- **ఫౌండేషన్:** లిక్విడ్ లేదా క్రీమ్ ఎలాంటి ఫౌండేషన్‌ను ఎంచుకున్నా, ముఖం, మెడ మీద సమానంగా పరుచుకునేలా తడిపిన స్పాంజీతో అప్లై చేసుకోవాలి. అలాగే, అవసరానికి మించి ఫౌండేషన్ ఉపయోగిస్తే, మెడ మీది ముడతల్లో ఇరుక్కుపోయి, ముడతలు స్పష్టంగా కనిపించే ప్రమాదం ఉంటుంది. కాబట్టి తగుమాత్రంగానే ఉపయోగించాలి.
- **బ్లష్:** చెక్కిళ్ల మీద అప్లై చేసుకునే బ్లష్‌ను కొద్ది పరిమాణంలో మెడ మీద అప్లై చేసుకోవడం వల్ల, ముఖం, మెడా రెండూ ఈవెన్ కలర్‌లో కనిపించే అవకాశం ఉంటుంది.
- **విటమిన్ సి సీరమ్:** విటమిన్ సితో కూడిన సీరమ్ లేదా మాయిశ్చరైజర్ ఉపయోగించడం వల్ల యువి ఎక్స్‌పోజర్‌తో కలిగే ఫ్రీ ర్యాడికల్ డ్యామేజీ నుంచి మెడ చర్మానికి రక్షణ దక్కుతుంది. కాబట్టి ఈ జాగ్రత్తలు పాటించాలి.
- **హైలైటర్:** మెడ మీద ఇతరుల చూపును పక్కకు తప్పించి, చెక్కిళ్ల మీద నిలపడం కోసం, చెక్కిళ్ల మీద హైలైటర్ అప్లై చేయాలి. అయితే ఇందుకోసం లిక్విడ్ హైలైటర్‌ను ఉపయోగించాలి.



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం ● 15 జూన్ 2024
cinema@andhrajyothy.com




పరమేశ్వరుని ఆజ్ఞతోనే కన్నప్ప తీశాం

మంచు మోహన్‌బాబు

"కన్నప్ప కథ అన్ని తరాలను ఆకట్టుకుంటుంది. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే 'కన్నప్ప' చిత్రం తీశాం. ప్రభాస్ కోసం రాసుకున్న కథను కృష్ణంరాజు గారు మేం అడగ్గానే ఇచ్చి, ప్రోత్సహించారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఇది కేవలం భక్తి చిత్రమే కాదు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలూ ఉన్నాయి' అని మంచు మోహన్‌బాబు అన్నారు. విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. ముఖేశ్ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. శుక్రవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ '2014లో 'కన్నప్ప' సినిమా తీయాలని నిశ్చయించుకున్నాను. అంతా సిద్ధం చేసి పెట్టుకున్నాను. ఇప్పుడు సినిమా తీసి మీ ముందుకు తీసుకొస్తున్నాం. కన్నప్పది కల్పిత గాథ కాదు. రెండో శతాబ్దంలో జరిగిన ఘటన. శంకరాచార్యుల వారు కూడా కన్నప్ప గురించి చెప్పారు. 14వ శతాబ్దంలో ధూర్జటి కన్నప్ప గురించి రాశారు. 18వ శతాబ్దంలో కన్నప్ప గురించి బ్రిటీషర్లు రాసిన పుస్తకం బికనీర్ యూనివర్సిటీలో ఉంది. దాని ఆధారంగానే జాగ్రత్తగా సినిమా తీశాం. ఇకపై ప్రతి సోమవారం కన్నప్ప చిత్రం నుంచి అప్డేట్ వస్తుంది. బడ్జెట్ గురించి ఆలోచించలేదు. చరిత్రలో నిలిచిపోయే సినిమా తీస్తున్నామని ధైర్యంగా ముందుకెళ్లాం' అని చెప్పారు. కన్నప్ప పాత్ర కోసం విష్ణు పడిన కష్టం గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు ముఖేశ్ కుమార్. కన్నప్ప సినిమా మాత్రమే కాదు, మన చరిత్ర అని శరత్ కుమార్ చెప్పారు. ఒక గొప్ప సినిమాలో నటించినందుకు ఆనందంగా, గర్వంగా ఉందని మధు బాల చెప్పారు.

పవర్‌ఫుల్ పాత్రలో...



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'విశ్వంభర'. త్రిషకృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తుండగా, విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ శుక్రవారం సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఇందులో ఆయన చాలా పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తున్నారని మేకర్స్ తెలిపారు. సంక్రాంతి కానుకగా ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. ఈ చిత్రానికి డీఓపీ: చోటా.కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి.

నా కోరిక తీరింది



చైతన్యరావు, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఈ రొమాంటిక్ కామెడీకి బాల శేఖరుని దర్శకత్వం వహించగా, కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో చైతన్య రావు మాట్లాడుతూ "ప్రతి నటుడికీ అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న క్యారెక్టర్ చేయాలనే కోరిక ఉంటుంది. ఈ సినిమా ద్వారా నాకు ఆ కోరిక తీరింది" అని అన్నారు. "అన్ని వర్గాల ప్రేక్షకులకి సినిమా కనెక్ట్ అవుతుంది" అని దర్శకుడు బాలశేఖరుని చెప్పారు. "థియేటర్స్‌లో ప్రేక్షకులని ఆకట్టుకునేది కంటెంట్ మాత్రమే. ఆ మంచి కంటెంట్ ఇందులో ఉంది" అని హెబ్బా పటేల్ అన్నారు.

దీపావళికి సింగం ఎగైన్



అజయ్ దేవ్‌గణ్, అక్షయ్ కుమార్, రణ్‌వీర్‌సింగ్ హీరోలుగా రూపొందుతున్న మల్టీస్టారర్ 'సింగం ఎగైన్'. 'సింగం' సిరీస్‌లో వస్తున్న ఐదో చిత్రమిది. దీపికా పదుకొనే, కరీనాకపూర్ కథానాయికలు. ముందు ప్రకటించిన విధంగా ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవ్వాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఈ చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. అక్టోబర్‌లో దీపావళి సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు చిత్రబృందం శుక్రవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. చిత్రీకరణ పూర్తి కాకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని దర్శకుడు రోహిత్ శెట్టి చెప్పారు. జియోస్టూడియోస్, దేవ్‌గణ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నాయి. అయితే సింగం ఎగైన్ స్థానంలో ఆగస్టు 15న 'స్త్రీ 2' చిత్రం రాబోతోంది. శుక్రవారం దర్శకుడు అమర్‌కౌశిక్ సోషల్ మీడియా ద్వారా విడుదల తేదీని ప్రకటించి, టీజర్‌ను విడుదల చేశారు. 2018లో విడుదలైన 'స్త్రీ' చిత్రానికి ఇది కొనసాగింపు. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ జంటగా నటించారు.

నితిన్‌కు జంటగా...





'భీష్మ' చిత్రం తర్వాత హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కలయికలో తెరకెక్కుతున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. శ్రీలీల ఇందులో హీరోయిన్‌గా నటిస్తోంది. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. శుక్రవారం శ్రీలీల పుట్టిన రోజు సందర్భంగా సినిమాలో ఆమె పాత్రను మేకర్స్ పరిచయం చేశారు. ఇందులో విమానం దిగుతూ.. సంపన్నురాలి పాత్రలో కనిపించిన ఆమె పాత్ర పేరు నీరా వాసుదేవ్. ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను డిసెంబరు 20న విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఊరి గొడవల్లో కుర్రోళ్ల మజా



సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. నిహారికా కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించారు. యదువంశీ దర్శకుడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం హీరో నితిన్ ఈ చిత్రం టీజర్‌ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఊరి గొడవల్లో తలదూర్చిన యువబృందం ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది అనే నేపథ్యంలో స్నేహం, ప్రేమ, భావోద్వేగాల కలయికగా సాగిన టీజర్ ఆసక్తికరంగా అనిపించింది. సాయికుమార్ కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్. సినిమాటోగ్రఫీ: రాజు ఎడురోలు

వినోదాత్మకంగా 'స్వాగ్'



శ్రీవిష్ణు, రీతూ వర్మ, మీరా జాస్మిన్ నటిస్తున్న చిత్రం 'స్వాగ్'. హసిత్ గోలి దర్శకత్వం వహిస్తుండగా, టి.జి.విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన నటీనటుల ఫస్ట్ లుక్‌లు, క్యారెక్టర్ గ్లింప్స్‌లు అందరినీ ఆకట్టుకోగా.. శుక్రవారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఎంతో వినోదాత్మకంగా సాగిన ఈ టీజర్‌లోని సన్నివేశాలు, సంభాషణలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఈ చిత్రానికి ఎడిటర్: విప్లవ్ విషాదం, డీఓపీ: వేదరామన్ శంకరన్, సంగీతం: వివేక్ సాగర్.



తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌తో



చైతన్య రావు, యష్ణ నటించిన ఓటీటీ చిత్రం 'డియర్ నాన్న'. అంజి సలాది దర్శకత్వం వహించగా, రాకేశ్ మహంకాళి నిర్మించారు. ఫాదర్స్ డే స్పెషల్‌గా ఈ సినిమా శుక్రవారం నుంచి ఓటీటీ వేదిక 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌లోని తండ్రీ కొడుకుల సెంటిమెంట్ అందర్నీ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రవణ్ కటికనేని, డీఓపీ: అనిత్ కుమార్ మాధాడి, సంగీతం: గిఫ్టన్ ఎలియాస్.

మెప్పించే నాన్న పాట



నూతన నటులు కృష్ణ వంశీ, మోక్ష నటిస్తున్న చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాశ్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని 'నాన్న' పాటను డైరెక్టర్ హను రాఘవపూడి లాంచ్ చేశారు. హృదయానికి హత్తుకునేలా ఉన్న ఈ పాటను దర్శకుడు చిలుకూరి ఆకాశ్‌రెడ్డి రాశారు. శశాంక్ తిరుపతి మ్యూజిక్ అందించగా, అంజనా బాలకృష్ణన్, శ్రాగ్వి ఆలపించారు. ఈ చిత్రానికి ఎడిటర్: జే.సీ.శ్రీకర్, డీఓపీ: ప్రేమ్ సాగర్.

జైలు నుంచి హేమ విడుదల

బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో అరెస్టయి పరప్పన అగ్రహార జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సినీ నటి హేమ శుక్రవారం విడుదలయ్యారు. బుధవారం ఎన్‌డీపీఎస్ ప్రత్యేక కోర్టు హేమకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గురువారం బెయిల్‌లో సూచించిన నిబంధనలకు అనుగుణంగా పూర్తి ప్రక్రియ సాగింది. శుక్రవారం అన్ని షరతులకు లోబడి పత్రాలు సమర్పించడంతో హేమను విడుదల చేశారు.



చంద్రబాబును చూసి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలి

» తెలంగాణలో ఆరు నెలలైనా హామీల ఊసే లేదు:ఏలేటి



న్యూఢిల్లీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన కొన్ని గంటల్లోనే ఐదు హామీలపై చంద్రబాబు సంతకం చేశారని, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి.. ఆయన్ను చూసి నేర్చుకోవాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హితవు పలికారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలవుతున్నా హామీల ఊసే లేదని మండిపడ్డారు. ఏపీలో ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజే వృద్ధాప్య పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.4 వేలకు పెంచారని గుర్తు చేశారు. తెలంగాణలోనూ వృద్ధాప్య పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఇప్పటికీ దాన్ని అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో ఉన్నా చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలపై మాజీ సీఎం కేసీఆర్ ఫొటో ఉందన్న కారణంతో మళ్లీ వెనక్కి తీసుకున్నారని, దీని వల్ల ఖజానాపై భారం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ మాజీ ముఖ్యమంత్రి ఫొటోతో ఉన్న పుస్తకాలనే పిల్లలకు ఇచ్చారని గుర్తు చేశారు.

గ్రూపు- 2 అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్

» జూన్ 16 నుంచి 20వ తేదీ వరకు అవకాశం

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-2 పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) అధికారులు ఎడిట్ ఆప్షన్‌ను కల్పించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 783 గ్రూపు-2 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పోస్టుల కోసం ఇప్పటికే అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆగస్టు 29వ తేదీన పరీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు సమర్పించిన దరఖాస్తుల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకోవడానికి ఒక అవకాశం కల్పించారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు ఈ ఎడిట్ ఆప్షన్‌ను ఉపయోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ ఎడిట్‌లో భాగంగా అభ్యర్థులు పీడీఎఫ్ పద్ధతిలో తమ వివరాలను పొందుపరచాల్సి ఉంటుందని వారు చెప్పారు. ముఖ్యంగా పేరు, జెండర్, పుట్టిన తేదీ, కమ్యూనిటీ, నాన్- క్రీమీ లేయర్ స్టేటస్, పీడబ్ల్యూడీ కేటగిరి, లోకల్ స్టేటస్, స్పోర్ట్స్ వంటి వివరాలను సరి చూసుకోవాలని అధికారులు సూచించారు.

ఐసెట్‌లో 91 శాతం ఉత్తీర్ణత

సయ్యద్ మునీబుల్లా హుస్సేన్‌కు మొదటి ర్యాంకు.. త్వరలోనే కౌన్సెలింగ్ షెడ్యూల్

వరంగల్ ఎడ్యుకేషన్, హైదరాబాద్, జూన్ 14: ఐసెట్-2024 ఫలితాలను ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి విడుదల చేశారు. శుక్రవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని మండలి కార్యాలయంలో కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణతో కలిసి ఆయన ఐసెట్ ఫలితాలను వెల్లడించారు. రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం ఈ నెల 5, 6 తేదీల్లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో 116 పరీక్ష కేంద్రాల్లో ఐసెట్ పరీక్ష నిర్వహించారు. మొత్తం 77,942 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 71,467 మంది (91.92 శాతం)అర్హత సాధించారు. 66,104 మంది స్థానిక కోటాలో, 5,543 మంది స్థానికేతర కోటాలో అర్హత సాధించారని అధికారులు తెలిపారు. త్వరలోనే కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను వెల్లడిస్తామన్నారు.

మొదటి 10 ర్యాంకర్లు వీరే..

సయ్యద్ మునీబుల్లా హుస్సేన్ మొదటి ర్యాంకు సాధించగా, జెల్లా భరత్ రెండో ర్యాంకు, కందాల లాస్య మూడో ర్యాంకు, పాలగుల్ల రిశిక రెడ్డి నాలుగో ర్యాంకు, కొట్నాన శివకుమార్ ఐదో ర్యాంకు, బి.అక్షిత్ ఆరో ర్యాంకు, బొమ్మన రాణి ఏడో ర్యాంకు, గంగా శిండే ఎనిమిదో ర్యాంకు, ఎన్.నరేశ్ సింగ్ తొమ్మిదో ర్యాంకు, రవిళి బుదారపు పదో ర్యాంకు సాధించారు.



కూలీపనుల కోసం వలసవచ్చాం

మాది రంగారెడ్డి జిల్లా సుద్దపల్లి. కూలీ పనుల కోసం తుర్కయాంజల్‌కు అమ్మానాన్నలతో వలసవచ్చాం. 2021లోనే బీకాం పూర్తి చేశా. మూడేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం కోసం చదువుతూ ఐసెట్ రాశా. టాప్ 2 ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. ఉస్మానియా వర్సిటీలో ఎంబీఏ చదువుతా.

- జెల్లా భరత్, రెండో ర్యాంకర్

ప్రమాదకర శునకాల పెంపకం నిషేధంపై.. హైకోర్టు తాత్కాలిక స్టే

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా, భయకరంగా కనిపించే 25 రకాల శునకాల పెంపకంపై నిషేధం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌పై హైకోర్టు తాత్కాలికంగాస్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది కేంద్రం ఉత్తర్వులను సవాల్ చేస్తూ సిటిజన్స్ ఫర్ యానిమల్స్, స్ట్రే యానిమల్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, ఫరీదున్నీసా హుమ తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.

ధరణి పెండింగ్ దరఖాస్తులను.. 10 రోజుల్లో పరిష్కరించండి

» రోజుకు 100 దరఖాస్తుల పరిశీలన లక్ష్యం

» రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిత్తల్

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ధరణి పెండింగ్ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి సీసీఎల్‌ఏ నవీన్‌మిత్తల్ ఆదేశించారు. 10 రోజుల్లో పెండింగ్ దరఖాస్తులన్ని పరిశీలించి జీరో స్టేజికి తీసుకురావాలని గడువు విధించారు. శుక్రవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో నవీన్‌మిత్తల్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దరఖాస్తులు వేగవంతంగా క్లియర్ చేసేందుకు ఎమ్మార్వోలకు అదంగా లాగిన్‌లు ఇచ్చారు. రోజుకు వంద చొప్పున పెండింగ్ దరఖాస్తులు పరిశీలించాలని లక్ష్యం విధించారు. పరిష్కరించిన ప్రతి దరఖాస్తుకూ ప్రొసీడింగ్ ఆర్డర్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని.. తిరస్కరిస్తే, ఎందుకు రిజెక్ట్ చేశారో తెలుపుతూ రిమార్కులను నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఓపెన్ చేసేందుకు, వాటి పరిష్కారానికి అవసరమైన రిపోర్టులు అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక లాగిన్‌లు ఇచ్చారు. ఇప్పటి వరకూ తహశీల్దార్లకు ఒకే లాగిన్ ఉండేది. ఆ లాగిన్ ద్వారానే ధరణి దరఖాస్తుల పరిశీలన, రిపోర్టుల అప్‌లోడ్, భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేవి . ఇప్పుడు వారికి అదనంగా మరో లాగిన్ ఇవ్వాలని కలెక్టర్లకు మిత్తల్ సూచించారు. ఒక లాగిన్ ద్వారా ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, మరో లాగిన్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. డిప్యూటీ తహశీల్దార్లకు (డీటీ) ఇచ్చిన లాగిన్ ద్వారా ధరణిలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ లాగిన్‌లు ఇచ్చే అధికారం కలెక్టర్లకు ఉండేది. ఆ బాధ్యతలను నుంచి వారిని తప్పించి అదనపు కలెక్టర్లకు అప్పగించారు. ప్రతి సమస్య పరిష్కారానికీ ఒక ప్రత్యేక మాడ్యూల్ ఉందని.. వాటి ద్వారా అన్నీ పరిష్కరించాలని సూచించారు. పరిష్కారానికి వీలులేని దరఖాస్తులు ఉంటే కారణాలు చెప్పి రిజెక్ట్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ రూల్ పొజిషన్‌కు లోబడి పనిచేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని మాడ్యూల్స్‌లో వచ్చిన దరఖాస్తులకు మాత్రమే ప్రొసీడింగ్ ఆర్డర్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి.. మిగతా దరఖాస్తులను చెక్‌లిస్టులో ఉన్న సమాచారం ఆధారంగా అప్రూవ్ చేసేవారు. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలికి.. ప్రొసీడింగ్ ఆర్డర్‌ను తప్పనిసరిగా అప్‌లోడ్ చేసే విధానాన్ని తీసుకొచ్చారు.



ఇదీ లెక్క..

రాష్ట్రవ్యాప్తంగా ధరణి పెండింగ్ దరఖాస్తులు దాదాపు 3 లక్షలకు పైగా ఉన్నట్లు అంచనా. రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 45 వేలు, సంగారెడ్డి జిల్లాలో 20 వేలు, వికారాబాద్ జిల్లాలో 17 వేలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 12 వేలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 12 వేలు, మేడ్చల్ మల్కాజిరిగి జిల్లాలో 11,500, మహబూబ్‌నగర్‌లో 6,500 చొప్పున ధరణి పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయి. మిగతా జిల్లాల్లో కూడా పెండింగ్ దరఖాస్తులు భారీగానే ఉన్నాయి.

రెవెన్యూ ప్రక్షాళనకు చర్యలు

» మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ వ్యవస్థ(ధరణి) ప్రక్షాళనకు సత్వర చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ధరణి పోర్టల్ పునర్ వ్యవస్థీకరణపై దృష్టి పెట్టామని అన్నారు. సామాన్యులకు కూడా సులువుగా అర్థమయ్యేలా ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. ఈ మేరకు ధరణి పోర్టల్‌పై అధ్యయనానికి నియమించిన ఐదుగురు సభ్యుల కమిటీతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ధరణి పునర్ వ్యవస్థీకరణపై దృష్టి పెట్టామని చెప్పారు. గత ప్రభుత్వం ఎలాంటి అధ్యయనం చేయకుండా తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల లక్షలాది కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయని తెలిపారు. భూవివాదాల పరిష్కారానికి రెవెన్యూ ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలని, భూమికి సంబంధించిన ముఖ్యమైన చట్టాలను కలిపి ఒకే చట్టంగా రూపొందించాలని ధరణి కమిటీ సిఫారసు చేసిందని చెప్పారు. ధరణి అమలుతో వచ్చిన సమస్యలకు సంబంధించి కమిటీ చేసిన సిఫారసులపై చర్చించామని చెప్పారు. కమిటీ తుది నివేదిక ప్రభుత్వానికి సమర్పించే ముందు అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సామాన్య ప్రజలకు సులువుగా అర్థమయ్యేలా ధరణి పోర్టల్‌లో మార్పులు చేర్పులు చేపట్టబోతున్నామని చెప్పారు.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెలా వేతనం

అన్ని శాఖలకు ఆదేశాలు జారీచేసిన ఆర్థిక శాఖ

సర్వీసు గడువు జూలై 31 వరకు పొడిగింపు

హైదరాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, దినసరి, పార్ట్‌టైమ్ తదితర సిబ్బందికి ప్రతి నెల క్రమంతప్పకుండా వేతనాలు చెల్లించాలని ఆర్థిక శాఖ ఆదేశించింది. వివిధ శాఖలు, విభాగాధిపతుల కార్యాలయాలు, స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, గ్రాంట్-ఇన్-ఎయిడ్ సంస్థల్లో పనిచేస్తున్నవారికి ఈ మేరకు చెల్లింపులు చేయాలంటూ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం అంతర్గత ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని ఇటీవల ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా 'సర్వీసు కొనసాగింపు' ఉత్తర్వులు అందలేదని జీతాలను సకాలంలో ఇవ్వడం లేదు. అయితే, ఇకపై ఇలాంటి 'వేతనాల నిలిపివేతలు' ఉండకూడదని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఏడాది మార్చి 31తో సర్వీసు ముగిసిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఇతర సిబ్బంది కొనసాగింపు కాలాన్ని జూలై 31 వరకు పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. ఆ తర్వాత మళ్లీ పొడిగిస్తామని తెలిపింది.

చంచల్‌గూడ జైలుకు రాధాకిషన్‌రావు

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు తిరిగి చంచల్‌గూడ జైలుకు చేరుకున్నారు. తల్లి మృతి చెందడంతో దశదినకర్మ, ఇతర కార్యక్రమాలు నిర్వహించేందుకు కోర్టు ఆయనకు 5 రోజులు ఎస్కార్టు బెయిల్ మంజూరు చేసింది. గత సోమవారం ఉదయం జైలు నుంచి వెళ్లిన రాధాకిషన్‌రావు గడువు ముగియడంతో శుక్రవారం రాత్రి తిరిగి చంచల్‌గూడ జైలుకు చేరుకున్నారు. ఈ కేసులో అరెస్టైన తర్వాత ఆయన జైలు బయటకు వెళ్లి రావడం ఇది మూడోసారి.

తెలుగు సబ్జెక్టు పాఠ్యపుస్తకాల్లోనే మాజీ సీఎం కేసీఆర్ పేరు వచ్చిందని, అవి కూడా పాత స్టాక్ పుస్తకాలేనని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పొరపాటు దొర్లిన పాఠ్య పుస్తకాల మొదటి పేజీలను ఎంఈవో కార్యాలయాల్లోనే తొలగించి వేరే పేజీని జత చేరుస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో ప్రజాధనమేమీ వృథా కావడం లేదన్నారు.

ప్రముఖ వ్యంగ్య, హాస్య రచయిత.. నందూరి పార్థసారథి కన్నుమూత

» సంగీత, నృత్య, నాటక, చిత్ర, శిల్ప కళలపై వందలాది విమర్శనాత్మక వ్యాసాలు

» శుక్రవారం ముగిసిన అంత్యక్రియలు



నందూరి పార్థసారథి(ఫైల్)

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు పాఠక లోకానికి, సాహితీప్రియులకు 'నంపాసా'గా చిరపరిచితుడైన ప్రముఖ వ్యంగ్య, హాస్య రచయిత, సీనియర్ పాత్రికేయుడు.. నందూరి పార్థసారథి (85) ఇకలేరు. కొద్ది రోజులుగా మెదడుకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్న ఆయన నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు తుదిశ్వాస విడిచారు. పార్థసారథి పుట్టింది, పెరిగింది ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఆరుగొలను గ్రామం. 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకుడు నందూరి రామ్మోహనరావు ఆయన సోదరుడు. ముళ్లపూడి వెంకట రమణ సతీమణి శ్రీదేవి.. పార్థసారథికి సోదరి. 1957లో కథా రచన ప్రారంభించిన ఆయన.. 'రాంబాబు డైరీ (మూడు భాగాలు)', 'పిబరే హ్యూమరసం', 'అయోమయ రాజ్యం', 'సాహిత్య హింసావలోకనం', 'ఖార్థానాఖ్యానము', 'జేజి మావయ్య పాటలు' తదితర హాస్య, వ్యంగ్య రచనలతో పాటు 'స్వరార్ణవం' 'సంగీత కళా చరిత్ర', 'శ్రీకృష్ణ కథామృతం', 'శిఖరాలు- సరిహద్దులు' తదితర రచనలు చేశారు. సంగీత, నృత్య, నాటక, చిత్ర, శిల్ప, వాస్తు కళలపై సాధికారిక విశ్లేషణలతో 'రసమయి' సాంస్కృతిక మాస పత్రికను 2000 నుంచి 2009 వరకు నిర్వహించారు. లలిత కళలపై కొన్ని వందల విమర్శనాత్మక వ్యాసాలు రాశారు. 1959 నుంచి 1996 వరకూ 'ఆంధ్రప్రభ'లో పాత్రికేయుడిగా సేవలందించారు. వెయ్యికి పైగా అరుదైన గ్రామఫోన్ రికార్డులు, కొన్ని వందల పాటల క్యాసెట్లు, సీడీలను నందూరి సేకరించారు. భారతీయ సంప్రదాయ సంగీతంతోపాటు పాశ్చాత్య సంగీత, నృత్యాలకు సంబంధించిన అరుదైన పుస్తకాలనూ ఆయన వ్యక్తిగత గ్రంథాలయంలో చూడచ్చు. నందూరి పార్థసారథికి.. భార్య సువర్చలా దేవి, కుమారుడు మధు సారథి ఉన్నారు. ముగిసిన అంత్యక్రియలు..నందూరి మృతి పట్ల పలువురు సాహితీ, పాత్రికేయ ప్రముఖులు సంతాపం తెలిపారు. 'ప్రత్యేకమైన శైలితో వ్యంగ్య, హాస్య రచనల ద్వారా తెలుగు పాఠకుల ఆదరాభిమానాలు పొందిన రచయిత నందూరి పార్థసారథి మరణం బాధాకరం' అంటూ వయోధిక పాత్రికేయ సంఘం ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టు కె. రామచంద్ర మూర్తి, చిత్రకారుడు బ్నింతో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు, రచయితలు విచారం వ్యక్తం చేశారు. ముళ్లపూడి వెంకట రమణ సతీమణి శ్రీదేవి, వారి కుమారుడు, సినీ దర్శకుడు వర ముళ్లపూడి.. పార్థసారథి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. కాగా.. నందూరి పార్థసారథి అంత్యక్రియలు శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించారు.

బీసీ లెక్కల కోసం.. ఓటర్ల జాబితా ఆధారంగా సర్వే!

(మొదటి పేజీ తరువాయి)

జనాభా ఎంత ఉందో తేలుస్తారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని రెండు మూడు నెలల్లోనే పూర్తిచేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అప్పుడు సెప్టెంబరులో ఎన్నికలు నిర్వహించే వీలుంటుంది. అయితే ప్రస్తుతానికి ఎన్నికల కోసం ఓటర్ల జాబితా ప్రకారం కులాల లెక్కలు తీసినా.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీమేరకు "సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ కుల సర్వే"ను విడిగా నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వం కూడా ఇదే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, సుప్రీం కోర్టు 2010లో ఇచ్చిన తీర్పు ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కోసం తేల్చాల్సిన కులాల లెక్కల్లో మూడు అంశాలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. డెడికెటెడ్ కమిషన్ ఏర్పాటు చేయడం, ప్రతి గ్రామం వారీగా కులాల లెక్కలు తీయడం, అన్ని వర్గాలకు కలిపి 50 శాతానికి మించకుండా రిజర్వేషన్ ఉండడం అన్నవి ఈ మూడు అంశాలు. అయితే ఓటర్ల జాబితా ప్రకారం ముందుకెళ్లినా ఈ మూడు అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్టే అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

బీసీల రిజర్వేషన్ ఎంత?

ఓటర్ల జాబితా ప్రకారం కులాల లెక్కల తీస్తే.. అన్ని కులాలతోపాటు బీసీల లెక్కలూ తేలుతాయి. దానిని బట్టి వారికి ఎంతశాతం రిజర్వేషన్ కల్పించాలనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే గత బీఆర్ఎస్ సర్కారు 2018లో పంచాయతీరాజ్ చట్టంలో పలు సవరణలు చేసింది. అందులో.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా చూసే క్రమంలో బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించింది. ఆ విధానంలోనే 2019లో స్థానిక ఎన్నికలు నిర్వహించింది. అయితే బీసీలకు రిజర్వేషన్లు తగ్గించి ఎన్నికలు నిర్వహించడంపై హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. హైకోర్టు వాటిని విచారించిన సమయంలో 2024లో జరిగే స్థానిక ఎన్నికల్లో సుప్రీం మార్గదర్శకాలను అమలు చేస్తామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయస్థానానికి చెప్పింది. దీంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. అందుకోసం రాష్ట్రంలోని బీసీల జనాభాను తేల్చి వారి శాతాన్ని ఖరారు చేయాల్సి ఉంటుంది.



రిజర్వేషన్ల అంశంతో ఆలస్యంగా ఎన్నికలు..

నిజానికి సర్పంచ్‌ల పదవీకాలం ఈ జనవరిలోనే ముగిసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం జూలై మొదటివారంతో ముగియనుంది. దీంతో ఈలోపే ఎన్నికలు నిర్వహించి కొత్తవారిని ఎన్నుకోవాల్సి ఉంది. కానీ, రిజర్వేషన్ల అంశం తెరపైకి రావడంతో ఎన్నికలు సమయానుకూలంగా జరగడంలేదు. అయితే 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు.. బీసీ కార్పొరేషన్ ద్వారా సేకరించిన గణాంకాలు, 2000వ సంవత్సరంలో నాటి సీఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన మల్టీపర్పస్ హౌస్‌హోల్డ్ సర్వే (ఎంపీహెచ్ఎస్) ప్రకారం.. అప్పటి పరిస్థితులు, జనాభా ఆధారంగా బీసీలకు అవకాశం కల్పిస్తూ వచ్చారు. ఈ గణాంకాలు, జనాభా పెరుగుదల ఆధారంగా ఆ తరువాత కూడా రిజర్వేషన్లు అమలుచేస్తూ వచ్చారు. 2004లో సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌ను వర్తింపజేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, అమల్లోకి తీసుకువచ్చారు. అయితే దేశంలోని వివిధ రాష్ట్రాలు ఎవరికి వారు రిజర్వేషన్లను పెంచుతూ పోవడంతో.. అసలు బీసీలకు రిజర్వేషన్ ఎంత అన్నది తేల్చాలనే వాదనలు తలెత్తాయి. ఈ క్రమంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి మొత్తం 50 శాతం రిజర్వేషన్ మించకూడదని సుప్రీంకోర్టు ఆదేశించింది. కానీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధంగా వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ వర్తిస్తుండడడంతో బీసీలకు రిజర్వేషన్ శాతం తగ్గిపోయింది. దీంతో తమకు కూడా జనాభా దామాషా ప్రకారమే రిజర్వేషన్లను వర్తించాలనే డిమాండ్‌ను బీసీలు తెరపైకి తెచ్చారు.

ఓటర్ల జాబితాతో సర్వే ఇలా..

స్థానిక ఎన్నికలను కొత్త ఓటర్ల జాబితా ప్రకారం నిర్వహించాలంటే.. మొదట పంచాయతీరాజ్ శాఖ అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి సవరించిన ఓటర్ల జాబితాను తీసుకోవాల్సి ఉంటుంది. ఆ జాబితా ఆధారంగా గ్రామ, వార్డు, మండలాల వారీగా ఉన్న కులాల వివరాలను సేకరిస్తారు. ఈ ప్రక్రియలో ఇతర కులాలతోపాటు బీసీలు ఎంత మంది ఉన్నారు, ఇప్పటివరకు ఎంతమేర రాజకీయ ప్రాతినిధ్యం లభించిందనే విషయంతోపాటు రాజకీయంగా ఎంతమేర వెనుకబాటుతనానికి గురయ్యారనే వివరాలను కూడా సేకరిస్తారు. ఈ వివరాలన్నింటినీ క్రోడీకరించి బీసీ కమిషన్‌కు సమర్పిస్తారు. బీసీ కమిషన్ వాటిని పరిశీలించి బీసీలకు ఎంతమేర రిజర్వేషన్ కల్పించాలనే దానిపై ప్రభుత్వానికి సూచన చేస్తుంది. అయితే.. కమిషన్ ఎంత శాతాన్ని సూచించినా.. ప్రభుత్వం మాత్రం 50శాతం రిజర్వేషన్ నిబంధనకు లోబడే నడచుకోవాల్సి ఉంటుంది.

రిజర్వేషన్లు మారే అవకాశం..

ఓటర్ల జాబితా ప్రకారం నిర్వహించబోయే ఎన్నికల్లో ఈసారి గ్రామాలు, వార్డుల వారీగా రిజర్వేషన్లు మారే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. వాస్తవానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో పంచాయతీరాజ్ చట్టంలో చేసిన సవరణల ప్రకారం.. ప్రతి పదేళ్లకోసారి మాత్రమే రిజర్వేషన్లు మారుతాయి. కానీ, గత ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్ల విషయంలో హైకోర్టులో పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం ఈ మార్పులు చేస్తోంది. బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ రిజర్వేషన్లకు సంబంధించి కులసంఘాలు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలు నిర్వహిస్తోంది.

నగల కోసం కన్నవారిని చంపేసి..

» పెట్రోలు పోసి తగులబెట్టిన కుమారుడు

» 3 తులాల నగలివ్వాలని అడిగినా తల్లి నిరాకరణ

» గొంతు పిసికి హత్య చేసిన కొడుకు

» మెదక్ జిల్లా లో ఘోరం

హత్నూర/ నర్సాపూర్, జూన్ 14: మూడు తులాల బంగారం కోసం వృద్ధులైన తల్లిదండ్రులను గొంతు పిసికి చంపాడో వ్యక్తి! మృతదేహాలను ఎవ్వరూ గుర్తించకుండా ఉండేందుకు పెట్రోలు పోసి తగులబెట్టి.. కన్నవారు కనిపించడం లేదంటూ స్థానికులకు చెప్పుకొని ఏడ్చాడు! మెదక్ జిల్లా నర్సాపూర్ పరిధిలోని ఈ ఘోరం జరిగింది. ఈ మేరకు ఇటీవల వెలుగుచూసిన జంట హత్యల కేసును పోలీసులు ఛేదించారు. మృతులు సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సాదుల్లనగర్‌కు చెందిన దంపతులు చాకలి కిష్టయ్య (80), నర్సమ్మ (70). ఘటన తాలూకు వివరాలను పోలీసులు వెల్లడించకపోయినా కన్నకొడుకే వృద్ధ దంపతులను హత్యచేసినట్లు సమాచారం. కిష్టయ్య-నర్సమ్మ దంపతులకు నలుగురు సంతానంలో లక్ష్మణ్ ఆఖరివాడు. గుమ్మడిదల మండలం దోమడుగులో అద్దె ఇంట్లో ఉంటూ దగ్గర్లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. మే 13న ఎన్నికల పోలింగ్ కోసం ఓటు వేసేందుకు సొంతూరొచ్చాడు. ఆ మర్నాడు తల్లిదండ్రులను తన కారులో ఎక్కించుకొని దోమడుగు వెళ్లినట్లు గ్రామస్థుల ద్వారా తెలిసింది. అప్పటి నుంచి ఆ వృద్ధ దంపతులు మళ్లీ కనిపించలేదు. వాస్తవానికి లక్ష్మణ్‌కు ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో తల్లి నర్సమ్మను మెడలో ఉన్న మూడు తులాల బంగారు నగలు ఇవ్వాలని అడిగాడు. ఇందుకు ఆమె నిరాకరించింది. ఆ ఆభరణాలను ఎలాగైనా తీసుకోవాలని లక్ష్మణ్ పథకం వేసినట్లు తెలిసింది. తల్లిదండ్రులను తాను ఉంటున్న అద్దె ఇంట్లోనే గొంతు నులిమి చంపి, నర్సాపూర్ సమీపంలోని అడవిలోకి మృతదేహాలను తీసుకొచ్చినట్లు సమాచారం. అక్కడ మృతదేహాలపై పెట్రోల్‌పోసి తగలపెట్టినట్లు చెబుతున్నారు. మూడు రోజుల తర్వాత మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మరోవైపు లక్ష్మణ్ కొన్ని రోజులుగా తన తల్లిదండ్రులు కనిపించడం లేదంటూ చెబుతుండటంతో స్థానికులు అనుమానించి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, జరిగిన విషయాన్ని అంగీకరించినట్లు సమాచారం.

స్పోర్ట్స్

హైదరాబాద్ ● శనివారం 15 జూన్ 2024

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

దక్షిణాఫ్రికా × నేపాల్ (ఉ.5. గం.)
న్యూజిలాండ్ x ఉగాండా (ఉ.6. గం.)
భారత్ × కెనడా (రాత్రి 8. గం.)
నమీబియా × ఇంగ్లండ్ (రాత్రి 10.30. గం.)

పాక్ అవుట్

అమెరికా-ఐర్లాండ్ మ్యాచ్ వర్షంతో రద్దు
సూపర్-8కు ఆతిథ్య యూఎస్ఏ

ఫ్లోరిడా: టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్ కథ ముగిసింది. కారణం.. అమెరికా-ఐర్లాండ్ జట్ల మధ్య శుక్రవారం ఇక్కడ జరగాల్సిన గ్రూప్-ఎ మ్యాచ్ వర్షంతో రద్దవడం. దాంతో అమెరికా, ఐర్లాండ్‌కు చెరో పాయింట్ లభించింది. ఇక.. గ్రూపు నాలుగు మ్యాచ్‌లనూ పూర్తి చేసిన ఆతిథ్య అమెరికా జట్టు ఐదు పాయింట్లతో భారత్ (6) తర్వాత రెండో స్థానంలో నిలిచి సూపర్-8కి అర్హత సాధించింది. అరంగేట్రంలోనే సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్న అమెరికా జట్టు.. 2026లో జరిగే టీ20 ప్రపంచకప్‌నకు కూడా బెర్త్ దక్కించుకోవడం విశేషం. మరోవైపు మూడు మ్యాచ్‌ల ద్వారా రెండు పాయింట్లతోనే ఉన్న పాకిస్థాన్ ఆదివారం నాడు ఐర్లాండ్‌తో గ్రూపు ఆఖరి మ్యాచ్ ఆడాల్సి ఉంది. అందులో బాబర్ సేన గెలిచినా 4 పాయింట్లే ఉంటాయి. అలా.. గత టోర్నీ రన్నరప్ పాకిస్థాన్ ఈసారి అనూహ్యంగా లీగ్ దశ నుంచే నిష్క్రమించింది. ఒకవేళ.. ఐర్లాండ్‌తో శుక్రవారంనాటి మ్యాచ్ జరిగి..అమెరికా నెగ్గినా కూడా బాబర్‌సేన అవుటయ్యేది. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో అమెరికా ఓడిపోయుంటే అప్పుడు పాకిస్థాన్‌కు సూపర్-8 చాన్స్ మిగిలి ఉండేది. ఈ టోర్నీలో అమెరికాతో తన తొలి మ్యాచ్‌లో సూపర్ ఓవర్‌లో ఓడడమే పాకిస్థాన్‌కు పెద్ద షాక్. ఆపై..రెండో పోరులో భారత్ చేతిలోనూ ఓడిన పాకిస్థాన్, కెనడాపై నెగ్గి పాయింట్ల ఖాతా తెరిచింది. ఇప్పుడిక తనతోపాటు టోర్నీ నుంచి నిష్క్రమించిన ఐర్లాండ్‌తో పాక్ పోరు నామమాత్రమే.

పాయింట్ల పట్టిక — గ్రూప్-ఎ

జటు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	3	3	0	0	6	1.137
అమెరికా	4	2	1	1	5	0.127
పాకిస్థాన్	3	1	2	0	2	0.191
కెనడా	3	1	2	0	2	-0.493
ఐర్లాండ్	3	0	2	1	1	-1.712

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

విరాట్ ఫామ్‌లోకొచ్చేనా?

నేడు కెనడాతో భారత్ మ్యాచ్


కెనడా కెప్టెన్ జాఫర్



లాడర్‌హిల్ (ఫ్లోరిడా): వరుసగా మూడు మ్యాచ్‌లను న్యూయార్క్‌లో ఆడిన టీమిండియా ఇప్పుడు తమ వేదికను ఫ్లోరిడాకు మార్చింది. శనివారం ఇక్కడ కెనడాతో జరిగే మ్యాచ్‌లోనూ నెగ్గి గ్రూప్ 'ఎ'ను అజేయంగా ముగించాలనుకుంటోంది. ఆరు పాయింట్లతో ఉన్న రోహిత్ సేన ఇప్పటికే టీ20 వరల్డ్‌కప్ సూపర్-8లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. ఇరు జట్ల మధ్య టీ20ల్లో ఇదే తొలి మ్యాచ్ కాగా, కరీబియన్ టూర్‌కు ముందు దీన్ని వామప్‌గా వినియోగించుకోవాలనుకుంటోంది. అయితే ఈ మ్యాచ్ సజావుగా సాగాలంటే వరుణుడు కూడా సహకరించాల్సి ఉంది. కెనడా ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఐర్లాండ్‌పై మాత్రమే నెగ్గింది. ఈ టోర్నీలో అర్ధసెంచరీలు సాధించిన ఆరోన్ జాన్సన్, కిర్టన్, నవ్‌నీత్ ధళివాల్ బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. ఓవరాల్‌గా భారత జట్టు ఈ స్టేడియంలో ఆడిన ఎనిమిది టీ20ల్లో 5 విజయాలు, 2 ఓటములతో ఉంది. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు.

'కుల్చా'కు చాన్స్ దక్కేనా?

చివరి వరల్డ్‌కప్‌లో ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచిన విరాట్ కోహ్లీ ఈసారి ఓపెనర్‌గా 1,4,0 స్కోర్లతో పూర్తిగా నిరాశపరిచాడు. ఐపీఎల్‌లోనూ ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్న అతను న్యూయార్క్ పిచ్‌పై కనీసం పది బంతులైనా ఆడలేకపోయాడు. అయితే కెనడాపై విరాట్‌కు చక్కటి మ్యాచ్ ప్రాక్టీస్ దక్కితే కరీబియన్ దీవులకు ఆత్మవిశ్వాసంతో వెళ్లగలుగుతాడు. కానీ స్థానిక మైదానంలోనూ కోహ్లీకి పేలవ రికార్డే ఉంది. ఒకవేళ విరాట్‌ను వన్‌డౌన్‌లో ఆడిస్తే ఓపెనర్‌గా జైస్వాల్‌కు స్థానం దక్కుతుంది. అప్పుడు మిడిలార్డర్‌లో శివమ్ దూబేపై వేటు తప్పదు. విండీస్ పిచ్‌లు స్పిన్‌కు అనుకూలించే చాన్స్ ఉండడంతో కుల్చా (కుల్దీప్, చాహల్) జోడీని ఆడించే అవకాశం లేకపోలేదు. సూపర్-8కు ముందు వారికి ప్రాక్టీస్ లభించాలని జట్టు భావిస్తోంది. అదే జరిగితే జడేజా, అక్షర్‌లకు విశ్రాంతి తప్పదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్, పంత్, సూర్యకుమార్, దూబే, హార్దిక్, జడేజా/చాహల్, అక్షర్/కుల్దీప్, బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్.

కెనడా: జాన్సన్, నవ్‌నీత్, పర్గత్ సింగ్, కిర్టన్, శ్రేయాస్, రవీందర్‌పాల్, సాద్ బిన్ జాఫర్ (కెప్టెన్), హేలిగర్, కలీమ్ సన, జునైద్ సిద్దిఖి, గార్డన్.

పిచ్, వాతావరణం

ప్రస్తుతం ఫ్లోరిడాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం భారత జట్టు నెట్ సెషన్ కూడా రద్దయ్యింది. మ్యాచ్‌కు కూడా ఆటంకం కలిగే అవకాశం ఉంది. దీంతో ఓవర్లు కుదించడమో లేక రద్దవడమో జరగవచ్చు. ఇక్కడి పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించనుంది. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

అఫ్ఘాన్ అదరహో

- తొలిసారి సూపర్-8లో ప్రవేశం
- పపువా న్యూగినీపై విజయం
- న్యూజిలాండ్ నిష్క్రమణ


ఫరూఖీ (3/16)

టరౌబా (ట్రినిడాడ్): అజేయ ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న అఫ్ఘానిస్థాన్ టీ20 వరల్డ్‌కప్‌లో తొలిసారి సూపర్-8లో ప్రవేశించింది. ఎప్పటిలాగే బౌలర్లు చెలరేగడంతో శుక్రవారం పపువా న్యూగినీతో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం అందుకుంది. రషీద్ సేనకిది వరుసగా మూడో గెలుపు. అలాగే ఇప్పటి వరకు అఫ్ఘాన్‌పై ప్రత్యర్థి జట్లు వంద పరుగుల్లోపే ఆలౌట్ కావడం విశేషం. మరోవైపు వీరి విజయంతో అటు పాయింట్ల ఖాతా తెరవని న్యూజిలాండ్ గ్రూప్ 'సి' నుంచి అధికారికంగా నిష్క్రమించింది. వెస్టిండీస్ ఇప్పటికే సూపర్-8లోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. ఇక ఈ రెండు జట్ల మధ్య మంగళవారం జరిగే ఆఖరి మ్యాచ్ ద్వారా గ్రూప్ టాపర్ ఎవరో తేలుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పీఎన్‌జీ బ్యాటర్లు కనీస ప్రదర్శన కూడా చేయలేకపోయారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ పేసర్ ఫజల్‌హక్ ఫరూఖి (3/16), నవీన్ ఉల్ హక్ (2/4)ల ధాటికి 19.5 ఓవర్లలో 95 పరుగులకు ఆలౌటైంది. అయితే ఈ స్కోరులో 25 పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో రావడం గమనార్హం. కిప్లిన్ డోరిగ (27), నవో (13), ఉరా (11) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో అఫ్ఘాన్ 15.1 ఓవర్లలో 3 వికెట్లకు 101 పరుగులు చేసి నెగ్గింది. తొలిసారి ఓపెనర్లు గుర్బాజ్ (11), జద్రాన్ (0) విఫలం కావడంతో గుల్బదిన్ నయిబ్ (49 నాటౌట్) జట్టును విజయం వైపు నడిపించాడు. ఆఖర్లో నబీ (16 నాటౌట్) సహకారం అందించడంతో మరో 29 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

పీఎన్‌జీ: 19.5 ఓవర్లలో 95 ఆలౌట్ (కిప్లిన్ 27, ఎలీ నవో 13; ఫరూఖి 3/16, నవీనుల్ 2/4). **అఫ్ఘానిస్థాన్:** 15.1 ఓవర్లలో 101/3 (నయిబ్ 49 నాటౌట్, నబీ 16 నాటౌట్; సెమో కమీ 1/16).

పాయింట్ల పట్టిక — గ్రూప్-సి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
అఫ్ఘానిస్థాన్	3	3	0	0	6	4.230
వెస్టిండీస్	3	3	0	0	6	2.596
ఉగాండా	3	1	2	0	2	-4.217
పీఎన్‌జీ	3	0	3	0	0	-0.886
న్యూజిలాండ్	2	0	2	0	0	-2.425

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

ప్రణయ్, సిక్కి జోడీ ఓటమి

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్, మిక్స్‌డ్ విభాగంలో సిక్కి-సుమిత్ రెడ్డి జోడీ ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు. వరల్డ్ నెంబర్ 10, ప్రణయ్ 19-21, 13-21తో జపాన్ షట్లర్ కొడై నారోకా చేతిలో, సమీర్ వర్మ 12-21, 13-21తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలయ్యారు. మిక్స్‌డ్ క్వార్టర్స్‌లో సిక్కి-సుమిత్ ద్వయం 12-21, 14-21తో చైనాకు చెందిన టాప్‌సీడ్ ద్వయం జియాన్-వీ య జిన్ (చైనా) చేతిలో ఓటమిపాలైంది. కాగా, మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ 17-21, 12-21తో యు పొ పై (చైనీస్ తైపీ) చేతిలో ఓడింది.

గెలిచి నిలిచారు

సూపర్-8 రేసులో ఇంగ్లండ్ ● 8 వికెట్లతో ఒమన్ చిత్తు


ఆదిల్ రషీద్ (4/11)

నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): కీలక మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ చెలరేగింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆదిల్ రషీద్ (4/11)కు పేసర్లు ఆర్చర్, ఉడ్ తోడవడంతో గురువారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో పసికూన ఒమన్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఒమన్ ప్రత్యర్థి బౌలర్ల ధాటికి తాళలేక 13.2 ఓవర్లలో 47 పరుగులకే చేతులెత్తేసింది. షోయబ్ ఖాన్ (11) మినహా మరే బ్యాటరూ రెండంకెల స్కోరుకు చేరలేదు. ఆర్చర్, ఉడ్ చెరో మూడు వికెట్లు సాధించారు. అనంతరం స్వల్ప ఛేదనను కేవలం 3.1 ఓవర్లలోనే 50/2తో ఛేదించిన ఇంగ్లండ్ భారీ విజయం అందుకుంది. ఈ గెలుపుతో ఇంగ్లండ్ మూడు పాయింట్లతో గ్రూపులో మూడో స్థానానికి చేరింది. ఇప్పటికే సూపర్-8కి అర్హత సాధించిన ఆస్ట్రేలియా (6), స్కాట్లాండ్ (5) మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు ఇంగ్లండ్ రన్‌రేట్ -1.800. భారీ విజయం దరిమిలా అది +3.081కి చేరింది. రన్‌రేట్‌లో స్కాట్లాండ్ (+2.164) కంటే ఎంతో ముందంజలో నిలిచింది. స్కాట్లాండ్ తదుపరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను ఢీకొననుంది. కాగా..స్కాట్లాండ్‌తో తొలి మ్యాచ్ వర్షంతో రద్దవడంతో ఇంగ్లండ్‌కు ఒకటే పాయింట్ లభించింది. అనంతరం ఆస్ట్రేలియా చేతిలో 36 పరుగులతో ఓటమి చవిచూడడంతో డిఫెండింగ్ చాంపియన్ సూపర్-8 అవకాశాలు ప్రమాదంలో పడ్డాయి. ఈ నేపథ్యంలో ఒమన్‌తో మ్యాచ్‌ను తప్పనిసరిగా అదీ..భారీ తేడాతో నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసిన బట్లర్ సేన..తదుపరి రౌండ్ అవకాశాలను సజీవంగా ఉంచుకోగలిగింది.

సంక్షిప్తస్కోర్లు: ఒమన్: 13.2 ఓవర్లలో 47 ఆలౌట్ (షోయబ్ ఖాన్ 11, కశ్యప్ ప్రజాపతి 9, ఆదిల్ రషీద్ 4/11, ఆర్చర్ 3/12, మార్క్ ఉడ్ 3/12).
ఇంగ్లండ్: 3.1 ఓవర్లలో 50/2 (బట్లర్ 24 నాటౌట్, సాల్ట్ 12).

పాయింట్ల పట్టిక — గ్రూప్-బి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
ఆస్ట్రేలియా	3	3	0	0	6	3.580
స్కాట్లాండ్	3	2	0	1	5	2.164
ఇంగ్లండ్	3	1	1	1	3	3.081
నమీబియా	3	1	2	0	2	-2.098
ఒమన్	4	0	4	0	0	-3.062

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు


న్యూయార్క్‌లోని బీచ్‌లో కుమార్తె సమైరాతో రోహిత్..

సెమీస్‌లో సుమిత్



పెరూగియా (ఇటలీ): భారత ఆటగాడు సుమిత్ నగల్ వరుసగా రెండోవారం టైటిల్ సాధించే దిశగా దూసుకెళ్తున్నాడు. గతవారం జర్మనీలో ఏటీపీ చాలెంజర్ నెగ్గిన సుమిత్.. తాజాగా పెరూగియా చాలెంజర్ ఈవెంట్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఆరోసీడ్ సుమిత్ 6-4, 7-5తో పోలెండ్‌కు చెందిన మాక్స్ కస్నికోవిస్కీపై విజయం సాధించాడు. నగల్‌కిది వరుసగా ఎనిమిదో విజయం కావడం విశేషం. బెర్నాబె (స్పెయిన్), రెండో సీడ్ లాస్లో జెరె (సెర్బియా) మధ్య జరిగే క్వార్టర్స్ విజేతతో సుమిత్ సెమీస్‌లో తలపడనున్నాడు.

ఎగుమతుల్లో 9% వృద్ధి

మే నెలలో రూ.3.28 లక్షల కోట్లుగా నమోదు
ఏడు నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు



న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక అస్థిరతల మధ్యన కూడా ఎగుమతుల రంగం మే నెలలో 9.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. ప్రధాన గమ్యాలైన అమెరికా, నెదర్లాండ్స్, యూఏఈ, మలేషియా, బ్రిటన్‌లకు ఎగుమతుల్లో ఆరోగ్యవంతమైన వృద్ధి నమోదైంది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం మే నెల ఎగుమతులు 3,813 కోట్ల డాలర్లుగా (రూ.3.28 లక్షల కోట్లు) నమోదు కాగా వాణిజ్య లోటు ఏడు నెలల గరిష్ఠ స్థాయి 2,378 కోట్ల డాలర్లకు (రూ.2.05 లక్షల కోట్లు) దూసుకుపోయింది. గత ఏడాది అక్టోబరులో నమోదైన 3,146 కోట్ల డాలర్ల తర్వాత (రూ.3.22 లక్షల కోట్లు) వాణిజ్య లోటు ఈ స్థాయికి చేరడం ఇదే ప్రథమం.

ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, ప్లాస్టిక్స్ రంగాలు మే నెలలో ఎగుమతుల వృద్ధికి ప్రధాన చోదకంగా నిలిచాయి. మే నెలలో దిగుమతులు 7.7 శాతం పెరిగి 6,191 కోట్ల డాలర్లకు (రూ.5.32 లక్షల కోట్లు) చేరాయి. క్రూడాయిల్ ఎగుమతులు 28 శాతం పెరిగి 2,000 కోట్ల డాలర్లకు (రూ.1.72 లక్షల కోట్లు) చేరడం మే నెలలో దిగుమతులు దూసుకుపోవడానికి కారణమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే రెండు నెలల్లోనూ కలిపి క్రూడాయిల్ ఎగుమతులు 24.4 శాతం పెరిగి 3,604 కోట్ల డాలర్లుగా (రూ.3.10 లక్షల కోట్లు) నమోదు కాగా మొత్తం ఎగుమతులు 5.1 శాతం వృద్ధితో 7,312 కోట్ల డాలర్లకు (రూ.4.97 లక్షల కోట్లు) చేరాయి.

ఈ రెండు నెలల్లో దిగుమతులు కూడా 8.89 శాతం పెరిగి 11,600 కోట్ల డాలర్లుగా (రూ.9.98 లక్షల కోట్లు) నమోదయ్యాయి. ఎగుమతుల రంగానికి మే నెల అద్భుతంగా ఉన్నదని, రాబోయే నెలల్లో కూడా ఇదే ధోరణి కొనసాగుతుందని భావిస్తున్నామని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భర్త్వాల్ అన్నారు.

- బంగారం దిగుమతులు స్వల్పంగా తగ్గాయి. గత ఏడాది మే నెలతో పోల్చితే 369 కోట్ల డాలర్ల (రూ.31,734 కోట్లు) నుంచి 333 కోట్ల డాలర్లకు (రూ.28,638 కోట్లు) దిగివచ్చాయి.
- సేవల ఎగుమతులు మే నెలలో 3016 కోట్ల డాలర్లుగా (రూ.2.59 లక్షల కోట్లు), దిగుమతులు 1728 కోట్ల డాలర్లుగా (రూ.1.49 లక్షల కోట్లు) నమోదయ్యాయి.

15 నెలల గరిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

మే నెలలో టోకు ద్రవ్యోల్బణం 15 నెలల గరిష్ఠ స్థాయి 2.61 శాతానికి దూసుకుపోయింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వడగాడ్పుల కారణంగా ఆహార వస్తువుల ధరలు ప్రత్యేకించి కూరగాయల ధరలు, తయారీ వస్తువుల ధరలు పెరగడం ఇందుకు దోహదకారి అయింది. ఈ ద్రవ్యోల్బణం గత మూడు నెలలుగా పెరుగుతూ వస్తోంది. గత ఏడాది ఫిబ్రవరిలో నమోదైన 3.85 శాతం తర్వాత టోకు ద్రవ్యోల్బణం ఈ స్థాయికి చేరడం ఇదే ప్రథమం. మే నెలలో ఆహార వస్తువుల ధరలు 9.82 శాతం మేరకు దూసుకుపోయాయి. కూరగాయల ధరలు 32.42 శాతం, ఉల్లి ధరలు 58.05 శాతం, బంగాళాదుంప ధరలు 64.05 శాతం పెరిగాయి.

బిజినెస్

డిజిటల్ లెండింగ్‌పై ఎస్‌బీఐ దృష్టి

ఐదు రోజుల్లో రుణం మంజూరు

ముంబై: టెక్నాలజీ రంగంలోనూ ప్రభుత్వ రంగంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) దూసుకుపోతోంది. చిన్న వ్యాపారాలకు డిజిటల్ పద్ధతిలో రుణాలు మంజూరు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. గత ఏడాది డిసెంబరులో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ పథకం విజయవంతమైందని బ్యాంక్ డిప్యూటీ ఎండీ సురేంద్ర రాణా తెలిపారు. ఈ పద్ధతిలో ఇప్పటి వరకు 20,000 మందికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రుణాలు మంజూరు చేసినట్టు వెల్లడించారు. ఈ పద్ధతిలో రుణ గ్రహీత బ్యాంకుకు రాకుండా తన ఇంటి నుంచే బ్యాంకు పంపించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత బ్యాంకు అందుబాటులో ఉన్న కొన్ని వివరాల ఆధారంగా ఐదు రోజుల్లో రుణం మంజూరు చేస్తుందని రాణా చెప్పారు. ఈ పథకం విజయవంతం కావడంతో రుణ పరిమితిని రూ.5 కోట్లకు పెంచబోతున్నట్టు తెలిపారు.

4 నెలల తర్వాత రూ.3,000 కోట్ల
'పెన్నా' అప్పు చెల్లింపు

అంబుజా సిమెంట్

న్యూఢిల్లీ: పెన్నా సిమెంట్‌కు ఉన్న రూ.3,000 కోట్ల అప్పుల చెల్లింపుపై అంబుజా సిమెంట్ దృష్టి పెట్టింది. వచ్చే 3-4 నెలల్లో పెన్నా సిమెంట్ కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసి, ఈ అప్పు తీర్చేయాలని అదానీ గ్రూప్ సిమెంట్ కంపెనీ అంబుజా సిమెంట్ భావిస్తున్నట్టు సమాచారం. తద్వారా పెన్నా సిమెంట్‌పై వడ్డీ చెల్లింపుల భారం తగ్గుతుంది. దీనికి తోడు పెన్నా సిమెంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదిలోగా ప్రస్తుత 1.4 కోట్ల టన్నుల నుంచి 1.7 కోట్ల టన్నులకు విస్తరించాలని యోచిస్తోంది.

డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో జర జాగ్రత్త

ఇన్వెస్టర్లను హెచ్చరించిన ఎన్ఎస్ఈ చీఫ్ చౌహాన్



న్యూఢిల్లీ: ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) డెరివేటివ్స్ కాంట్రాక్టుల్లో ట్రేడింగ్‌పై రిటైల్ మదుపరులను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ హెచ్చరించారు. రిటైల్ ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్ల ద్వారా ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టడం మేలని ఆయన సూచించారు. డెరివేటివ్స్‌లో ట్రేడింగ్‌పై అవగాహన కలిగి, మార్కెట్‌ను అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే ఇందుకు పరిమితం కావాలని శుక్రవారం ఓ కార్యక్రమంలో ఆయన అభిప్రాయపడ్డారు. డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు గణనీయంగా పెరగడంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్‌తో పాటు సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ సైతం ఈ మధ్య ఆందోళన వ్యక్తం చేశారు. 2019 మార్చిలో రూ.217 లక్షల కోట్ల స్థాయిలో నమోదైన నెలవారీ ఎఫ్ అండ్ ఓ టర్నోవర్.. ఈ మార్చిలో రూ.8,740 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంది. గడిచిన కొన్నేళ్లలో డెరివేటివ్స్ ట్రేడింగ్‌కు పెరిగిన ప్రాచుర్యానికిదే ప్రత్యక్ష ఉదాహరణ.

హ్యుండయ్ రూ.25,000 కోట్ల ఐపీఓ!

దేశ చరిత్రలో ఇదే అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్

న్యూఢిల్లీ: దక్షిణ కొరియా కార్ల తయారీ దిగ్గజం హ్యుండయ్‌కు చెందిన భారత అనుబంధ విభాగం హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి కంపెనీ నేడో రేపో ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఐపీఓ ద్వారా హ్యుండయ్ కనీసం 300 కోట్ల డాలర్లు (సుమారు రూ.25,000 కోట్లు) సమీకరించే అవకాశం ఉంది. అదే గనుక జరిగితే, దేశంలో ఇదే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ కానుంది. గతంలో ఐపీఓ ద్వారా ఎల్ఐసీ సమీకరించిన రూ.21,000 కోట్ల మొత్తాన్ని మించిపోనుంది. అంతేకాదు, రెండు దశాబ్దాలకు పైగా కాలంలో ఐపీఓకు రాబోతున్న కార్ల కంపెనీ కూడా ఇదే. చివరగా, 2003లో మారుతి సుజుకీ ఇండియా పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ఐపీఓలో భాగంగా హ్యుండయ్ 15-20 శాతం వాటా విక్రయం ద్వారా 330-560 కోట్ల డాలర్ల మేర నిధులు సమీకరించవచ్చని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. హ్యుండయ్ మోటార్ భారత కార్యకలాపాలను 1996లో ప్రారంభించింది.

ప్రస్తుతం ఈ కంపెనీ అన్ని సెగ్మెంట్లలో కలిపి మొత్తం 13 మోడళ్లను దేశీయ మార్కెట్లో విక్రయిస్తోంది. గత నెలలో కంపెనీ మొత్తం విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 7 శాతం వృద్ధితో 63,551 యూనిట్లకు పెరిగాయి. అందులో దేశీయంగా విక్రయాలు 1 శాతం పెరుగుదలతో 49,151 యూనిట్లుగా, ఎగుమతులు 31 శాతం వృద్ధితో 14,400 యూనిట్లుగా నమోదయ్యాయి.

- బజాజ్ ఫైనాన్స్ అనుబంధ విభాగమైన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు వచ్చేందుకు సెబీకి శుక్రవారం డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. ఐపీఓ ద్వారా సంస్థ రూ.7,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.
- లగ్జరీ ఫర్నీచర్ బ్రాండ్ స్టాన్లీ లైఫ్‌స్టైల్స్ ఐపీఓ ఈ నెల 21న ప్రారంభమై 25న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణిని కంపెనీ రూ.351-369గా నిర్ణయించింది. తద్వారా సంస్థ రూ.537 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.

కొనసాగిన రికార్డుల ర్యాలీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో వరుసగా మూడో రోజూ రికార్డుల ర్యాలీ కొనసాగింది. మే నెల ఎగుమతుల గణాంకాలు ఆశాజనకంగా ఉండటంతో పాటు మార్కెట్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. కానీ, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ మార్కెట్ లాభాలను పరిమితం చేసింది. సెన్సెక్స్ ఒక దశలో 270.4 పాయింట్ల వరకు పెరిగి 77,081 స్థాయికి చేరినప్పటికీ, శుక్రవారం ట్రేడింగ్ నిలిచేసరికి 181.87 పాయింట్ల వృద్ధితో 76,992.77 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయి. కాగా, నిఫ్టీ ఒక దశలో 91.5 పాయింట్లు ఎగబాకి 23,490.40 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 66.70 పాయింట్ల లాభంతో 23,465.60 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.93 లక్షల కోట్లు పెరిగి సరికొత్త ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ.434.88 లక్షల కోట్లకు (5.21 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

ఫారెక్స్ నిల్వల్లో కొత్త రికార్డు: భారత విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి పెరిగాయి. ఈ నెల 7తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు 430.7 కోట్ల డాలర్ల వృద్ధితో 65,581.7 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ నిల్వలు 483 కోట్ల డాలర్లకు పైగా పెరిగాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,890 ▼	65,900 ▼	95,000 ▼
ముంబై	71,866 ▲	65,829 ▲	87,833 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	500
వరంగల్	512	గోదావరి	490
చిత్తూరు	593	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	139	విజయవాడ	145
వరంగల్	139	గుంటూరు	145
కరీంనగర్	139	ఒంగోలు	145
మహబూబ్‌నగర్	139	చిత్తూరు	150
కర్నూలు	139	నెల్లూరు	150
విశాఖపట్నం	136	అనంతపురం	145
గోదావరి	145		

'పెట్రో డాలర్'కు సౌదీ కటీఫ్

రియాద్: పెట్రో డాలర్లకు సంబంధించి సౌదీ అరేబియా కీలక నిర్ణయం తీసుకుంది. యాభై ఏళ్ల క్రితం (08-6-1974) దీనికి సంబంధించి అమెరికాతో కుదిరిన ఒప్పందానికి కటీఫ్ చెప్పింది. ఈ ఒప్పందం కారణంగా గత యాభై సంవత్సరాలుగా సౌదీ అరేబియా తన చమురు, చమురు ఉత్పత్తుల చెల్లింపులను అమెరికా డాలర్లలోనే అనుమతిస్తోంది. ఇందుకు ప్రతిగా అమెరికా.. సౌదీ అరేబియా ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు లేకుండా కాపాడుతోంది. తాజా నిర్ణయంతో దీనికి తెరపడనుంది. ఇక యూరో, జపాన్ యెన్, యువాన్ వంటి కరెన్సీలను కూడా సౌదీ అరేబియా అనుమతించే అవకాశం ఉంది. దీంతో అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికా డాలర్ ఆధిపత్యానికి తెరపడుతుందని భావిస్తున్నారు. అంతేగాక ప్రధాన కరెన్సీలతో అమెరికా డాలర్ మారకం రేటు తగ్గి, అమెరికాలో వడ్డీ రేట్లు మరింత పెరిగే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి.

వివో ఇండియాలో టాటాకు మెజారిటీ వాటా!

న్యూఢిల్లీ: చైనా స్మార్ట్‌ఫోన్ కంపెనీ వివో భారత అనుబంధ విభాగమైన వివో ఇండియాలో మెజారిటీ వాటా కొనుగోలుకు టాటా గ్రూప్ ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి ఇరువర్గాల మధ్య చర్చలు పురోగతిలో ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే, టాటా గ్రూప్ ఆఫర్ చేస్తున్న దానికి మించిన మార్కెట్ విలువను వివో ఆశిస్తున్నదని, ఈ విషయంలో ఇరువర్గాలు అంగీకారానికి వస్తే డీల్ ఖరారైనట్లేనని వారు పేర్కొన్నారు. విదేశీ ఎలక్ట్రానిక్ కంపెనీలు, ముఖ్యంగా చైనా సంస్థలు తమ భారత తయారీ, పంపిణీ కార్యకలాపాల్లో దేశీయ కంపెనీలను జత చేసుకోవాలని ప్రభుత్వం కోరుతున్న నేపథ్యంలో వివో ఇండియా స్థానిక భాగస్వామి కోసం అన్వేషిస్తోంది. కాగా, వివో ఇండియాకు గ్రేటర్ నోయిడాలో ఉన్న మొబైల్ ప్లాంట్‌ను భగవతి ప్రొడక్ట్స్ (మైక్రోమ్యాక్స్) టేకోవర్ చేసింది. త్వరలోనే వివో కోసం ఈ ప్లాంట్ నుంచి మొబైళ్లను తయారు చేయనుంది. వివో సహా పలు చైనా స్మార్ట్‌ఫోన్ కంపెనీలు భారత్‌లో కస్టమ్స్ డ్యూటీ, పన్ను ఎగవేతలు, మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వ అధికారులు ఇప్పటికే చైనా మొబైల్ కంపెనీల కార్యాలయాలు, ఉన్నతాధికారుల ప్రాంతాల్లో పలు దఫాల్లో తనిఖీలు నిర్వహించడంతో పాటు కేసులు కూడా నమోదు చేశారు. చైనా సంస్థల ఆర్థిక అక్రమాలకు చెక్ పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం స్థానిక భాగస్వామిని చేర్చుకోవాలని కోరుతున్నది.

ఆరోగ్య బీమాలోకి ప్రవేశించే
ప్రతిపాదనేం లేదు

ఎల్ఐసీ

ముంబై: ఆరోగ్య బీమా విభాగంలోకి ప్రవేశించే ప్రతిపాదనేం లేదని ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ శుక్రవారం వెల్లడించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. జీవిత బీమా కంపెనీలు ఆరోగ్య పాలసీలను విక్రయించడానికి వీల్లేదు. కేవలం సాధారణ బీమా లేదా ఆరోగ్య బీమా సంస్థలకు మాత్రమే ఇందుకు అనుమతి ఉంది. కాగా, కంపెనీ ఆర్యోగ బీమా సేవల్లోకి ప్రవేశించనుందన్న అంచనాలతో ఎల్ఐసీ షేరు శుక్రవారం 6.51 శాతం ఎగబాకి రూ.1,067 స్థాయికి చేరుకుంది.

రైతు బంధుకు అర్హతపై అందరితో చర్చిస్తాం

» ఆ తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటాం: తుమ్మల

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 14: రైతు బంధు.. రైతు బీమా.. పంటల బీమా.. రుణమాఫీ అమలుపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.. పంటలు వేయని వాళ్లకూ రైతుబంధును ఇవ్వడం వలన వాస్తవ రైతులు కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతు సంఘాలు, ప్రతినిధులు అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు. ఇప్పటి వరకు పాత పద్ధతిలోనే రైతు బంధు నిధులను రూ.7,500కోట్లు అందించాం. రైతుబంధుకు అర్హతపై రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులతో చర్చించి విధివిధానాలను నిర్ణయించాల్సి ఉంది" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం జరిగిన ఖమ్మం జిల్లా పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు ఉన్న ఇబ్బందులు, కష్టాలు తనకు తెలుసన్నారు. ఈ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల కొరత లేకుండా.. కల్తీ లేనివి విక్రయించేలా కంపెనీలతో మాట్లాడి ఒప్పందం చేసుకున్నామన్నారు. రైతుబంధు కింద సొమ్మును సీజన్‌కు ముందే ఇవ్వాలన్న అంశంపై విధివిధానాలను ఖరారు చేయనున్నట్లు తెలిపారు.

పొలంలో బ్యాంకు ఫ్లెక్సీపై తుమ్మల ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రుణ బకాయిలు ఉన్న రైతు పొలంలో బ్యాంకు అధికారులు ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంపై వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా లింగంపేట గ్రామంలో ఓ రైతు పొలంలో డీసీసీ బ్యాంకు అధికారులు ఫ్లెక్సీని కట్టడంపై మంత్రి శుక్రవారం బ్యాంకు అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సదరు రైతుకు 2010లో దీర్ఘకాలిక రుణం మంజూరు చేశామని, 9 సంవత్సరాల గడువు పూర్తయినప్పటికీ రుణం చెల్లించలేదని వారు మంత్రికి చెప్పారు. పైగా బ్యాంకుకు తనఖా పెట్టిన భూమిని ఇతరులకు విక్రయిస్తున్నాడని, అందుకోసమే పొలంలో ఫ్లెక్సీని ఏర్పాటు చేయవలసి వచ్చిందని వివరించారు. స్పందించిన మంత్రి రుణ చెల్లింపులకు సంబంధించి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసే పద్ధతులను తమ ప్రభుత్వం ఉపేక్షించబోదని అధికారులకు స్పష్టం చేశారు.

పాడి రైతుల సమస్యలు పరిష్కరించండి..

» ప్రజావాణిలో విజయ డెయిరీ పరిరక్షణ సమితి వినతి

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ విజయ డెయిరీ పరిరక్షణ సమితి శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందించింది. గత ప్రభుత్వం 2020 జనవరి నుంచి పాడి రైతులకు నాలుగు ఇన్సెంటివ్ బకాయిలు ఇవ్వలేదని, 2023 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు పాల బిల్లులు కూడా అందించలేదని సమితి కన్వీనర్ సాదం రమేశ్ తెలిపారు. పాడి పశువులకు ఇన్సూరెన్స్ పథకం కూడా అమలు కావడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు 2లక్షల మంది పాడిపైనే ఆధారపడి ఉన్నారని ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

ఆరుగురుకి డిప్యూటీ సెక్రటరీలుగా పదోన్నతి

హైదరాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఆరుగురు సహాయ కార్యదర్శులకు ప్రభుత్వం డిప్యూటీ సెక్రటరీలుగా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం జీవోను జారీ చేశారు. పదోన్నతులు పొందిన ఈ ఆరుగురికి పోస్టింగులు ఇచ్చారు. వారిలో ఆర్.శోభన్‌బాబుకు పురపాలక, పట్టణాభివృద్ధి, ఇ.రాజేంద్రప్రసాద్‌కు విద్య, ఎస్.లక్ష్మీబాయికి గిరిజన సంక్షేమం, ఎస్.సత్యనారాయణకు మహిళా శిశు సంక్షేమ, ఎ.కల్యాణికి పురపాలక, పట్టణాభివృద్ధి, ఆర్.శ్రీనివాస్‌కు రవాణా, రోడ్లు-భవనాల శాఖలలో డిప్యూటీ సెక్రటరీలుగా వెళ్లనున్నారు. వీరంతా 15 రోజుల్లోగా తమ పోస్టుల్లో చేరాలని ఆదేశించారు. ఒకవేళ 15 రోజుల్లో చేరకపోతే... వారి నియామకం, పదోన్నతి రద్దవుతుందని హెచ్చరించారు.

నేటిలోగా బడ్జెట్ ప్రతిపాదనలు పంపాలి

» అన్ని శాఖలకు ఆర్థిక శాఖ ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) సంబంధించిన పూర్తి స్థాయి బడ్జెట్ ప్రతిపాదనలు పంపాలని అన్ని శాఖలను రాష్ట్ర ఆర్థిక శాఖ ఆదేశించింది. ప్రగతి, నిర్వహణ పద్దుల కింద ఎంత మేర నిధుల ఆవశ్యకత ఉంది? ఏ శాఖ కింద ఏ పథకాలున్నాయి? వాటికయ్యే అంచనా వ్యయాలు ఎంత? వంటి వివరాలు పంపాలని తెలిపింది. శనివారం సాయంత్రం 5గంటల్లోగా తమ ముఖ్యకార్యదర్శులకు ఆన్‌లైన్‌లో ఈ ప్రతిపాదనలు పంపాలని ఆదేశించింది. అలాగే, రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ తదితర సిబ్బంది వివరాలు, ఖాళీల సమాచారాన్ని పంపాలని సూచించింది.

రమ్మీ, పేకాట నిషేధం చట్ట సవరణను కొట్టేయండి

» ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్ పిటిషన్

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రమ్మీ, 13 కార్డ్స్, పేకాట, కార్డ్ రూం నిర్వహణను నిషేధిస్తూ తెలంగాణ గేమింగ్ యాక్ట్‌కు చేసిన సవరణలను కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎమ్మెల్యేస్ కాలనీ రెసిడెంట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, ఎమ్మెల్యేస్ కాలనీ రిక్రియేషన్ సెంటర్ సంస్థల కార్యదర్శి రామచంద్రారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ గేమింగ్ యాక్ట్ - 1974 (యాక్ట్ 29 ఆఫ్ 2017) పలు సెక్షన్లకు చేసిన సవరణలతోపాటు సెక్షన్ 15కు పూర్తిస్థాయి సవరణలు చేయడాన్ని కొట్టేయాలని కోరారు. ఆర్టికల్ 348 (3)కి విరుద్ధంగా తెలంగాణ గేమింగ్ యాక్ట్‌ను అమలు చేస్తున్నారని.. సదరు చట్టానికి చేసిన సవరణల వల్ల కార్డ్స్ రూం నిర్వహించుకోలేకపోతున్నామని పేర్కొన్నారు. సదరు చట్టాన్ని చూపించి పిటిషనర్ సంస్థల వ్యవహారాల్లో పోలీసుల జోక్యం చేసుకోవడాన్ని అడ్డుకోవాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం..ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని పేర్కొంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), హోంశాఖ, డీజీపీ, పోలీస్ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగువారాలకు వాయిదా పడింది.

ఐఎంజీకి భూముల కేసులో నా వాదన వినండి

» మాజీ మంత్రి పి.రాములు ఇంప్లీడ్ పిటిషన్

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ ప్రభుత్వంలో ఐఎంజీ భారత్ అకాడమీస్‌కు 850 ఎకరాల భూకేటాయింపు వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని, భూకేటాయింపులో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాల్లో తన వాదన కూడా వినాలని 1999-2004 వరకు క్రీడాశాఖ మంత్రిగా ఉన్న పోతుగంటి రాములు హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇదే వ్యవహారంపై దర్యాప్తు చేయించాలని దివంగత నేత పాల్వాయి గోవర్ధన్ రెడ్డి సహా పలువురు దిగువ కోర్టులో ప్రైవేట్ కంప్లైంట్ దాఖలు చేశారని.. వాటిని దిగువ కోర్టు కొట్టేసిందని పిటిషన్‌లో ఆయన గుర్తు చేశారు. అలాగే ఐఎంజీ భారత్‌కు భూకేటాయింపుపై ఇదే హైకోర్టు విచారణ చేపట్టిందని.. భూకేటాయింపు రద్దుకు తర్వాత ఏర్పడిన ప్రభుత్వం చేసిన చట్టాన్ని సమర్థించిందని తెలిపారు. 2002-03 నాటి వ్యవహారంపై ఇప్పుడు సీబీఐ ఎంక్వైరీ కోరడం.. ఇప్పటికే కోర్టు నిర్ణయం తీసుకున్నప్పటికీ మళ్లీ దర్యాప్తు కోరడం చట్టపరమైన ప్రక్రియను అపహాస్యం చేయడమేనని తెలిపారు. అప్పటి క్రీడాశాఖ మంత్రిగా ఉన్న తన వాదన వినకుండా ఎలాంటి ఆదేశాలు జారీ చేయరాదని కోరారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రజాప్రయోజన వ్యాజ్యం, ఇంప్లీడ్ పిటిషన్ అన్నింటిపై సమగ్ర విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు విచారణను జూలై 2కు వాయిదా వేసింది.

మరణించిన పోలీసు సిబ్బంది పిల్లలకు స్కాలర్‌షిప్

» 58 మందికి అందించిన ఏడీజీ అభిలాష బిస్త్

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన పోలీసు సిబ్బంది కుటుంబాల్లోని పిల్లల చదువుల కోసం 'పరివర్తన్' స్కాలర్‌షిప్‌ను ఏడీజీ అభిలాష బిస్త్ అందించారు. డీజీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 58 మంది విద్యార్థులకు రూ. 14.87 లక్షలను ఏడీజీ అందజేశారు. పోలీసు సిబ్బంది మృతిచెందితే వారి పిల్లల చదువుల కోసం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 'పరివర్తన్' స్కాలర్‌షిప్ పేరుతో ఆర్థిక సాయం అందిస్తోంది. నిరుడు 151 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కాగా, ఇప్పటి వరకు ప్రమాదవశాత్తు మృతి చెందిన 11 మంది హోంగార్డుల కుటుంబాలకు రూ.3.75 కోట్లు ఇన్సూరెన్స్ అందజేసినట్లు బ్యాంకు అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

పాఠ్య పుస్తకాల ముద్రణ వివాదంలో ఇద్దరు అధికారులపై వేటు

» ముందుమాట కనిపించకుండా అట్టకు పేజీని అతికించాలని నిర్ణయం

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పాఠ్య పుస్తకాల్లో ముందుమాటపై నెలకొన్న వివాదం విషయంలో ఇద్దరు అధికారులపై వేటు పడింది. అలాగే ముందుమాట కనిపించకుండా... అట్టకు ఆ పేజీని అతికించాలని నిర్ణయించారు. రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకాల్లో ముద్రించిన ముందుమాటపై వివాదం తలెత్తిన విషయం తెలిసిందే. గతంలో రూపొందించిన ముందుమాటను మార్చకుండా అలాగే ఈ ఏడాది ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేయడంతో ఈ వివాదం చెలరేగింది. ముఖ్యంగా ఈ ముందుమాటలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రుల పేర్లు ఉండడంతో గందరగోళం నెలకొంది. ఇందుకు కారకులైన ఇద్దరు అధికారులపై వేటు వేశారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డిని అక్కడి నుంచి తప్పించి సమగ్ర శిక్ష అసిస్టెంట్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బదిలీ చేశారు. పాఠ్య పుస్తకాల ప్రెస్ సర్వీసెస్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీనివాస చారిని ఆ బాధ్యతల నుంచి తప్పించి మోడల్ స్కూల్‌కు బదిలీ చేశారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌గా రమేష్, పాఠ్య పుస్తకాల ప్రెస్ సర్వీసెస్ డైరెక్టర్‌గా రమణకుమార్‌ను నియమించారు. ఈ వివాదాన్ని ముగించడానికి అధికారులు కొన్ని నిర్ణయాలను తీసుకున్నారు. అందులో భాగంగా ఒకటి నుంచి పదో తరగతి వరకు గల తెలుగు పాఠ్య పుస్తకాల్లోని ముందుమాట పేజీని తొలగించి ప్రతిజ్ఞ, వందేమాతరం, జనగణమన కనబడేట్టు అట్టకు లోపల అతికించాల్సిందిగా అన్ని స్కూళ్ల ప్రధానోపాధ్యాయులను అధికారులు ఆదేశించారు. ప్రస్తుతం ఆ దిశగా పుస్తకాల్లో మార్పులు చేస్తున్నారు. గురువారమే చాలా జిల్లాల్లోని పుస్తకాలను వెనక్కి తెప్పించుకున్నారు. ఎంఆర్‌సీలో వాటిని నిల్వ చేయాలని ఆదేశించారు. మళ్లీ శుక్రవారం ముందుమాట పేజీని అట్టకు అతికించాలన్న (రివైజ్డ్) ఆదేశాలను ఇచ్చారు. ముందే ఈ ఆదేశాలను ఇచ్చి ఉంటే... పుస్తకాల రవాణా ఖర్చు, శ్రమ మిగిలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు చేసిన బాలికల ఫొటో

ఆ బాలికలను చూస్తుంటే ఆనందంగా ఉంది

» 'ఎక్స్' వేదికగా ఫొటోను పోస్ట్ చేస్తూ సీఎం వ్యాఖ్య

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సొంత ఊరికి కిలోమీటరు దూరంలో ఉన్న పాఠశాలలో చదువుకునేందుకు పైసా ఖర్చు లేకుండా వెళ్తున్న ఈ బాలికలను చూస్తుంటే ఆనందం కలుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ప్రయాణ పథకం వల్లే తాము బస్సెక్కి స్కూలుకు వెళ్తున్నామంటూ బాలికలు సంతోషం వ్యక్తం చేస్తుంటే.. ఓ జర్నలిస్టు ఫొటో తీసి తనకు పంపారని శుక్రవారం 'ఎక్స్' వేదికగా సీఎం వెల్లడించారు. సిద్దిపేట జిల్లాలోని మగ్దూంపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న ఆ బాలికల ఫొటోనూ ఆయన పోస్ట్ చేశారు.

అక్రమ క్రమబద్ధీకరణపై నివేదిక సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

వారికి సహకరించిన అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది. వాస్తవానికి గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి ఫలితాలు వెలువడే రోజు వరకు రాష్ట్ర వ్యాప్తంగా సర్కారు భూముల క్రమబద్ధీకరణ పెద్ద ఎత్తున జరిగింది. ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు రాజధాని చుట్టు పక్కల జిల్లాల పరిధిలో ఇది ఎక్కువగా చోటు చేసుకుంది. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని కొంత మంది పెద్దల కనుసన్నల్లో ఇదంతా జరిగిందని ఆరోపణలున్నాయి. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరణ పేరుతో దొడ్డిదారిన కబళించారన్న విమర్శలు వచ్చాయి. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ భూముల వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు, జీవో 59 కింద జరిగిన భూముల క్రమబద్ధీకరణ వివరాలను సేకరించారు. అయితే, లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమైయ్యారు. ముఖ్యమంత్రి, మంత్రులు కూడా ఎన్నికల ప్రచారంలో మునిగిపోయారు. దీంతో ఈ భూముల వ్యవహారంలో కొంతకాలంపాటు ముందడుగు పడలేదు. అయితే, కోడ్ ముగిసిన నేపథ్యంలో, ప్రభుత్వం మళ్లీ దీనిపై దృష్టి సారించినట్లు సమాచారం.



బీఆర్‌ఎస్ నేతల పాత్ర

ప్రభుత్వ భూముల అక్రమ క్రమబద్ధీకరణ వ్యవహారం వెనుక బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకుల పాత్ర ఉందని ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. దీంతో దీనిపై చర్చ మొదలైంది. 2023 ఆగస్టు నుంచి డిసెంబరు వరకు జీవో 59 కింద పెద్ద ఎత్తున ప్రభుత్వ భూముల అక్రమ క్రమబద్ధీకరణ జరిగింది. గజం విలువ లక్షకుపైగా ధర పలికే హైదరాబాద్ శివారు ప్రాంతాలు, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో స్థలాల క్రమబద్ధీకరణ చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లా కేంద్రాల్లోను జీవోను అడ్డుపెట్టుకొని భారీ అక్రమాలకు పాల్పడ్డారు. ముఖ్యంగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకుల ఇళ్లలో పనిచేసేవారు, డ్రైవర్లు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యుల పేర్లపై క్రమబద్ధీకరణ చేయించారు. కొందరు అక్రమదారులు తమకు ఇళ్లు లేకపోయినా దరఖాస్తులు చేసుకొని క్రమబద్ధీకరించుకున్నారు. గతంలో కూల్చిన ఇళ్ల మొండి గోడలకు ఇంటి నెంబర్లు, కరెంట్ బిల్లులు తెచ్చుకొన్నారు. మరికొందరు ఒకే ఇంటి నెంబరుపై, ఒకే కరెంటు బిల్లుపై అనేక దరఖాస్తులు చేసి క్రమబద్ధీకరించుకున్నారు. క్రమబద్ధీకరించిన స్థలాలను కొందరు మరుసటి రోజే విక్రయించారు. వీటన్నింటిపైనా ఇప్పుడు దర్యాప్తు జరగనుంది.

అక్రమాలు ఇలా..

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో సర్వే నెంబరు 74లో వంద ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో వివిధ వర్గాల వారికి, సంస్థలకు కేటాయించింది పోగా మిగిలిన 20 ఎకరాల భూమిలో 21 మంది పేర్లపై 12,879 గజాలను మూడు విడతల్లో ఎన్నికల కోడ్ వచ్చిన మరుసటి రోజున క్రమబద్ధీకరించారు.

ఖమ్మంలో దాదాపు రూ.100 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని 180 మంది పేర్లపై క్రమబద్ధీకరించారు. ఒకే ఇంటి నెంబరుతో దాదాపు 40 మంది కబ్జాదారులు 6వేల గజాలకు పైగా స్థలాన్ని క్రమబద్ధీకరించుకున్నారు.

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నానక్‌రాంగూడ ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన రూ.750 కోట్ల విలువైన చేసే 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రూ.31.52 కోట్లకే క్రమబద్ధీకరించారు. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు లేకపోయినా ఒకరి పేరుపై ఏడు ప్లాట్లు (6,043 గజాలు), మరో నలుగురి పేర్లపై 17 ప్లాట్లను (15,534గజాలు) క్రమబద్ధీకరించారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో 26 ఎకరాల వరకు క్రమబద్ధీకరించారు. ఈ మండలంలోని పసుమాముల గ్రామ పరిధిలోని 444, 264, 106, 386, 102 సర్వే నెంబర్లలో సుమారుగా 14,600 చదరపు గజాలను బీఆర్‌ఎస్ నాయకుల ఇళ్లలో పనిచేసే వారిపేర్లపై, వారి డ్రైవర్ల పేర్లపై క్రమబద్ధీకరించారు. గుడిసెలు, ప్రహరీలను నిర్మించి వాటికి ఇంటి నెంబర్లు, కరెంట్ బిల్లులు తీసుకొని ఈ పని చేయించుకున్నారు. హయత్‌నగర్ మండలం బాగ్ హయత్‌లో సర్వే నెంబరు 207, 71/1లో అక్రమ క్రమబద్ధీకరణలు చేశారు.

ఖాజాగూడ సమీపంలో ఓ న్యాయవాది కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లపై కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని (2,742 చదరపు గజాలు) రెగ్యులరైజ్ చేశారు. ఒక చిన్న గది నిర్మాణంతో ఏకంగా 8 మంది పేర్ల మీద పది డాక్యుమెంట్ల ద్వారా దీనిని క్రమబద్ధీకరించారు.

నిబంధనలకు పాతర

రెగ్యులరైజేషన్‌లో అధికారులు నిబంధనలకు పాతర వేశారు. క్రమబద్ధీకరణ నిబంధనల ప్రకారం... సర్కారు స్థలంలో 2020 జూన్ 2 నాటికి ఇల్లు నిర్మించుకొని అందులో నివాసం ఉన్న వారికి మాత్రమే జీవో నెంబరు 59 కింద క్రమబద్ధీకరించే అవకాశం ఉంటుంది. ఆ ఇంట్లో ఉన్న వారి ఆధార్‌కార్డులు అదే ఇంటి అడ్రస్‌తో ఉండాలి. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ప్రాపర్టీ ట్యాక్స్, ఎలక్ట్రిసిటీ బిల్లు, వాటర్ బిల్లు వంటివీ అవసరమవుతాయి. కానీ, రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన క్రమబద్ధీకరణ వ్యవహారంలో చాలా చోట్ల అధికారులు ఇవేమీ పట్టించుకోలేదు.



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న సీపీ అవినాష్ మహంతి తదితరులు, డ్రోన్

ట్రా'ఫికర్'ను తీర్చేందుకు డ్రోన్లు వచ్చేశాయ్!

» సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణ, నియంత్రణ కోసం డ్రోన్లు

» పనితీరును పరిశీలించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రోడ్ల మీద ట్రాఫిక్ నిర్వహణను ఇక 'గగన నేత్రం' ద్వారానూ పర్యవేక్షనున్నారు. ట్రాఫిక్ నిర్వహణ, నియంత్రణ కోసం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రోన్‌లను ఉపయోగించనున్నారు. ఈ మేరకు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సౌజన్యంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ 'థర్ ఐ ట్రాఫిక్ మానిటరింగ్ డ్రోన్'ను అభివృద్ధి చేశారు. శుక్రవారం డ్రోన్ పనితీరును సీపీ అవినాశ్ మహంతి ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఈ డ్రోన్ల ద్వారా ట్రాఫిక్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ట్రాఫిక్‌కు సంబంధించిన సమస్యలనూ గుర్తించవచ్చు. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు నెలకొన్న చోటును గుర్తించి వేగంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. సైబరాబాద్ పరిధిలోని వాహనదారులకు, ప్రత్యేకించి ఐటీ కారిడార్‌లోని వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ట్రాఫిక్ నిర్వహణ సులభతరం అవుతుందని, రోడ్లపై వాహనాల వేగం కూడా పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ట్రాఫిక్ నిర్వహణ, నియంత్రణలో డ్రోన్లను విజయవంతంగా ఉపయోగిస్తున్నారు.

గొర్రెలతో గాబరా

(మొదటిపేజీ తరువాయి)

దిగడమే కాకుండా సూక్ష్మస్థాయిలో సమాచారం కోరడంతో సంబంధిత అధికారుల్లో దడ మొదలైంది. ఇటు ఏసీబీ.. అటు ఈడీ విచారణతో గొర్రెల స్కాంలో అక్రమాల పర్వం ఏ తీరానికి చేరుతుందో.. తమ భవిష్యత్తు ఏమవుతుందోననే ఆందోళన పట్టుకుంది. మరోవైపు, గొర్రెల స్కాంకు సంబంధించి ఈడీ అడిగిన సమాచారాన్ని పంపించాలంటూ టీజీఎస్‌జీడీసీఎఫ్‌ఎల్ ఎండీ డాక్టర్ సుబ్బారాయుడు ఆ శాఖ జిల్లా అధికారులకు శుక్రవారం ఈ-మెయిల్ పంపారు. జిల్లాలవారీగా వచ్చే సమాచారాన్ని క్రోడీకరించి ప్రధాన కార్యాలయంలో ఉన్న సమాచారంతో సరిపోల్చుకుని ఈడీకి పంపించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

చివరి నిమిషంలో డ్రాప్..!

గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలకు సంబంధించి మాసబ్ ట్యాంక్‌లోని టీజీఎస్‌జీడీసీఎఫ్‌ఎల్ ఎండీ కార్యాలయానికి శుక్రవారం ఉదయం 11 గంటలకు వస్తామని ఈడీ అధికారులు ఒకరోజు ముందుగానే సమాచారం అందించారు. కానీ రాలేదు. దాంతో, టీజీఎస్‌జీడీసీఎఫ్‌ఎల్ అధికారులు ఫోన్ చేయగా.. అనుకోని పనిలో ఉన్నామని, మరికొద్దిసేపట్లో వస్తామని బదులిచ్చారు. కానీ, సాయంత్రం వరకూ రాలేదు. అయితే, ఈడీ అధికారులు ఎప్పుడు వస్తారో, ఏం అడుగుతారోన్న టెన్షన్ అధికారులు, సిబ్బందిలో నెలకొంది.

అక్రమాల్లో నాకు సంబంధం లేదు

» విచారణకు సిద్ధం.. ఏ నోటీసులూ రాలేదు

» మాజీ పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ లక్ష్మారెడ్డి

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గొర్రెల కొనుగోలు అక్రమాల్లో తనకు ఎలాంటి సంబంధం లేదని మాజీ పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఏ విచారణకైనా తాను సిద్ధంగా ఉన్నానని, విచారణకు పిలిస్తే సహకరిస్తానని అన్నారు. కానీ ఇప్పటి వరకు ఈ విషయంపై తనకు ఎలాంటి నోటీసులూ అందలేదని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. 2020లో పశు సంవర్ధక శాఖ డైరెక్టర్, గొర్రెల, మేకల అభివృద్ధి సహకార సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందించానని, ఆ తరువాత పదవీ విరమణ పొందానని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందినప్పటి నుంచి శాఖతో ప్రత్యక్షంగా, పరోక్షంగా తనకు ఎలాంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. వేసవి సెలవుల నేపథ్యంలోనే కెనడాలో ఉన్న తన కుమారుడి వద్దకు వెళ్లినట్లు, త్వరలోనే భారత్‌కు తిరిగి రానున్నట్లు తెలిపారు. నిబంధనల మేరకే తాను విధులను నిర్వర్తించానని లక్ష్మారెడ్డి లేఖలో పేర్కొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి: నిరంజన్

గొర్రెల కుంభకోణం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారు దేశం విడిచి వెళ్లకుండా చూడాలని ప్రభుత్వాన్ని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ కోరారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, అంబులెన్స్‌ల్లో గొర్రెలు రవాణా చేశామని పేర్కొన్నారంటే.. పెద్ద వాళ్ల ప్రమేయం లేకుండా ఇది జరగదన్నారు.

తుమ్మిడిహెట్టిని పక్కనపెట్టారేం!?

» కాళేశ్వరం నిర్మాణానికి ప్రామాణిక నివేదిక ఏమిటి!?

» దృష్టిసారించిన జస్టిస్ పినాకీ చంద్ర ఘోష్ కమిషన్

» కేసీఆర్‌కు నివేదిక ఇచ్చిన విశ్రాంత ఇంజనీర్లతో నేడు భేటీ

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్లలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కడితే దాదాపు 71 కిలోమీటర్ల వరకూ గ్రావిటీతో వచ్చే నీళ్లను కాదని కాళేశ్వరం ఎత్తిపోతలను ఎందుకు చేపట్టారనే అంశంపై జస్టిస్ పినాకీ చంద్ర ఘోష్ కమిషన్ దృష్టి సారించింది. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి ఉంటే ఎల్లంపల్లి వరకూ గ్రావిటీతో నీళ్లు వచ్చేవని, తద్వారా ఎత్తిపోతలకు అయ్యే కరెంట్ బిల్లు ఖర్చు కూడా తగ్గేదని, అటువంటి పరిస్థితుల్లో దానిని ఎందుకు పక్కనబెట్టారని ఆరా తీస్తోంది. ఇవే అంశాలను ప్రస్తావించడమే కాకుండా తుమ్మిడిహెట్టి వద్దే బ్యారేజీ కట్టాలని, మేడిగడ్డ బ్యారేజీతో ప్రయోజనం లేదని 2015లోనే ఐదుగురు విశ్రాంత ఇంజనీర్లు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నివేదిక ఇచ్చారు. వారు అప్పట్లో ఇచ్చిన నివేదికపై కమిషన్ ఇప్పుడు దృష్టి సారించింది. ఆయా ఇంజనీర్లతో శనివారం భేటీ కానుంది. సదరు నివేదిక నేపథ్యంలోనే.. తుమ్మిడిహెట్టి కాకుండా 100 కిలోమీటర్ల కిందకు వెళ్లి కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కట్టాలని ఎవరు చెప్పారు!? ఏ నివేదిక ఆధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను డిజైన్ చేసి కట్టారు? ఇందుకు ప్రామాణికత ఏమిటి!? దీనిపై మంత్రివర్గం నిర్ణయం తీసుకుందా? లేక ఏదైనా నివేదికను పరిగణనలోకి తీసుకొని కాళేశ్వరం కట్టారా? తదితర అంశాలపై కమిషన్ దృష్టి సారించింది. అలాగే, పనులు పూర్తి కాకపోయినా పూర్తయినట్లు సర్టిఫికెట్లు ఎలా ఇచ్చారు? వాటిపై కౌంటర్ సంతకాలు ఎవరు చేశారు? ఆర్థిక ఉల్లంఘనలు ఏమేమిటి? అనే అంశాలపైనా దృష్టిపెట్టింది. అలాగే, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి పూర్తిస్థాయి నివేదికను తెప్పించుకోవాలని కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మధ్యంతర నివేదిక అందిందని, పూర్తి నివేదికను సత్వరం తెప్పించుకోవాలని సూచించింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యానికి కారణాలపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) జూలై 7వ తేదీలోగా నివేదిక సమర్పించే అవకాశాలున్నాయని కమిషన్ భావిస్తోంది. ఆ నివేదిక చేతికందాక తదుపరి చర్యలకు ఉపక్రమించనుంది. ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర నివేదిక ఆధారంగానే బ్యారేజీల్లో మరమ్మతులు/పునరుద్ధరణ పనులను ప్రభుత్వం చేస్తున్న విషయం తెలిసిందే.

అఫిడవిట్లను సీల్డ్ కవర్లోనే అందించాలి

కమిషన్‌కు సమర్పించే అఫిడవిట్లను సీల్డ్ కవర్‌లో అందించాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ అధికారులను ఆదేశించారు. ఈఎన్‌సీ (జనరల్) పరిధిలో పనిచేసే అధికారులతోపాటు ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఓ అండ్ ఎం) అధికారులను శనివారం ఆయన విచారించారు. ఈ సందర్భంగా.. ఆయా అధికారులు నిర్వర్తిస్తున్న బాధ్యతలేమిటి? ఏమేం చేశారు? వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరితో సంప్రదింపులు జరపకుండా అఫిడవిట్లు ఉండాలని, అన్నీ ఒకే నమూనాలో ఉన్నా అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో దోపిడీ

» విద్యా రంగంలో మార్పులు తెస్తాం

» త్వరలోనే 13 వేల టీచర్ పోస్టుల భర్తీ

» 4 నెలల్లో బ్రాహ్మణ వెల్లెంల పూర్తి

» మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి, జూన్ 14: రాష్ట్రంలోని కొన్ని కార్పొరేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఫీజు దోపిడీకి పాల్పడుతున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో అడ్డగోలుగా యూనివర్సిటీల పేరిట అనుమతులు తెచ్చుకున్న కొన్ని కాలేజీల యాజమాన్యాలు ఒక్కో విద్యార్థి నుంచి ఫీజు, డొనేషన్ రూపేణా రూ.12లక్షల దాకా వసూలు చేస్తున్నారని విమర్శించారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని తన స్వగ్రామం బ్రాహ్మణవెల్లెంలలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణవెల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాను ఏడో తరగతి వరకు చదువుకున్నానని, ఇది జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా మారాలని ఆకాంక్షించారు. ప్రైవేటు విద్యా వ్యవస్థ.. ప్రభుత్వ పాఠశాలల ఉనికికే ప్రమాదంగా పరిణమించిందని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలోనే 13వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తుంటే ప్రభుత్వ విద్యా సంస్థల పట్ల ప్రజల్లో విశ్వాసం ఎలా వస్తుందని చురకలంటించారు. వచ్చే నాలుగు నెలల్లో బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టును పూర్తి చేసి సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభిస్తామని ప్రకటించారు.



నల్లగొండ జిల్లా బ్రాహ్మణవెల్లెంలలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఏ బాధ్యతైనా నిర్వర్తిస్తా: రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్: త్వరలోనే ఓ శుభవార్త వస్తుందన్న ఆశ ఉందని, క్రమశిక్షణ గల కార్యకర్తగా అధిష్ఠానం ఏ బాధ్యత అప్పగించినా విజయవంతంగా అమలు చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ భువనగిరి ఇన్‌చార్జిగా బాధ్యత తీసుకొని చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించామని గుర్తు చేశారు. చౌటుప్పల్‌ను మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



రాష్ట్రపతి ముర్ముకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కిషన్‌రెడ్డి

వచ్చే వారం బొగ్గు గనుల వేలం

» నిర్వహించనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యపర అవసరాల కోసం ఉద్దేశించిన బొగ్గు గనుల వేలం వచ్చే వారం జరుగుతుందని బొగ్గు గనుల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో పదో రౌండ్ కమర్షియల్ బొగ్గు గనుల వేలాన్ని నిర్వహిస్తారని పేర్కొంది. ఇందులో 62 బ్లాకులను అమ్మకానికి పెడుతారని తెలిపింది. బొగ్గును ఎవరు వినియోగిస్తారన్న దానితో సంబంధం లేకుండా గనుల కేటాయింపు ఉంటుంది. పూర్తి పారదర్శకతతో వేలం జరుపుతామని, గరిష్ఠ ఆదాయాన్ని పొందేందుకు ప్రయత్నిస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. కిషన్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టగా శుక్రవారం తొలిసారిగా బొగ్గు, గనుల శాఖల అధికారులతో సమావేశమయి సమీక్ష జరిపారు. కాగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌లను కిషన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తన శాఖ సహాయమంత్రి సతీశ్ చంద్ర దూబేతో కలిసి వారి వద్దకు వెళ్లారు.

ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా?



మరోసారి ఉత్తరాంధ్ర బీసీలకు అవకాశం!

అమరావతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్ష మరోసారి ఉత్తరాంధ్ర బీసీ నేతకు దక్కే అవకాశం ఉందని టీడీపీలో ప్రచారం జరుగుతోంది. విశాఖ జిల్లా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాదవ్ వైపు ఆ పార్టీ అధిష్ఠానం మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. రాష్ట్ర విభజన అనంతరం ఈ పదవి మూడు దఫాలు ఈ ప్రాంత నేతలనే వరించింది. టీడీపీ జాతీయ పార్టీగా ఆవిర్భవించిన తర్వాత చంద్రబాబు జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం.. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవులు సీనియర్ నేతలకు ఇవ్వడం రివాజుగా ఉంది. విభజన అనంతరం 2015 సెప్టెంబరులో ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడిగా సీనియర్ నేత కిమిడి కళావెంకట్రావును నియమించారు. తర్వాత ఆయన మంత్రివర్గంలో చేరినా దరిదాపుగా ఐదేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. 2020 అక్టోబరులో అచ్చెన్నాయుడు రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఇప్పుడాయన చంద్రబాబు మంత్రివర్గంలో చేరారు. దీంతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తారని పార్టీలో ప్రచారం సాగుతోంది. ఇటీవలి ఎన్నికల్లో గాజువాక టీడీపీ అభ్యర్థిగా ఆయన రాష్ట్రంలోనే అత్యధికంగా 95 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మంత్రివర్గంలో ఆయనకు చోటు ఖాయమని అందరూ భావించినా.. కొన్ని సమీకరణల కారణంగా చంద్రబాబు ఇవ్వలేకపోయారు. దీంతో ఆయనకు పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశాలు మెండుగా ఉన్నాయని టీడీపీ నేతలు పలువురు పేర్కొంటున్నారు.

టీటీడీ ఈవోగా శ్యామలరావు



అమరావతి (ఆంధ్రజ్యోతి)/తిరుమల, జూన్ 14: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా జే శ్యామలరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ఆయన్ను టీటీడీ ఈవోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం టీటీడీ ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ధర్మారెడ్డిని ఆ పోస్టు నుంచి రిలీవ్ కావాలని పేర్కొన్నారు. వాస్తవానికి ధర్మారెడ్డిని గత ప్రభుత్వం టీటీడీ అదనపు ఈవోగా నియమించింది. ఆ తర్వాత ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. వైసీపీ ప్రభుత్వం ఓటమి తర్వాత జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే ధర్మారెడ్డి తనకు సెలవు కావాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. సీఎం చంద్రబాబు తిరుమల పర్యటన ఖరారు అయిన తర్వాత ఆయనకు సెలవు మంజూరు చేసింది. అనేక ఆరోపణలు ఎదుర్కొన్న ధర్మారెడ్డి రిటైర్మెంట్ దగ్గరలో సెలవు పెట్టి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సెలవు ముగిసిన తర్వాత ఆయన విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

పవన్ డిప్యూటీ సీఎం

(మొదటిపేజీ తరువాయి)

రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టీజీ) కూడా అప్పగించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడైన అచ్చెన్నాయుడికి వ్యవసాయం, తత్సంబంధితమైన మార్కెటింగ్, సహకారం, పాడిపరిశ్రమ, మత్స్యశాఖలు లభించాయి. కీలకమైన హోం శాఖను దళిత(మాదిగ) వర్గానికి చెందిన మహిళ వంగలపూడి అనితకు.. ఆర్థిక, వాణిజ్య పన్నులు, ప్రణాళికా శాఖలతో పాటు శాసనసభ వ్యవహారాలను పయ్యావుల కేశవ్‌కు.. రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్లను అనగాని సత్యప్రసాద్‌కు కేటాయించారు. ఇతర ముఖ్య శాఖల్లో జలవనరుల శాఖను నిమ్మల రామానాయుడికి.. ఆహార-పౌరసరఫరాలు నాదెండ్ల మనోహర్‌కు, రాజధాని అమరావతి నిర్మాణంపై అవగాహన ఉన్న పొంగూరు నారాయణకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలు.. బీజేపీకి చెందిన సత్యకుమార్‌కు వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ కేటాయించారు. ఇక సాధారణ పరిపాలన, శాంతి భద్రతలు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి.

సీఎం, మంత్రులకు కేటాయించిన శాఖలు..

1. చంద్రబాబు	సాధారణ పరిపాలన.. శాంతి భద్రతలు.. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు
2. పవన్ కల్యాణ్	పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా.. పర్యావరణం, అడవులు... శాస్త్ర సాంకేతిక శాఖలు
3. లోకేశ్	మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్స్
4. అచ్చెన్నాయుడు	వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ.. మత్స్య శాఖ
5. కొల్లు రవీంద్ర	గనులు, భూగర్భ శాఖ.. ఎక్సైజ్
6. నాదెండ్ల మనోహర్	ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు
7. పొంగూరు నారాయణ	పురపాలక, పట్టణాభివృద్ధి
8. వంగలపూడి అనిత	హోం, విపత్తు నిర్వహణ
9. సత్యకుమార్	ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య
10. రామానాయుడు	జలవనరుల శాఖ
11. ఎన్ఎండీ ఫరూక్	న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమం
12. రామనారాయణరెడ్డి	దేవదాయ శాఖ
13. పయ్యావుల కేశవ్	ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాలు
14. అనగాని సత్యప్రసాద్	రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు
15. కొలుసు పార్థసారథి	గృహ నిర్మాణం, సమాచార-పౌరసంబంధాలు
16. డోలా వీరాంజనేయ స్వామి	సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం
17. గొట్టిపాటి రవికుమార్	విద్యుత్
18. కందుల దుర్గేశ్	పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ
19. గుమ్మడి సంధ్యారాణి	మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమం
20. బీసీ జనార్దన్‌రెడ్డి	రోడ్లు-భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు
21. టీజీ భరత్	పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి
22. ఎస్.సవిత	బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడినవారి సంక్షేమం, జౌళి, వస్త్ర పరిశ్రమ
23. వాసంశెట్టి సుభాష్	కార్మిక, కర్మాగార, బాయిలర్స్, వైద్య బీమా సేవలు
24. కొండపల్లి శ్రీనివాస్	ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత,
25. ఎం.రాంప్రసాద్‌రెడ్డి	రవాణా, యువజన సర్వీసులు, క్రీడలు

టైట్లింగ్ యాక్టు మంచిదే!

» రాజ్యసభలో బలముంది.. అక్కడ చూసుకుందాం

» వైసీపీ ఎంపీలతో జగన్



అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై ప్రజలు గగ్గోలు పెట్టిన విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో ఈ యాక్టుపై ఆందోళన కూడా వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని తాము అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని టీడీపీ అధినేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు అప్పట్లో ప్రకటించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేస్తూ సంతకం కూడా చేశారు. అయితే.. ఇంత జరిగిన తర్వాత కూడా ఈ చట్టం మంచిదేనని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ సమర్థించుకున్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టును వ్యతిరేకించడాన్ని తప్పుబట్టారు. శుక్రవారం ఆయన వైసీపీ ఎంపీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ల్యాండ్ టైట్లింగ్ యాక్టును సమర్థించుకున్నారు. సరిగ్గా ఎన్నికలకు ముందు విపక్షాలు ఈ చట్టాన్ని భూతంలా చూపించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి ఈ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే తీసుకువచ్చిందని, దీనికి అనుగుణంగానే రాష్ట్రంలో చట్టాన్ని తెచ్చామని చెప్పారు. అమెరికా, యూరప్ దేశాల్లో అనుసరిస్తున్న మంచి విధానాలతో దీనిని రూపొందించామని, శాసనసభ సాక్షిగా ఈ చట్టాన్ని ప్రతిపక్షం కూడా ప్రశంసించిందని గుర్తు చేశారు. వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు వై.వి. సుబ్బారెడ్డిని నియమిస్తున్నట్టు జగన్ చెప్పారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని రాజ్యసభలో పార్లమెంటరీ నేతగా పరిమితం చేశారు. అదేవిధంగా లోక్‌సభలో వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా మిధున్‌రెడ్డినే కొనసాగిస్తున్నట్టు జగన్ చెప్పారు. కాగా, తమకు లోక్‌సభలో బలం లేకపోయినా.. రాజ్యసభలో బలముందని.. అక్కడ చూసుకుందామని వ్యాఖ్యానించారు. వైసీపీకి పార్లమెంటులో నలుగురు లోక్‌సభ, 11 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారని, టీడీపీకి 16 మంది లోక్‌సభ సభ్యుల బలం మాత్రమే ఉందని జగన్ అన్నారు. రాష్ట్ర, దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని.. అంశాలవారీగా కేంద్రానికి మద్దతు ఉంటుందని తెలిపారు.

వైద్యవిద్యలో ఈడబ్ల్యూఎస్ కోటా ఏదీ?

యూజీ, పీజీ ప్రవేశాల్లో కోటా అమలుపై నిర్లక్ష్యం.. ఉన్న సీట్లలోనే అమలు చేయాలన్న ఎన్ఎంసీ

» ఇప్పటికీ జీవో విడుదల చేయని వైనం

» యూజీలో 572, పీజీలో 180 కోటా సీట్లు

» కోర్టులకు వెళ్లే యోచనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): త్వరలో వైద్యవిద్య ప్రవేశాల నోటిఫికేషన్ రానుండగా.. 'ఆర్థికంగా వెనకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్)' కోటా అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ ఏడాది కూడా కోటా పూర్తిస్థాయిలో అమలయ్యే అవకాశం కనిపించడం లేదు. దీంతో యూజీలో 572, పీజీలో 180 సీట్లను ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు నష్టపోనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 56 మెడికల్ కాలేజీలున్నాయి. వాటిలో ఐదారు కళాశాలల్లోనే కోటా అమలు చేస్తున్నారు. మిగిలిన కాలేజీల్లో అమలు కావడం లేదు. ఈడబ్ల్యూఎస్ కోటాను కేంద్రం 2019లో ప్రవేశపెట్టింది. మొత్తం సీట్లలో పదిశాతం ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు కేటాయించాలి. ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయాలంటే ఇతరుల రిజర్వేషన్ దెబ్బతినకుండా ఉండేందుకు సీట్ల సంఖ్యను పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలా సీట్లు పెంచిన తర్వాతే కోటాను అమలు చేశారు. అన్ని రకాల విద్యా సంస్థల్లోనూ సీట్ల సంఖ్య పెంచారు. అయితే మెడికల్ కాలేజీల్లో మాత్రం ఇలా సీట్ల సంఖ్య పెంచడానికి వీలుకాలేదు. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనల మేరకు ఒక మెడికల్ కాలేజీలో గరిష్ఠంగా 250 సీట్ల వరకు ఉండొచ్చు. అంతకుమించి సీట్ల సంఖ్యను పెంచరాదు. మన దేశంలో చాలా మెడికల్ కాలేజీల్లో 250 సీట్లున్నాయి.

ఉన్న వాటిలోనే కోటా అమలు చేయాలి..

వైద్య కళాశాలల్లో సీట్ల సంఖ్యను పెంచకుండానే ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేయాలని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. కన్వీనర్ (ఏ కేటగిరీ) సీట్లలో ఈ కోటాను అమలు చేయాలని అన్ని రాష్ట్రాలకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. మిగిలిన అన్ని రాష్ట్రాల్లో మెడిసిన్ ప్రవేశాల్లో ఈ కోటాను అమలు చేస్తున్నాయి. మనదగ్గర మాత్రమే దీన్ని పూర్తిగా అమలు చేయడం లేదు. వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లే జీవో విడుదల కాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మొత్తం 8515 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. వీటిలో 5728 సీట్లు కన్వీనర్ కోటా కింద కేటాయిస్తారు. ఈ కోటా సీట్లలో 10 శాతం ఈడబ్ల్యూఎస్‌కు కేటాయించాలి. అంటే 572 సీట్లు ఇవ్వాలి. ప్రస్తుతం ఐదారు కాలేజీల్లో ఆ కోటా కింద వందకు పైగా సీట్లను కేటాయిస్తున్నారు. మిగిలిన కాలేజీల్లోనూ కోటాను అమలు చేస్తే అదనంగా 450 పైగా సీట్లను ఇవ్వాల్సి ఉంటుంది. ఆ కోటాను అమలు చేయాలంటే వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయాలి. కానీ, ఇంతవరకు అలాంటి కసరత్తే జరగడం లేదని వైద్యవర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆ కోటా కింద దక్కాల్సిన 450 సీట్లను ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు ఈ ఏడాది నష్టపోయే ప్రమాదం ఉంది. అలాగే పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ)లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో 2800 పీజీ సీట్లున్నాయి. ఇందులో కన్వీనర్ కోటా సీట్ల ఆధారంగా ఈడబ్ల్యూఎస్ కింద 180 పీజీ సీట్లను కేటాయించాలి. దానికి సంబంధించిన ఉత్తర్వులు కూడా ప్రత్యేకంగా ఇవ్వాలి. కానీ, ఇంతవరకు ఇవ్వలేదు. దాంతో యూజీ, పీజీ సీట్లను ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు నష్టపోనున్నారు.

మిగతా అన్నింట్లోనూ అమలు..

రాష్ట్రంలోని అన్ని ఉన్నత విద్యా సంస్థల్లో ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలోనూ ఈడబ్ల్యూఎస్ కోటా అమలవుతోంది. వైద్యవిద్య యూజీ, పీజీ ప్రవేశాల్లో మాత్రమే ఈ కోటా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైద్యవిద్య ప్రవేశాల్లో ఆరు శాతం ఉన్న ఎస్టీ రిజర్వేషన్‌ను జనాభా ప్రాతిపదికన 10 శాతానికి పెంచుతూ జీవో జారీ చేసింది. ఆ జీవో ఆధారంగా ఎస్టీలకు మెడిసిన్ ప్రవేశాల్లో పది శాతం సీట్లు కేటాయిస్తున్నారు. కాగా, ఈడబ్ల్యూఎస్ కోటా అమలుకు సంబంధించిన జీవో ఇంతవరకు విడుదల చేయకపోవడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు కోర్టులను ఆశ్రయించాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

కేటీఆర్‌కు హైకోర్టు నోటీసులు

» రెండు వేర్వేరు ఎన్నికల పిటిషన్ల విచారణ

» ఆయన ఎన్నిక చెల్లదంటూ పిటిషనర్ల వాదన

» వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ నేతకు ఆదేశం



హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ఎన్నికల పిటిషన్ల(ఈపీ)పై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ బీఆర్ఎస్ నేత, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు హైకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. కేటీఆర్ తన ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇవ్వడంతోపాటు సమాచారాన్ని దాచిపెట్టారని, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఇది కరప్ట్ ప్రాక్టీస్ కిందకు వస్తుందని పేర్కొంటూ ఆయన ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి, లగిశెట్టి శ్రీనివాస్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ (ఈపీ)లు దాఖలు చేశారు. జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం ఈ పిటిషన్లపై శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఎన్నికల అఫిడవిట్‌లో కేటీఆర్ తన కుమారుడు హిమాన్షును డిపెండెంట్‌గా చూపలేదని, కేవలం భార్య, మైనర్ కుమార్తె ఇద్దరు మాత్రమే డిపెండెంట్లని పేర్కొంటూ కావాలనే తప్పుడు సమాచారం ఇచ్చారని తెలిపారు. గతేడాది మేజర్ అయిన హిమాన్షు సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం వెంకటాపూర్‌లో రూ.10.5 లక్షలతో 4 ఎకరాలు, ఎర్రవల్లి గ్రామంలో రూ.88 లక్షలతో 32 ఎకరాల భూమి కొనుగోలు చేశారని చెప్పారు. కేటీఆర్ డిపెండెంట్‌గా లేని హిమాన్షు అంత భారీ మొత్తాన్ని ఎలా సంపాదించాడని ప్రశ్నించారు. తండ్రి ప్రమేయం లేకుండా, తండ్రిపై ఆధారపడకుండా పెద్దఎత్తున భూములు ఎలా కొనుగోలు చేశారని అడిగారు. ఈ సమాచారాన్ని కేటీఆర్ ఉద్దేశపూర్వకంగా అఫిడవిట్‌లో వెల్లడించకుండా దాచిపెట్టారని ఆరోపించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. కేటీఆర్, ఎన్నికల అధికారులకు, ఈసీకి నోటీసులు జారీ చేసింది.

కవితతో కేటీఆర్ ములాఖత్

న్యూఢిల్లీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆమె సోదరుడు, ఎమ్మెల్యే కేటీఆర్ కలిశారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు కలిసిన ఆయన... కవితతో సుమారు 20 నిమిషాల పాటు ముచ్చటించారు. జైలులో వసతులు, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. త్వరలోనే బెయిల్ వస్తుందని, ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చినట్లు తెలిసింది. కవితను కేటీఆర్ దాదాపుగా రెండు నెలల తర్వాత కలిశారు. ఆమెను మార్చి 15న ఈడీ అరెస్టు చేసింది. 16న కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుంది. ఆ తర్వాత ఐదురోజులకు కవితను కలిసి కేటీఆర్ మనోధైర్యం చెప్పారు. ఆ తర్వాత ఏప్రిల్ 14న సీబీఐ కస్టడీలో ఉండగా... బావ అనిల్‌తోపాటు వెళ్లి కలిశారు. తిహాడ్ జైలులో కలవడం మాత్రం ఇదే తొలిసారి. మధ్యాహ్నం 3 గంటలకు మాజీ పార్లమెంట్ సభ్యుడు వినోద్ కూడా కవితను కలిశారు. సుమారు 20 నిమిషాలు ఆమెతో మాట్లాడారు.

నేడు, రేపు మోస్తరు వర్షాలు

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో శని, ఆదివారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల మేర ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

వ్యవసాయశాఖ ఏఈఈ తుది జాబితా విడుదల

వ్యవసాయశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల(ఏఈఈ) తుది జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. ఉద్యోగాల భర్తీకి కమిషన్ డిసెంబరు-2022లో నోటిఫికేషన్ విడుదలచేసిన విషయం తెలిసిందే. ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచామని కమిషన్ కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రైవేటు బడితెగింపు

యథేచ్ఛగా పాఠ్యపుస్తకాల విక్రయం.. ప్రభుత్వం ఆదేశించినా పట్టని వైనం

» సర్కార్ ఆమోదించిన పుస్తకాలు బంద్

» ఢిల్లీ, బెంగళూరు పబ్లిషర్స్‌వే అమ్మకం

» ఆందోళన వ్యక్తం చేస్తున్న పబ్లిషర్లు

» నష్టపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హైదరాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): "ప్రైవేటు వ్యక్తులు ముద్రించిన పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు విక్రయించొద్దు!" ..ఇదీ ప్రైవేటు విద్యా సంస్థలకు ఉత్తర్వుల రూపంలో ప్రభుత్వం స్పష్టంగా ఇచ్చిన ఆదేశాలు. కానీ, "మేం అనుకున్నదే చేస్తాం.. మమ్మల్ని అడిగేదెవరు?" అన్నట్లుగా ఉంది ప్రైవేటు బడుల తీరు. విద్యను వ్యాపారంగా చూస్తూ.. ప్రైవేట్ పబ్లిషర్స్‌తో జట్టు కట్టి భారీగా డబ్బులు గుంజుతున్నారు. వీరిపై స్థానిక అధికారుల నిఘా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భారీగా నష్టపోతున్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన సిలబస్ పుస్తకాలనే ఉపయోగించాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పుస్తకాలను సరఫరా చేస్తుంది. ముందుగానే ముద్రించి పాఠశాలలకు పంపిస్తుంది. కాగా, ప్రైవేట్ బడుల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వమే పబ్లిషర్స్‌ను ఎంపిక చేసి పాఠ్య పుస్తకాలను ముద్రింపజేస్తుంది. ఇలా ఏటా సుమారు 2.5 లక్షల సెట్‌లను మార్కెట్‌లోకి విడుదల చేస్తుంటారు. ఈ పుస్తకాలకు సంబంధించిన సిలబస్‌ను ప్రభుత్వమే సమకూర్చుతుంది. ముద్రించి, ప్రైవేట్ విద్యార్థులకు అమ్మే పబ్లిషర్స్.. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లిస్తుంటారు.

ఉత్తర్వులు బుట్టదాఖలు

విద్యా శాఖ ఉత్తర్వుల ప్రకారం ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు కూడా ప్రభుత్వ రూపొందించిన సిలబస్ పుస్తకాలనే అందించాల్సి ఉన్నా.. దాన్ని యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నాయి. బదులుగా తాము అనుకున్న పాఠ్యపుస్తకాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నాయి. అత్యధిక శాతం పాఠశాలలు ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రాంతాలకు చెందిన పబ్లిషర్స్ రూపొందించిన పుస్తకాలను సరఫరా చేస్తున్నాయి. వారితో ఒప్పందం కుదుర్చుకుని విద్యార్థులకు పుస్తకాలను అంటగడుతున్నాయి. కాగా, ప్రభుత్వం రూపొందించిన సిలబస్ పుస్తకాల ధర రూ.250 నుంచి రూ.300 వరకు ఉంటే ప్రైవేట్ పాఠశాలలు అందించేవాటి ధర రూ.1,200 నుంచి రూ.4 వేల వరకు ఉంటోంది. తద్వారా విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోంది. అన్నిటికి మించి ప్రభుత్వం రూపొందించిన సిలబస్ వీటిలో ఇందులో సరిగ్గా ఉండదు.

ప్రైవేటులో ప్రభుత్వ పుస్తకాలనే అమ్మాలి..

ప్రైవేటులో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఆమోదించిన పుస్తకాలనే కొనుగోలు చేసేలా చూడాలంటూ వివిధ ప్రింటర్స్ ప్రతినిధులు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ దేవసేనకు వినతిపత్రం అందించారు. ఇతర పుస్తకాలను ఉపయోగిస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. కోట్ల రూపాయలను ప్రభుత్వానికి రాయల్టీగా చెల్లించి పుస్తకాలను ముద్రిస్తే.. ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

పెళ్లి వేడుకలకు గమ్యస్థానంగా తెలంగాణ

థేమ్స్ తరహాలో మూసీ సుందరీకరణ: మంత్రి జూపల్లి

హైటెక్స్‌లో సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్ల కాంగ్రెస్



హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లి వేడుకలకు గమ్యస్థానంగా తెలంగాణను మార్చేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సముద్ర తీర ప్రాంతం ఉన్న కారణంగా వెడ్డింగ్ డెస్టినేషన్‌లో గోవా అగ్రస్థానంలో ఉందన్నారు. రాష్ట్రానికి సముద్ర తీరం లేనప్పటికీ అతిపెద్ద నీటి వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ కట్టడాలు, సహజ జల వనరులు, నల్లమల అడవులు, కొండలు, కోటలు.. రాష్ట్రం నలుమూలల విస్తరించి ఉన్నాయన్నారు. శ్రీశైలం-సోమశిల, శ్రీశైలం-నాగార్జునసాగర్.. మధ్య కృష్ణా నది 160 కిలోమీటర్ల మేర విస్తరించి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ టూరిజం, చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ సంయుక్త ఆధ్వర్యంలో హైటెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్‌కు ఆతిథ్యం ఇవ్వడం తెలంగాణకు గర్వకారణమన్నారు. మూసీని లండన్ థేమ్స్ నది తరహాలో రూ.70వేల కోట్లతో అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల రాంబాబు మాట్లాడుతూ ఈ రంగంలో యువతను ప్రోత్సహించేందుకు, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే వారికి డెలిగేట్ ఫీజులో 50 % రాయితీ కల్పిస్తున్నామని తెలిపారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాధించాలి

» తక్కువ ఖర్చుతో ప్రాజెక్టులను పూర్తిచేయాలి

» శనివారమే ప్రతిపాదనలు అందించండి

» పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించండి: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును సాధించే ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని, ఆయా ప్రాజెక్టులకు చేయాల్సిన వ్యయం ఎంత...? ఎంత వెచ్చిస్తే.. ఏమేరకు ఆయకట్టు రానుందో వివరాలను శనివారం మధ్యాహ్నానికల్లా ప్రభుత్వానికి పంపించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, నెట్టెంపాడు, రాజీవ్ భీమా, ముక్తేశ్వర్(చిన్న కాళేశ్వరం), ఇందిరమ్మ వరద కాలువ పథకం, దేవాదుల ఎత్తిపోతల పథకం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ-సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు వంటి వాటిని ప్రాధాన్య జాబితాలో పెట్టామని ఉత్తమ్ గుర్తుచేశారు. రూ.50 కోట్లు ఇస్తే 10-30 వేల ఎకరాలదాకా నీళ్లిచ్చే ప్రాజెక్టులను గుర్తించి, ప్రతిపాదనలు అందించాలని నిర్దేశించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులకు నెలకు రూ.100 కోట్లు విడుదల చేస్తే 2026కల్లా ప్రాజెక్టు పూర్తిచేయడానికి అవకాశం ఉంటుందని నల్గొండ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ గుర్తుచేయగా... ఎస్ఎల్‌బీసీని అత్యంత ప్రాధాన్య జాబితాలో పెట్టామని మంత్రి స్పష్టం చేశారు. శాఖలో నిబంధనలకు అనుగుణంగా పదోన్నతులు కల్పించడానికి చర్యలు తీసుకోనున్నట్లు గుర్తుచేశారు.

కేసీ వేణుగోపాల్‌పై తప్పుడు ప్రచారం

» సైబర్ క్రైమ్‌కు ఎమ్మెల్సీ వెంకట్ ఫిర్యాదు

కేరళలోని ఓ హోటల్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బ్లాక్ టీ సేవిస్తుండగా తీసిన ఫొటోను.. ఆయన మద్యం తాగుతున్నట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన శశాంక్ సింగ్ అనే వ్యక్తిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. ఆ హోటల్‌కు ఆల్కహాల్ పర్మిషన్ లేదని, హోటల్ యాజమాన్యంతో కేసీ వేణుగోపాల్.. ఆల్కహాల్ తెప్పించుకున్నారంటూ ఎక్స్ వేదికగా శశాంక్‌సింగ్ తప్పుడు ప్రచారానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. శశాంక్‌పై చర్యలు తీసుకోవాలంటూ తన ఫిర్యాదులో కోరారు.

5నెలల్లోనే ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ సర్కారు

» ఇందుకు తెలంగాణ రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలే నిదర్శనం

» బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్.. భేటీ అయిన సంజయ్

న్యూఢిల్లీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఐదు నెలల్లోనే ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోయిందని, ఇందుకు ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలే నిదర్శనం అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పనైపోయిందని, ఆ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయమనే విషయం లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో రుజువైందని చెప్పారు. శుక్రవారం చుగ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బండి సంజయ్‌కు అభినందనలు తెలిపారు. ఆ శాఖకు బండి సంజయ్ మంచి పేరు తీసుకురావడంతోపాటు ప్రజలకు మరింత మేలు జరిగేలా పనిచేయాలని సూచించారు. భేటీ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం తెలంగాణలో బీజేపీ పరిస్థితి, పార్టీని రాష్ట్రంలో మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన అంశాలపై అరగంటకుపైగా చుగ్-బండి చర్చించారు. తెలంగాణలో 8 లోక్‌సభ స్థానాలను గెలిచిన బీజేపీ 35 శాతానికి పైగా ఓట్లు సాధించడం పట్ల చుగ్ సంతోషం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్లే ఇది సాధ్యమైందని అభిప్రాయపడ్డారు. కాగా తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు, అధికారులు శుక్రవారం బండి సంజయ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జేఈఈలో ర్యాంకు కొట్టినా.. ఇంటర్‌లో ఫెయిల్

» సప్లిమెంటరీ ఫలితాలు వచ్చే దాకా సీటును రిజర్వ్ చేయాలని హైకోర్టులో విద్యార్థి పిటిషన్

హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జేఈఈలో ర్యాంకు కొట్టినా.. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన ఓ విద్యార్థి.. తనకు సీటు రిజర్వు చేసేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించాడు. తాను ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రాశానని.. ఆ ఫలితాలు వచ్చే వరకూ మార్కుల మెమో గురించి ఒత్తిడి చేయకుండా కౌన్సెలింగ్ కమిటీకి ఆదేశాలు జారీ చేయాలని కోరాడు. ఈ మేరకు ఖమ్మం జిల్లాకు చెందిన భూక్య లోహిత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఇంటర్ పరీక్షలు జరిగేటప్పుడు తన ఆరోగ్యం సరిగ్గా లేదని, ఆ కారణంగానే ఫెయిల్ అయ్యానని తెలిపాడు. జూలై రెండో వారంలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వస్తాయని.. జూన్ 20 నుంచి ఐఐటీ కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని వెల్లడించాడు. తన కోసం సీటు రిజర్వ్ చేసేలా జేఈఈ కౌన్సెలింగ్ కమిటీ, ఏఐసీటీఈ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి ఆదేశాలివ్వాలని కోరాడు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. జూలై దాకా పిటిషనర్‌కు సీటు రిజర్వు చేసే అంశంపై సాధ్యాసాధ్యాలు తెలియజేయాలని ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

గర్భవతి వ్యాకులతను పట్టిఇచ్చే యాప్



గర్భవతులు డిప్రెషన్(వ్యాకులత)కు లోనవుతుంటారు. అయితే దాన్ని ముందుగానే పట్టి ఇచ్చే యాప్ ఇప్పుడు ఉనికిలోకి వచ్చింది. గర్భవతి నుంచి కొన్ని ప్రశ్నలకు సమాధానాలను రాబట్టగలిగితే ఆమె డిప్రెషన్‌లోకి వెళుతోందా లేదా అన్నది కనుగొనవచ్చని యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్‌కు చెందిన జనరల్ ఇంటర్నల్ మెడిసిన్ ప్రొఫెసర్ ఒకరు తేల్చారు. తన బృందంతో కలిసి జరిపిన ఈ కొత్త పరిశోధన ప్రకారం మొబైల్ యాప్ ఒకటి ఇందులో తోడ్పడుతుంది. గర్భందాల్చిన తదుపరి అంటే మొదటి మూడు నెలల్లో ఎదురయ్యే రిస్క్ కారకాలను పరిశోధకులు గుర్తించారు. నిద్ర నాణ్యత, ఆహార సంబంధిత అభద్రత వంటివి డిప్రెషన్‌ను పెంచుతాయని పేర్కొన్నారు. డిప్రెషన్‌లోకి వెళుతున్నారని ముందే కనుగొంటే రెమెడికి అవకాశం ఉంటుందని కూడా పేర్కొన్నారు. ఈ పరిశోధనలో భాగంగా 944 మంది గర్భవతులను ప్రశ్నించి సమాచారాన్ని రాబట్టారు.

వ్యక్తిగత మెడికల్ హిస్టరీ సహా పలు ప్రశ్నలకు సమాధానం వారు ఇచ్చారు. వారందరిని మూడు నెలలకు ఒకసారి అంటే మూడు సెమిస్టర్లలో ఆ మహిళలను స్క్రీనింగ్ చేశారు. వీటి నుంచి పరిశోధకులు ఆరు మెషిన్ లెర్నింగ్ మోడల్స్‌ను రూపొందించారు. అందులో బెస్ట్ వన్ ఒకటి 89 శాతం మేర డిప్రెషన్‌ను కరెక్ట్‌గా అంచనా కట్టింది. అలాగే గర్భవతులు ఇతర ఆప్షనల్ ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలను కూడా క్రోడీకరిస్తే, 93 శాతం ఆక్యురసీని సదరు మోడల్ సాధించింది. మొత్తమ్మీద ఆహారం అందుబాటు, సంబంధిత అభద్రత డిప్రెషన్‌కు కారణమని కూడా ఆ పరిశోధకుల బృందం తేల్చింది.

ఆంధ్రజ్యోతి

నవ్య స్మార్ట్

శనివారం • 15 జూన్ 2024



యాడ్ బ్లాకర్స్ కౌంటర్‌గా యాడ్ ఇంజెక్షన్



యూట్యూబ్ - యాడ్ బ్లాకర్స్‌కు కౌంటర్‌గా సెర్వర్ సైడ్ యాడ్ ఇంజెక్షన్‌ను తీసుకువస్తోంది. ప్రస్తుతం ఇది టెస్టింగ్‌లో ఉంది. దీని ప్రకారం ప్రకటన అనేది వీడియోలో భాగంగా వస్తుంది. ప్రస్తుతం ఉన్న విధానంలో ప్రకటనను తీసి వీడియోను చూపించేందుకు యాడ్ బ్లాకర్స్‌కు అవకాశం ఉంది. టెస్టింగ్‌లో ఉన్న చర్య ప్రకారం సెర్వర్‌లో డిటెక్షన్ ప్రక్రియ ఉంటుంది. అదే ప్రకటనలు తీసేయకుండా అడ్డుకుంటుంది. డేటా బేస్‌లోకి తప్పుడు జోక్యం లేకుండా చేస్తుంది. ప్రస్తుతం ఏడాదిగా ఈ పనిపైనే గూగుల్ ఉంది. ప్రకటనలు రాకుండా అడ్డుకునే చర్యలను నిరోధిస్తుంది. తెరవెనుక ఏమి జరుగుతోందన్నది తెలియదు. అయితే ప్రకటనలను అడ్డుకునే ప్రక్రియకు గూగుల్ ఎలా చెక్ పెడుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

లైక్స్‌ను దాచిపెడుతున్న ఎక్స్!



సామాజిక మాధ్యమం ఎక్స్ - లైక్స్‌ను దాచిపెడుతోంది. తద్వారా ప్రతి యూజర్‌కు లైక్స్ విషయంలో ఉండే ప్రైవసీని పరిరక్షిస్తోంది. ఈ పద్ధతిలోనూ యూజర్ తన పోస్టుకు వచ్చిన లైక్స్ చూసుకోవచ్చు. అయితే ఇతరులకు మాత్రం ఆ యూజర్‌కు వచ్చిన లైక్స్ చూసే వీలు ఉండదు. ఈ పద్ధతి ఇప్పటికే అమలులోకి వచ్చింది. యూజర్ ప్రొఫైల్ పేజీలో మాత్రమే తనకు లభించిన లైక్స్ కనిపిస్తాయి. ఇతరులకు వచ్చిన లైక్స్‌ను చూడగలిగే వెసులుబాటు కలిగిన టాబ్ ఇకపై అందుబాటులో ఉండదు. ఇంజనీరింగ్ టీమ్ ఇచ్చిన అప్డేట్ ప్రకారం లైక్ కౌంట్స్, ఇతర మేట్రిక్స్ వంటివి ఇప్పటికీ నోటిఫికేషన్స్ కింద కనిపిస్తాయి. తద్వారా ఒక పోస్టుకు వచ్చిన లైక్స్ మాత్రం తెలుస్తాయి. అంటే పోస్టును రాసిన వ్యక్తికి మాత్రమే తెలుస్తాయి. నిజానికి ఈ వెసులుబాటు ప్రీమియం ఖాతాదారులకు మాత్రమే ఇంతకుమునుపు ఉండేది. ఎలన్‌మస్క్ చేతిలోకి ఎక్స్ వెళ్ళిన తరవాత వచ్చిన మార్పుల్లో ఇది కూడా ఒకటి.

జూలై 10న

శాంసంగ్ వాచీ, ఇయర్ బడ్స్!



శాంసంగ్ ఉత్పత్తులు కొన్ని వచ్చే నెల 10న విడుదల అవుతాయని సమాచారం. న్యూజనరేషన్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లు, గెలాక్సీ వాచీలు, టీడబ్ల్యూఎస్ ఇయర్ బడ్స్ ఈ ప్యాకేజీలో ఉన్నాయి. అయితే ఈ విషయమై శాంసంగ్ మెంబర్స్ యాప్‌లోని సపోర్ట్ పేజీని ఉటంకిస్తూ స్క్రీన్‌షాట్‌తో ఒక పోస్టును యూజర్ ఒకరు ఎక్స్‌లో పోస్టు చేశారు. అందులో ఉన్న ప్రకారం గెలాక్సీ వాచీ 7, ఎఫ్ఈ మోడల్ కొత్త వాచీ, గెలాక్సీ బడ్స్ 3 ప్రొ, గెలాక్సీ రింగ్ ఉన్నాయి. గెలాక్సీ వాచీ ఎఫ్ఇ ఉనికిని ఈ పోస్టు ఖరారు చేసింది. బడ్స్‌కు సంబంధించిన కొత్త సిస్టమ్ డిజైన్ కూడా బైటపడింది. గెలాక్సీ రింగ్ కూడా జాబితాలో ఉంది. వేరబుల్ డివైజెస్‌కు తోడు గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6 కూడా ఉన్నాయి. అన్నీ సరికొత్త డిజైన్‌తో రానున్నాయి. శాంసంగ్ ఫోల్డబుల్స్ వంద డాలర్లు అంటూ మరో పుకారు కూడా వినవచ్చింది. అయితే రేట్లు ఖరారైనట్టు ఎలాంటి సమాచారం లేదు.



గెలాక్సీ కెమెరా వివరాలు లీక్?

శాంసంగ్ గెలాక్సీ ఎస్24 ఎఫ్ఈ వివరాలు లీకయ్యాయి. ఎస్ 23 తరవాతి వెర్షన్‌గా ఈ ఏడాది చివర్లో ఈ ఫోన్ విడుదల కానుంది. ఈ ఫోన్‌కు సంబంధించి శాంసంగ్ ఏ విషయాన్ని ఇప్పటివరకు కన్‌ఫర్మ్ చేయలేదు. గెలాక్సీ క్లబ్ నివేదిక ప్రకారం 50 మెగా పిక్సల్ కెమెరా అదీ 1/1.57 ఇంచీల ఐసోసెల్ జనరేషన్ 3 సెన్సర్ ఉంటాయి. ఇదే కెమెరా శాంసంగ్ గెలాక్సీ ఎస్24 హ్యాండ్‌సెట్‌లో ఉంది. దీనికి ముందు ఇంకో రిపోర్టు ప్రకారం ప్రాంతాన్ని అనుసరించి ఎక్సినోస్ 2400 లేదా స్నాప్‌డ్రాగన్ 8జన్. 3 చిప్‌సెట్ ఉండనుంది. ఎస్23 కంటే చిన్నగా అంటే 6.1 ఇంచీల అమోల్డ్ స్క్రీన్ ఉండనుంది.

4500ఎంఏహెచ్ బ్యాటరీ, 12జీబీ ఎల్‌పీడీడీఆర్5ఎక్స్ ర్యామ్, 256 జీబీ వరకు యూఎఫ్ఎస్ 3.1 ఆన్‌బోర్డ్ స్టోరేజీ ఉంటాయని సమాచారం. అలాగే కొన్ని దేశాలకు విడుదల చేసే ఫోన్ మోడల్ నంబర్లు కూడా లీకయ్యాయి. హ్యాండ్ కోడ్‌నేమ్ ఆర్ 12గా ఉండనుంది.



వాట్సాప్ - వీడియో కాలింగ్‌కు సంబంధించి 'స్పీకర్ స్పాట్‌లైట్' పేరిట అదనపు విలువను సమకూర్చే ఫీచర్‌ను తెచ్చింది. కాల్ సమయంలో మెసెంజర్ యాప్ ఆటోమెటిక్‌గా మాట్లాడుతున్న వ్యక్తిని స్క్రీన్‌పైకి తీసుకువస్తుంది.

స్పీకర్ స్పాట్‌లైట్

తద్వారా వీడియో కాల్‌లో ఎవరు మాట్లాడుతున్నారన్నది పార్టిసిపెంట్లు అందరికీ తెలుస్తుంది. వాట్సాప్ వీడియోకాల్‌కు సంబంధించి పార్టిసిపెంట్స్ విషయంలో పరిమితి ఉంది. ఫోన్‌లో 32 మంది విండోస్ పీసీలో గరిష్ఠంగా పదహారు మంది, మేక్స్‌లో ఎనిమిది మంది చేరవచ్చు. అయితే ఇప్పుడు అన్ని డివైజ్‌లకు ఒకే పరిమితి అంటే 32 మంది హాజరుకావచ్చు. తాజాగా స్పీకర్ స్పాట్‌లైట్‌తో మాట్లాడుతున్న వ్యక్తి మొదట స్క్రీన్‌పై కనిపిస్తారు. ఆడియో సపోర్ట్‌తో స్క్రీన్ షేరింగ్ మరో గుర్తించదగ్గ విషయం. దీంతో వీడియో కాల్ జరుగుతున్నప్పుడే వీడియోలను వీక్షించవచ్చు. ఇదే సమయంలో జనరేటివ్ ఏఐ పవర్డ్ టూల్‌పై పనిచేస్తోంది. దీంతో పర్సనలైజ్డ్ ప్రొఫైల్ ఫొటోస్‌ను క్రియేట్ చేసుకునే వీలు ఉంటుంది.

రీకాల్ ఫీచర్ జాప్యం!



మైక్రోసాఫ్ట్ - సెక్యూరిటీ కారణాల రీత్యా రీకాల్ ఏఐ ఫీచర్ విడుదలలో జాప్యం చేస్తోంది. వెబ్ బ్రౌజింగ్ నుంచి వాయిస్ చాట్స్ వరకు అన్నింటినీ ట్రాక్ చేసే వీలు ఉన్న ఫీచర్ ఇది. అయితే ప్రైవసీని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతానికి ఈ ఫీచర్‌ను పక్కనపెట్టింది. నిజానికి వెబ్ బ్రౌజింగ్‌తో మొదలుపెట్టి వాయిస్ చాట్స్ నుంచి యావత్తు హిస్టరీని కంప్యూటర్‌లో ఈ ఫీచర్ నిక్షిప్తపరుస్తుంది. అలా స్టోర్ అయిన వివరాలను నెలల తరవాత కూడా గుర్తు చేస్తుంది. యూజర్ కూడా సెర్చ్ చేసుకోవచ్చు. అయితే ప్రస్తుతానికి రీకాల్ ఫీచర్‌ని కేవలం చూడవచ్చు. అది కూడా విండోస్ ఇన్‌సైడర్ ప్రోగ్రామ్(డబ్ల్యుఐపీ)లో రాబోయే వారాల్లో లభ్యమవుతుంది. కోపైలెట్ ప్లస్ పీజీ యూజర్లుకు అందుబాటులో ఉంటుందని మైక్రోసాఫ్ట్ ఒక బ్లాగ్‌పోస్టులో వెల్లడించింది. ఒక నమ్మకమైన ఫీచర్‌గా దీన్ని అందరికీ అందుబాటులోకి తేవాలని అనుకుంటున్నామని, మరింత ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తరవాత విడుదల చేస్తామని కూడా పేర్కొంది. కోపైలెట్ ప్లస్ పీసీ అనేది ఈ ఏడాది మే నెలలో ఆరంభించారు. ఏఐ ఫీచర్లు ఉన్న పర్సనల్ కంప్యూటర్‌లో మాత్రమే ఇది ఉంటుంది. ఇక డబ్ల్యుఐపీ అనేది సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ ప్రోగ్రామ్. మిలియన్ల కొద్ది ఉండే విండోస్ బిగ్గెస్ట్ ఫ్యాన్లకు ఇది చేరువగా ఉంటుంది. దీన్ని ప్రకటించిన వెంటనే ప్రైవసీ విషయమై యూజర్ల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అదే జాప్యానికి దారితీసింది.

నోకియా మెరుగైన కాల్

నోకియా కాల్ క్వాలిటీని పెంచింది. ప్రపంచంలో మొట్టమొదటి 'ఇమ్మెర్సివ్' కాల్‌ని నోకియా సీఈఓ చేయడం ఈ సందర్భంలో గమనార్హం. కాల్ విషయంలో దీన్ని పేర్కొనదగ్గ పై మెట్టుగా దీన్ని చెప్పవచ్చు. కాల్



విప్లవంగానూ పేర్కొనవచ్చు. తదుపరి జనరేషన్ టెక్నాలజీ అంటే కాన్ఫరెన్స్ కాల్స్‌లో హాజరైన వ్యక్తుల మాట స్పష్టంగా వినిపించాలి. ఇంకా బాగా చెప్పాలంటే తమ సమక్షంలోనే మాట్లాడుతున్నట్టు ఉండాలి. అంటే మాట్లాడుతున్న వ్యక్తి గొంతు సమూహం నుంచి విడివడి స్పష్టంగా వినిపించాలి. ఏమాత్రం అవగాహన ఉన్నా స్పేషియల్ టెక్నాలజీ మాత్రమే ఇందుకు దోహదపడుతుందని అర్థమవుతుంది. ఏ దిశ నుంచి ధ్వని వస్తోందో కూడా తెలుస్తుంది. గ్రూప్ కాలింగ్‌లో ఇది బాగా ఉపయోగపడుతుంది. కాన్ఫరెన్స్ రూమ్‌లో కూర్చున్నప్పుడు ఎటువైపు నుంచైనా ఒక వ్యక్తి మాట్లాడుతుంటే మిగిలిన అందరి దృష్టి అటువైపు ఉంటుంది. సరిగ్గా అదేవిధమైన అనుభవం ఈ ఇమ్మెర్సివ్ కాల్‌తో లభిస్తుంది. చాలా వరకు స్మార్ట్‌ఫోన్లలో కనీసం రెండు మైక్రోఫోన్లు ఉంటాయి. అయితే ఈ టెక్నాలజీలో రియల్ టైమ్‌లో వాయిస్ ట్రాన్స్‌మిట్ అవుతుంది. 5జీ అడ్వాన్స్‌డ్ ప్రమాణాల్లో ఈ ఇమ్మెర్సివ్ కాల్ టెక్నాలజీ భాగం.

ఐఫోన్ ముచ్చట్లు



ఐపాడ్‌లో ఓఎస్ 18లో ఎట్టకేలకు బిల్ట్-ఇన్ క్యాలిక్యులేటర్ వచ్చిచేరింది. యూనిట్ కన్వర్షన్స్‌కు అనువైనది. అలాగే బేసిక్, సైంటిఫిక్ క్యాలిక్యులేటర్ కూడా ఇది. డివైజ్‌పై అతి పెద్ద డిస్‌ప్లే బటన్స్ అదే సమయంలో ఫంక్షనాలిటీస్‌ను ఒకేసారి చూపుతుంది. అందులో హిస్టరీ ఆప్షన్ కూడా ఉంటుంది. అది కాలిక్యులేషన్స్‌కు సంబంధించి ఇంతకుమునుపు చేసినవి చూపుతుంది. మేథ్ నోట్స్ క్యాలిక్యులేటర్‌ని నోట్స్

ఐపాడ్‌లో ఓఎస్ 18లో

క్యాలిక్యులేటర్ యాప్

యాప్‌నకు జతచేశారు. మేథమెటికల్ ఎక్స్‌ప్రెషన్స్‌ను ఇక్కడ రాయవచ్చు, టైప్ చేయవచ్చు. వెంటనే అవి సాల్వ్ అవుతాయి. సమాధానం లభిస్తుంది. వేరియబుల్ ప్రశ్నలకూ సమాధానం లభిస్తుంది. ఫలితాలకు సంబంధించిన గ్రాఫ్స్ ప్రత్యక్షమవుతాయి. అదే గ్రాఫ్‌కు మల్టిపుల్ ఈక్వేషన్స్‌ను జతచేయవచ్చు.

నోట్స్ యాప్‌నకు అప్‌గ్రేడ్ వచ్చింది. కంటెంట్‌ను ఇక్కడ ఆర్గనైజ్ చేసుకోవచ్చు. అయిదు సరికొత్త టెక్స్ట్ హైలైట్ రంగులను జోడించారు.

పెన్సిల్ నిర్దేశిత ఫీచర్‌ని కూడా కలిపారు. హ్యాండ్ రిటెన్ నోట్స్ తీసుకునే యూజర్లకు అది సహకరిస్తుంది. రాసిన దానికి లెజిబిలిటీని మెరుగుపరుస్తుంది. టైప్ చేసిన మేటర్‌కు మాదిరిగానే ఇక్కడ కూడా ఎడిటింగ్ సౌలభ్యం ఉంటుంది. టైప్డ్ టెక్స్ట్‌ని చేతి రాత స్టయిల్లో పేస్ట్ కూడా చేసుకోవచ్చు.

ఐపాడ్ యూజర్లు సైతం తమ హోమ్ స్క్రీన్‌ను కస్టమైజ్ చేసుకోవచ్చు. కొత్త అప్డేట్‌తో ఇప్పుడు యాప్ ఐకాన్స్ అలాగే విడ్జెట్స్‌ను స్క్రీన్‌పై ఎక్కడైనా పెట్టుకోవచ్చు. డార్క్, లైట్, టింట్‌తో కనిపించేలా ఐకాన్‌లను మార్చుకోవచ్చు. సైజు పెంచుకోవచ్చు. అందంగా కనిపించేందుకు అనువుగా పేర్లను తొలగించనూవచ్చు.

కంట్రోల్ సెంటర్‌ని కూడా రిడిజైన్ చేస్తున్నారు. కంట్రోల్ సెంటర్‌లో ఇకపై కుప్పలకొద్దీ సెట్టింగ్ టూల్స్ కనిపించనున్నాయి. మీడియా ప్లేబ్యాక్, హోమ్ కంట్రోల్స్, కనెక్టివిటీ కోసం వేర్వేరు కంట్రోల్స్ ఉంటాయి. ఈ కంట్రోల్స్ మధ్య స్వైపింగ్‌కు వీలు ఉంటుంది. మరిన్ని కంట్రోల్స్‌ను క్రియేట్ చేయాలని యాపిల్ ఇప్పటికే డెవలపర్లను కోరింది.



ఐపాడ్‌ఓఎస్ 18 ఫీచర్లు

- ఫేవరేట్ టాబ్స్ కనిపించేందుకు వీలుగా రీడిజైన్డ్ ట్యాబ్‌ని కలిపారు.
- ఫొటో యాప్ ఇకపై ఆటోమేటిక్‌గా లైబ్రరీలను నిర్వహిస్తుంది.
- మెసేజెస్ యాప్‌లో యానిమేటెడ్ టెక్స్ట్ సహా సరికొత్త ఫార్మేటింగ్ టూల్స్ సెట్ వస్తోంది.
- సఫారీ బ్రౌజర్‌లో రీడర్ వ్యూ ఉండనుంది.
- ఐపాడ్ యూజర్లు కూడా యాప్స్‌ని హైడ్ లేదంటే లాక్ చేసుకోవచ్చు.
- చాట్ జీపీటీ, సిరి ఇంటిగ్రేట్ కావడంతో యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్స్ అంటే రైటింగ్ టూల్స్, ఇమేజ్ కేపబిలిటీస్ అందుబాటులోకి వస్తాయి.
- పాస్‌వర్డ్ యాప్ జతపడుతుంది.
- షేర్‌ప్లే నుంచి రిమోట్ యాక్సెస్ లభిస్తుంది.
- కేలెండర్ యాప్‌లో ఈవెంట్స్, రిమైండర్స్ నుంచి టాస్కులు కనిపిస్తాయి. యాపిల్ డెవలపర్ ప్రోగ్రామ్ ద్వారా మాత్రమే ప్రస్తుతం ఐపాడ్‌ఓఎస్ 18 డెవలపర్ బేటాను పొందే వీలు ఉంది.

టైమ్ సెట్టింగ్స్‌తో ఐఫోన్‌లో వెబ్‌సైట్స్ బ్లాక్

ఐఫోన్‌లో స్క్రీన్ టైమ్ సెట్టింగ్స్ ఉపయోగించి వెబ్‌సైట్స్‌ను బ్లాక్ చేసుకోవచ్చు. తమ ఫోన్స్



ఉపయోగించే పిల్లలపై అదుపు లేదంటే స్క్రీన్‌టైమ్ సెట్టింగ్ కోసం ఇది బాగా ఉపయోగపడుతుంది. దీనికోసం...

- ఐఫోన్‌లో సెట్టింగ్ యాప్స్‌ని ఓపెన్ చేయాలి.
- స్క్రీన్ టైమ్‌ని టాప్ చేయాలి.
- కంటెంట్ అండ్ ప్రైవసీ రెస్ట్రిక్షన్స్‌ను టాప్ చేయాలి. ఇదివరకు సెట్ చేసుకుని ఉంటే ఇక్కడ స్క్రీన్‌టైమ్ పాస్‌కోడ్‌ని ఎంటర్ చేయాలి.
- కంటెంట్ అండ్ ప్రైవసీ రెస్ట్రిక్షన్స్‌ను టోగెల్ చేయాలి. ఆపై స్విచ్ టర్నాన్ అయిందీ లేనిదీ సరి చూసుకోవాలి.
- కంటెంట్ అండ్ ప్రైవసీ రెస్ట్రిక్షన్స్‌ని టాప్ చేయాలి. తదుపరి కంటెంట్ అండ్ ప్రైవసీ రెస్ట్రిక్షన్స్‌కు నేవిగేట్ చేయాలి.
- వెబ్‌కంటెంట్‌ని సెలెక్ట్ చేసుకోవాలి. అక్కడ అన్‌రెస్ట్రిక్టెడ్ యాక్సెస్, లిమిట్ అడల్ట్ వెబ్‌సైట్స్, అలౌడ్ వెబ్‌సైట్స్ ఉంటాయి. వాటిలో నుంచి ఒకటి సెలెక్ట్ చేసుకోవాలి.

ఇలా ఐఫోన్‌లో వెబ్‌సైట్స్‌ను బ్లాక్ చేసుకోవచ్చు. ఇలా పిల్లల విషయంలో బ్రౌజింగ్ ఎన్విరాన్‌మెంట్ సేఫ్‌గా ఉండేలా చేసుకోవచ్చు.



యాపిల్ నుంచి ఫ్రీ పాస్‌వర్డ్ మేనేజర్

యాపిల్ తాజాగా పాస్‌వర్డ్ మేనేజర్‌ని ఆరంభించింది. ఇది ఐఓఎస్ 18, ఐపాడ్‌ఓఎస్ 18, మాక్‌ఓఎస్15కి అందుబాటులో ఉంటుంది. యాపిల్‌కు చెందిన ఐక్లౌడ్ కీచెయిన్ ఫీచర్‌కు ఎక్స్‌టెన్షన్‌గా ఇది పనిచేస్తుంది. యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్స్, క్రెడిట్ కార్డ్ వివరాలు, సెక్యూరిటీ కోడ్స్, వైఫై పాస్‌వర్డ్స్ తదితరాలను దాచుకునేందుకు ఇది అవకాశం ఇస్తుంది. యూజర్లు చాలా సమర్థంగా తమ పాస్‌వర్డ్‌లను ఇందులో నిర్వహించుకోవచ్చు. వేర్వేరు ఆన్‌లైన్ అకౌంట్స్ క్రెడెన్షియల్స్ యాక్సెస్ సహా వెరిఫికేషన్ కోడ్స్ జనరేషన్ తదితరాలకు ఇది ఉపయోగపడుతుంది. ఏతావత ఇది మూడో పార్టీ పాస్‌వర్డ్ మేనేజర్ సర్వీసులకు సవాలుగా మారుతుంది.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

హైదరాబాద్ ● శనివారం 15 జూన్ 2024

diksuchi@andhrajyothy.com



హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 26 సీట్లు ఉన్నాయి. నిమ్స్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇది మూడేళ్ల వ్యవధిగల ఫుల్ టైం ప్రోగ్రామ్. గరిష్ఠంగా అయిదేళ్లలో పూర్తిచేయవచ్చు. డాక్టోరల్ కమిటీ అనుమతి మేరకు మరో మూడేళ్లు పొడిగించే వీలుంది. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు; పబ్లిక్ సెక్టార్ సంస్థలు/యూనివర్సిటీలు/ఇతర ఇన్‌స్టిట్యూషన్‌లకు చెందిన ఉద్యోగులు అడ్మిషన్ నాటికి సంబంధిత సంస్థ నుంచి 'నో అబ్జెక్షన్' సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయాలి. ప్రోగ్రామ్ సమయంలో ఇతర డిగ్రీలు/డిప్లొమాలు చేసేందుకు అనుమతించరు.

నిమ్స్‌లో పీహెచ్‌డీ

విభాగాలు-సీట్లు: బయోకెమిస్ట్రీ 3, క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరపిటిక్స్ 1, ఎమర్జెన్సీ మెడిసిన్ 1, మెడికల్ జెనెటిక్స్ 4, మెడికల్ అంకాలజీ 2, మైక్రోబయాలజీ 5, న్యూరాలజీ 1, నెఫ్రాలజీ 6, పాథాలజీ 1, ఫిజియోథెరపీ 2.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(లైఫ్ సైన్సెస్/అలైడ్ మెడికల్ సైన్సెస్) ఉత్తీర్ణులు; కనీసం 55 శాతం మార్కులతో ఎంబీబీఎస్/ బీడీఎస్ ఉత్తీర్ణతతోపాటు ఏడాది రీసెర్చ్ అనుభవం ఉన్నవారు; నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీతో పాటు రీసెర్చ్ అనుభవం ఉన్నవారు; ఎన్ఎంసీ/డీఎన్‌బీ నుంచి ఎండీ/ఎంఎస్ ఉత్తీర్ణులు; ఎంటెక్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/డేటా సైన్స్/మెషిన్ లెర్నింగ్/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ జేఆర్ఎఫ్, ఐసీఎంఆర్-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్, డీబీటీ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్, ఇన్‌స్పైయిర్ ఫెలోషిప్ అర్హతల్లో ఒకటి ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: పరీక్ష 50 మార్కులకు ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ మెథడాలజీ, బయో స్టాటిస్టిక్స్, ఎథిక్స్ అంశాల నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ఇది అన్ని విభాగాలవారికి కామన్‌గా ఉంటుంది. రెండో పార్ట్‌లో అభ్యర్థులు హ్యూమన్ అనాటమీ, హ్యూమన్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, సెల్ బయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మకాలజీ విభాగాల నుంచి మూడింటిని ఎంచుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థి ఎంచుకొన్న విభాగాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. వీరిని మాత్రమే ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. తరవాత మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2000
- **మెడికల్ ఎగ్జామినేషన్ ఫీజు:** రూ.4050
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **డాక్యుమెంట్స్ సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూలై 1
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 3
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూలై 6 నుంచి
- **నిమ్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 13
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 18
- **ఇంటర్వ్యూలు:** జూలై 25, 26
- **ఇంటర్వ్యూ ఫలితాలు విడుదల:** జూలై 30
- **అడ్మిషన్ తేదీ:** ఆగస్టు 3
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** ఆగస్టు 17
- **వెబ్‌సైట్:** www.nims.edu.in



విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ- 'డిప్లొమా ఇన్ ఫిషరీస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ పొందవచ్చు. ప్రభుత్వ కళాశాలల్లో 55 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 440 సీట్లు ఉన్నాయి. 75 శాతం సీట్లను కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రత్యేకించారు. 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో డిప్లొమా

పాలిటెక్నిక్ కళాశాలలు

- కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్, ముతుకూరు
- కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్, నరసాపురం
- శ్రీ ఎంవీకేఆర్ ఫిషరీస్, భావదేవరపల్లి
- బీ ఆర్ ఫిషరీ పాలిటెక్నిక్, నర్సీపట్నం
- పైడ కాలేజ్ ఆఫ్ ఫిషరీస్ పాలిటెక్నిక్, పటవల
- పైడ గ్రూప్ ఫిషరీస్ పాలిటెక్నిక్, పటవల
- శ్రీ నిధి ఫిషరీస్ పాలిటెక్నిక్ కాలేజ్, చేకురపాడు
- బెల్లంకొండ ఫిషరీస్ పాలిటెక్నిక్, కంబాలపాడు
- శ్రీ వేంకటేశ్వర ఫిషరీస్ పాలిటెక్నిక్, టక్కోలు
- శ్రీ వేంకటేశ్వర ఫిషరీస్ పాలిటెక్నిక్, ఎస్ఎస్ఆర్ పురం
- శ్రీ హరి ఫిషరీస్ పాలిటెక్నిక్, పసుపుల

అర్హత: ఎస్ఎస్‌సీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ నుంచి 2024 మార్చిలో పదోతరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్, ఏపీఓఎస్ఎస్, టీఓఎస్ఎస్ అభ్యర్థులు; కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/ మధ్యలో ఆపేసినవారు కూడా అర్హులే. ఇంటర్/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తుకు అనర్హులు. 2024 ఆగస్టు 31 నాటికి అభ్యర్థుల వయసు 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **ఎడిటింగ్ ఆప్షన్:** జూలై 2 నుంచి 3 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 6
- **వెబ్‌సైట్:** apfu.ap.gov.in

ఎయిమ్స్ రిషికేశ్‌లో ఎమ్మెస్సీ

రిషికేశ్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- ఎమ్మెస్సీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- మెడికల్ బయోకెమిస్ట్రీ 7, మెడికల్ ఫిజియాలజీ 2, మెడికల్ ఫార్మకాలజీ 2, పెర్ఫ్యూజన్ టెక్నాలజీ 2 సీట్లు ఉన్నాయి.
- మెడికల్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఎమ్మెస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఎమ్మెస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌నకు బీఎస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. మిగిలిన మెడికల్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లకు ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీఫార్మసీ/నాలుగున్నరేళ్ల బీపీటీ/మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి.

రిటెన్ టెస్ట్: పరీక్ష సమయం మూడు గంటలు. అభ్యర్థి ఎంచుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 200. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం పర్సెంటైల్ రావాలి.



ముఖ్యసమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,000; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులకు ఫీజు లేదు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూలై 15 నుంచి
- రిటెన్ టెస్ట్ తేదీని త్వరలో ప్రకటిస్తారు.
- **రిజిస్టర్డ్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ఎగ్జామినేషన్ సెల్, ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రిషికేశ్-249203
- **వెబ్‌సైట్:** www.aiimsrishikesh.edu.in

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ(డీఓఏఏటీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో కంప్యూటర్ నాలెడ్జ్, మేథమెటిక్స్, జనరల్ నాలెడ్జ్ అంశాలకు సంబంధించి మొత్తం 30 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 30. నెగెటివ్ మార్కులు లేవు. మోడల్ ప్రశ్న పత్రాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

నీలిట్‌లో ఎంటెక్ ప్రోగ్రామ్

గోరఖ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)-ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎలక్ట్రానిక్స్ డిజైన్ అండ్ టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ డిజైన్ స్పెషలైజేషన్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 18 సీట్లు ఉన్నాయి. ఇన్‌స్టిట్యూట్ లెవెల్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు. గేట్ అభ్యర్థులకు ఏఐసీటీఈ నుంచి పీజీ స్కాలర్‌షిప్ లభిస్తుంది. నాన్ గేట్ అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ స్కీం కింద సంస్థ స్టయిపెండ్ చెల్లిస్తుంది.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో (బీఈ/బీటెక్)(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీ) కోడ్ పేపర్‌కు నిర్దేశించిన గేట్ సిలబస్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. ఈ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 19
- **కౌన్సెలింగ్:** జూన్ 20
- **వెబ్‌సైట్:** nielit.gov.in

ఎస్‌బీఐలో ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్లు

ఖాళీలు 150

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), సెంట్రల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్...రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్(ఎంఎంజీఎస్-2)- మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2

అర్హతలు: ఏదైనా విభాగంలో డిగ్రీ, ఐఐబీఎఫ్ ఫారెక్స్ సర్టిఫికేట్‌తో పాటు ట్రేడ్ ఫైనాన్స్ ప్రాసెసింగ్‌లో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2023 డిసెంబరు 31 నాటికి 23 నుంచి 32 సంవత్సరాల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.48,170 - రూ.69,810

పోస్టింగ్ ఏరియా: హైదరాబాద్, కోల్‌కతా

దరఖాస్తు రుసుము: రూ.750. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు చెల్లింపు మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 27

వెబ్‌సైట్: https://sbi.co.in/

ఎన్ఎఫ్‌సీలో మెడికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్.. అడ్‌హక్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టు: జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్: 3 ఖాళీలు

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

వయోపరిమితి: 50 ఏళ్లు మించకూడదు

జీతం: నెలకు రూ.98,400

ఇంటర్వ్యూ తేదీ: జూన్ 24

వేదిక: ఎన్ఎఫ్‌సీ గెస్ట్‌హౌస్(గురుకుల్), న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, ఈసీఐఎల్ ఫ్యాక్టరీ దగ్గర, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://nfc.gov.in/

జాబ్ కార్నర్

బీఎస్ఎఫ్‌లో వెటర్నరీ ఖాళీలు

ఖాళీలు 6

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్.. కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. హెడ్ కానిస్టేబుల్(వెటర్నరీ): 4 పోస్టులు
2. కానిస్టేబుల్(కెన్నెల్‌మన్): 2 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, వెటర్నరీ స్టాక్ అసిస్టెంట్ కోర్సు సర్టిఫికెట్‌తో పాటు పని అనుభవం ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరమితి: 18-25 సంవత్సరాల మధ్య ఉండాలి

జీతభత్యాలు: నెలకు హెచ్‌సీకి రూ.25,500 - రూ.81,100; కానిస్టేబుల్‌కు రూ.21,700 - రూ.69,100.


ఎంపిక విధానం: రాత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.100


దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 17

వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/




లిటిల్స్




బద్ధకానికి శిక్ష

ఒక ఊరిలో రామ వర్మ అనే జమీందారు ఉండేవాడు. అతన దగ్గర అంకయ్య, వెంకయ్య అనే ఇద్దరు కూలీలు ఉండేవారు. ఆ జమీందారు చాలా క్రమశిక్షణ కలవాడు. ప్రతిరోజూ తెల్లవారుఝామునే నిద్ర లేచి, ఆ నౌకర్లు ఇద్దరినీ నిద్రలేపి పొలం పనికి పంపేవాడు. ఇది ఆ ఇద్దరు పనివాళ్లకు నచ్చేది కాదు. మరి కొంతసేపు నిద్ర పోనివ్వకుండా తమ యజమాని ప్రతిరోజూ చీకటితోనే లేపి పొలానికి పంపుతాడని జమీందారును తిట్టుకునే వారు. అంత మెత్తటి పట్టు పరుపు పైన హాయిగా పడుకున్నా కూడా తమ యజమానికి అంత ఉదయమే ఎలా మేలుకుంటున్నాడా? అని ఆలోచించాడు. కూపీ లాగాడు. చివరికి ఒక కోడిపుంజు ప్రతిరోజూ చీకటితోనే లేచి కూయడం వల్లే యజమాని మేలుకుంటున్నాడని తెలుసుకున్నాడు. ఒకరోజు ఆ కోడి పుంజును ఎవరూ చూడకుండా తీసుకుపోయి కోసుకుని తిన్నాడు. ఆ మర్నాడు కోడి కూయక పోవడంతో ఆలస్యంగా నిద్రలేచి, పనులన్నీ ఆలస్యంగా జరగడం గమనించాడు జమీందారు. తరువాతి రోజునుండి సరిగా నిద్ర పోనందు వల్ల అర్ధ రాత్రే నిద్ర మేలుకుని, ఆయనకు మెలకువ వచ్చిన సమయానికే నౌకర్లు ఇద్దరినీ లేపి పనిలోకి పంపడం ప్రారంభించాడు. దానితో వారిద్దరికీ అంతకుముందు ఉన్నంత నిద్ర కూడా ఉండక 'అనవసరంగా కోడి పుంజును తినేసి.. మన విశ్రాంతి సమయాన్ని మనమే తగ్గించుకున్నాం' అని ఇద్దరూ బాధపడ్డారు.


సరైన నీడ ఏది?



ఎన్ని వరాహాలు ఉన్నాయి?



7 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 333

7			1					2
1								
	2			3		7		6
5	3				9	6		
	6		7		1		9	
		4	2				5	8
6		5		7			3	
								4
2					4			5

సుడోకు - 332 సమాధానం

6	3	8	1	2	5	4	9	7
1	4	2	6	7	9	3	5	8
7	9	5	4	3	8	6	2	1
4	5	7	9	6	1	8	3	2
9	8	3	7	4	2	1	6	5
2	6	1	8	5	3	7	4	9
3	1	9	5	8	4	2	7	6
8	7	4	2	9	6	5	1	3
5	2	6	3	1	7	9	8	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.